₹30


# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక


ఫిబ్రవరి – 2022


DECCAN LAND, HYDERABAD


114



- మనం మరిచిన సంస్థాన మహిళలు
- తెలంగాణ గిరి'జనం' జాతర
- 'రైతు బీమా' రూపశిల్పి
- భూగోళపు రిఫ్రిజిరేటర్లు


MASTER OF ARCHITECTURE
(INTERIOR DESIGN)
APPROVED BY COUNCIL OF ARCHITECTURE
AFFILIATED TO JNAFAU
Candidates who could not appear for GATE / TS PGECET 2021 also can directly apply for B Category Seats
ADMISSIONS ARE IN PROGRESS
• Interior Design Studio
• Theory of Aesthetics and Design
• Interior Design Materials and Construction
• Interior Design workshop
• Furniture Design
• Building Services System and Interior Design
For Inquiries Contact
Admin : +91 9121155517 / 9121155518
www.jbrac.edu.in
Email:jbrarchitecture@jbgroup.org.in
JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
ESTABLISHED IN 2012


MASTER OF ARCHITECTURE
(ENVIRONMENTAL DESIGN)
APPROVED BY COUNCIL OF ARCHITECTURE
AFFILIATED TO JNAFAU
Candidates who could not appear for GATE / TS PGECET 2021 also can directly apply for B Category Seats
ADMISSIONS ARE IN PROGRESS
• Environmental Design Studio
• Energy Simulations E.C.B.C
• Research Methods
• Building Energy Management
• Environmental laws
• Sustainable Site planning and landscape design
• Building Physics
For Inquiries Contact
Admin : +91 9121155517 / 9121155518
www.jbrac.edu.in
Email:jbrarchitecture@jbgroup.org.in
JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
ESTABLISHED IN 2012





## యునెస్కో వారసత్వ నగరం అహ్మదాబాద్

భారత దేశంలోని పశ్చిమ రాష్ట్రాల్లో అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో ఒకటైన అహ్మదాబాద్ నగరాన్ని (గుజరాత్) జూలై 8, 2017న యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చబడింది. భారతదేశంలో యునెస్కోచే గుర్తించబడిన మొట్టమొదటి నగరం అహ్మదాబాద్. ఈ నగరం వారసత్వ ప్రదేశాల యొక్క నిధి. భారతదేశంలోని సబర్మతీ నది తూర్పు ఒడ్డున 15వ శతాబ్దంలో సుల్తాన్ అహ్మద్ షా స్థాపించిన గోడల నగరం అహ్మదాబాద్. ఈ నగరం సుల్తాన్ కాలం నాటి గొప్ప నిర్మాణ వారసత్వాన్ని అందిస్తుంది. ముఖ్యంగా భద్ర కోట, కోట నగరం యొక్క గోడలు, ద్వారాలు తదితర నిర్మాణాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. మసీదులు, సమాధులు అలాగే తరువాతి కాలంలో ముఖ్యమైన హిందూ, జైన దేవాలయాలు, దిగుడు బావులు, మతపరమైన సంస్థలు వంటి లక్షణాలతో గేటెడ్ సాంప్రదాయ వీధుల్లో (పురాస్) చక్కగా నిర్మించి సాంప్రదాయ గృహాలతో (పోల్స్) రూపొందించబడింది. ఈ నగరం ఆరు శతాబ్దాల నుండి నేటికీ గుజరాత్ రాష్ట్రానికి రాజధానిగా కొనసాగుతుంది.

TELANGANA
RESOURCE CENTRE

"**CHANDRAM**" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com




## యాంగ్రీయంగ్ ఉమెన్ లీడర్ ఈశ్వరీబాయి

ఎక్కడ ఏ మూల అన్యాయం జరిగినా వేదికలపైనుండి అర్ధశతాబ్ది క్రితం జరిగిన వాటిని కూడా ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి పరిష్కారానికి డిమాండ్ చేసిన ఏకైక మహిళా నాయకురాలు జె. ఈశ్వరీబాయి. మహిళా సంక్షేమం గురించి, ఆ శాఖలో జరిగే అక్రమాలను శాసనసభల్లో, పలు వేదికల్లో నిరభ్యంతరంగా విమర్శించేవారు. గ్రామ సేవకుల ఉద్యోగాలను పర్మినెంటు కోసం, షెడ్యూలు కులాల విద్యార్థుల వసతి గృహాలు గురించి ఎంతో పోరాడారు. ఈశ్వరీబాయి తెలంగాణా ఉద్యమాన్ని బలపరిచి తెలంగాణా ప్రజాసమితి కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. ఈశ్వరీబాయి గొప్ప వక్త. గొప్ప కార్యదక్షురాలు. సేవాతత్పరత, పేదలపాలిట కల్పవల్లి అని పలువురిచే అభినందనలు పొందారు. వారి వ్యక్తిత్వంలోని విశిష్టతను మరొక్కసారి దక్కన్‌ల్యాండ్ పత్రిక ద్వారా తెలియజేసి గుర్తు చేసిన రచయిత్రి డా॥ ముక్తేవి భారతికి, దక్కన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– డి. రాజేశ్, మెదక్

❖ ❖ ❖

## దక్కన్ పీఠభూమిలో సిక్కులు

దక్కను పీఠభూమి ఎన్నో జాతులకు, సంస్కృతులకు పుట్టినిల్లు. ఎన్నో శతాబ్దాల తన ప్రయాణంలో ఎన్నెన్నో జాతులను ఇముడ్చుకున్నది. భిన్న ఆదివాసి జాతులకు ఆలవాలమైన ఈ భూమి ఆధునిక సంస్కృతులకు కూడా వేదికైంది. భౌగోళికంగా నిజాం రాజ్యం చాలా పెద్దది. ఈ సంక్లిష్ట భూభాగాన్ని పరిపాలించడం కొంత ఇబ్బందితో కూడిన వ్యవహారంగా మారింది. అప్పుడు నిజాం తన పరిపాలన అస్తవ్యస్థంగా మారితే ఇతరుల పై ఆధారపడడం ప్రారంభించాడు. 19వ శతాబ్దపు శాంతి సైన్యంగా దక్కన్‌లో అడుగిడిన సిక్కు సైన్యం, ఈ ప్రాంత ఔన్నత్యం కోసం పాటుపడింది. తెలంగాణలో మూడు, నాలుగు తరాలుగా సిక్కులు జీవిస్తున్నారు. ఒకరిపై ఆధిపత్యంగాని, జులుంగాని చేసిన దాఖలాలు లేవు. సిక్కులు ముస్లింలతో సోదర భావంతో మెలుగుతున్నారు. సిక్కుల సాంస్కృతిక జీవన విధానాన్ని తెలియజేసిన రచయిత బి. వేణుగోపాల్‌రెడ్డిగారికి అభినందనలు.

– తుల్జారాంసింగ్, వికారాబాద్

❖ ❖ ❖

## 'కరణం' పదాన్ని ప్రస్తావించిన కురుమిద్ది శాసనం

కరణము అంటే 'లెక్కలు వ్రాయు వాడు' అని, కరణీకము అంటే కరణము వాని పని అని. కరణం, మునసబు అనే పదాలు గ్రామాధికారులకు సూచిక. కరణం అంటే గ్రామంలోని పొలం కొలతల పట్టీని నిర్వహించే వారు. ఏదైనా పొలం అమ్మాలన్నా, కొనాలన్నా ఆ పొలం గురించి కరణం మాటే వేదం. క్రీ.శ. 1046లో కురుమిద్ది శాసనంలో ప్రస్తావించినట్లు వివరంగా స్థపతి ఈమని శివనాగిరెడ్డి గారు క్లుప్తంగా వివరించారు. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న మొదటి పర్యాయంలోనే కరణం, మునసబుల వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ సంస్కారాలను ప్రవేశపెట్టారు. క్రీ.శ. 1046 నాటి కురుమిద్ది శాసనంలో మహా మండలేశ్వర బిజ్జరస అనే సామంతున్ని, అతని కొడుకులైన యువరాజ శంకరస, అణెమరసలు గురించి తొలిసారిగ ప్రస్తావించబడినారని, కరణం నాగమయ్య చెక్కిండని అలనాటి మేటి తెలంగాణ శాసనాల్లో వున్న కరణం వ్యవస్థ గురించి విపులంగా తెలియజేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– బి.ఆర్. భార్గవ్, మహబూబ్‌నగర్

❖ ❖ ❖

## దాచుకో దగ్గ పత్రిక దక్కన్ పత్రిక

పరవస్తు లోకేశ్వర్ 'పిట్టలోళ్ల పిట్ట గోస పార్థీవాడ ఆపైన గాజిబండ', డా॥ సీతారామారావు 'పర్యావరణం శాస్త్రం నైతికత తాత్విక దృక్పథాలు', చకిలం వేణుగోపాల్‌రావు 'తెలంగాణా శిలాజ సంపద', ఈస్టర్ క్లిఫర్డ్ 'భవన నిర్మాణంలో కీలకం దే లైటింగ్ డిజైన్', సువేగా 'భారతదేశంలోని మౌంటైన్ రైల్వేలు', 'వారసత్వ సంపద పెంబర్తి హస్తకళ', కట్టా ప్రభాకర్ 'తెలంగాణ అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ కేంద్రం', డా॥ లచ్చయ్యగాండ్ల 'అంటార్కిటికా చెపుతున్న భూతాప గోస?' డా॥ బొల్లేపల్లి సుదక్షణ 'అసఫ్‌జాహీల పాలనలో విద్యాభివృద్ధి' ఇలా వేటికి అవే ప్రత్యేకమైన ఆర్టికల్స్ అందిస్తున్న దక్కన్ ల్యాండ్‌కు అభివందనాలు.

– ఎ. చైతన్య, కడప

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా ISSN 2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

– ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 10 సంచిక: 6 పేజీలు: 60

ఫిబ్రవరి - 2022

సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

editordeccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

8374995555

కవర్‌పేజీ

**అహ్మదాబాద్ నగరం**

layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా


TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

# లోపలి పేజీల్లో...



ఇరు ధృవాలు
- భూగోళపు
రిఫ్రిజిరేటర్లు



మహిళల
మదిని దోచే
మట్టి గాజులు


సిరిప్రెగడ భార్గవరావు ............ డా॥ తిరునగరి ............ 6
భావితరాల ప్రయోజనకారి - నేటి విద్యావిధానం....... (ఎడిటోరియల్)ఎం. వేదకుమార్ ............ 7
మనం మరిచిన సంస్థాన మహిళలు ............ సంగిశెట్టి శ్రీనివాస్ ............ 9
భగ్నహృదయాల దయ్యాల మేడ 'వికార్ మంజిల్' ............ పరవస్తు లోకేశ్వర్ ............ 13
పర్యావరణం-శాస్త్రం-నైతికత-తాత్విక దృక్పథాలు ............ డా॥ ఆర్. సీతారామారావు ............ 15
ఇద్దరు రాజుల ఉజ్జలికోట శాసనం ............ ఈమని శివనాగిరెడ్డి ............ 19
ఆకాశంలో తెగిపడే చుక్కలు ............ చకిలం వేణుగోపాల రావు ............ 21
తెలంగాణ గిరి'జనం' జాతర ............ కట్టా ప్రభాకర్ ............ 23
'రైతు బీమా' - రూపశల్పి ............ కందుకూరి రమేష్ బాబు ............ 27
పర్యావరణ హితంగా భారతదేశం ............ దక్కన్ న్యూస్ ............ 30
యునెస్కో వారసత్వ నగరం అహ్మదాబాద్ ............ సువేగా ............ 31
మహిళల మదిని దోచే మట్టి గాజులు ............ సువేగా ............ 38
యక్షగాన సాహిత్యంలో కల్పిత కథలు ............ డి.రాజు ............ 41
అమ్మదేవతల కొలువు ............ శ్రీరామోజు హరగోపాల్ ............ 43
ఉప్పునీరు ఎందుకు చొచ్చుకొస్తుంది? ............ డా. ఈదా ఉదయ భాస్కర్ రెడ్డి ............ 46
ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ............ ఎసికె. శ్రీహరి ............ 49
ఇరు ధృవాలు - భూగోళపు రిఫ్రిజిరేటర్లు ............ డా॥ లచ్చయ్య గాండ్ల ............ 51
సిరిధాన్యాలతో మెట్ట రైతుకు మేలు ............ డా॥ ఖాదర్‌వలి ............ 55
పుస్తక సమీక్ష ............ బాలచెలిమి ............ 57
బాలారణ్యంలో ఒక రోజు ............ ఆనబోయిన స్వామి ............ 58



**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# సిరిప్రెగడ భార్గవరావు

"పల్లెలు మా నివాసములు పచ్చని పంట పొలాలు మా మనః పుల్లత గూర్చు చైత్రములు, బోదెల పైని రసాల శాఖికా పల్లవముల్ గ్రసించు చిరుపాటలదియాని తేనెతేటలు జిల్లు పికంబు మా యనుగుచెల్లెలు గానమె మాదు ప్రాణమౌ".

అని కంఠమెత్తి పాడిన కవికోకిల సిరిప్రెగడ భార్గవరావు.

ఎక్కడో నల్లగొండ జిల్లాలోని చండూరు సమీపముగల చిరుపల్లె గూడెపల్లిలో సిరిప్రెగడ జన్మించారు. ఆయన జనన తేది కూడా సాహితీలోకానికి తెలియదు. చాలా పిన్న వయస్సులోనే 1963లో ఆయన అస్తమించారు.

1934లో గుంటూరు జిల్లా 'ఏదుబాడు' నుండి 'కవిరత్న' అంబటిపూడి వేంకటరత్నంగారు నల్లగొండ జిల్లాలోని చండూరుకు వచ్చి అక్కడే స్థిరనివాస మేర్పరచు కున్నారు. కృష్ణభక్తులైన అంబటిపూడి వారు సంస్కృతాంధ్ర భాషా విశారదులు, విద్వత్కవులు. చండూరు పరిసర ప్రాంతాల ప్రజల ఆదరాభిమానాలు అనతికాలంలో ఆయనకు దండిగా లభించాయి. ప్రజల సహకారంతో తమ ఆశ్రమంలో కృష్ణభక్త సమాజాన్ని స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో కృష్ణసంకీర్తన సభలు నిర్వహించారు. సహజంగా కవులైన అంబటిపూడి 'సాహితీ మేఖల' అనే సంస్థను స్థాపించారు.

**సిరిప్రెగడ భార్గవరావు నవ్యభావకవి. కవితా తపస్వి, రససిద్ధుడు. తెలంగాణపు ముద్దుబిడ్డ. భార్గవరావు శోకమే పద్యమై పొంగివచ్చింది. భావకవుల కవిత్వం వలెనే సిరిప్రెగడ కవిత్వమంతా ఆత్మాశ్రయమే. సంప్రదాయ మూల్యాలను పరిరక్షించి, అద్భుతమైన పద్యాలను రచించిన భార్గవరావును, నవ్యభావకవి అని విమర్శకులు పేర్కొన్నారు.**

అనేకమంది శిష్యులను కూడగట్టుకున్నారు. వారితో సంస్కృత కావ్యాలు పూర్వాంధ్ర కావ్యాలు, నవ్యాంధ్ర కావ్యాలు చదివించారు. సాహిత్య దేశికులుగా వారికి భాష పట్ల, సాహిత్యం పట్ల అభిమానం కలిగించడంలో కృతకృత్యులయ్యారు. వారి శిష్యులలో సిరిప్రెగడ భార్గవరావు, పులిజాల హనుమంతరావు, ధవళ శ్రీనివాసరావు, పులిజాల గోపాల రావు, మద్దోడు సత్యనారాయణ, తాడిశెట్టి నరసింహ గుప్త, మంచుకొండ శివలింగయ్య వంటి ప్రముఖులు ఉన్నారు. వారిలో భార్గవరావు సంస్కృతాంధ్ర భాషావ్యవసాయం ఎక్కువగా చేసినవారు. ఆయనది కవితారూప తపస్సు, పద్యరచనలో తనదైన శైలీ రమ్యతను సాధించారు. గంగాఝురీ ప్రవాహ సదృశం అయన కవితాధార. ఆయన జీవించి ఉండగా రచనలేవీ ముద్రింపబడలేదు. భార్గవరావు మరణానంతరం 1967లో ఆయన పద్య రచనలన్నీ 'భార్గవానందల హరి' పేరుతో గ్రంథంగా వెలువడింది. అది సాహితీ జగత్తును ఓ కుదుపు కుదిపింది. ఆకృతిని చదివి ప్రశంసించని సాహితీపరుడు, సహృదయుడు లేడు.

సిరిప్రెగడ భార్గవరావు నవ్యభావకవి. కవితా తపస్వి, రససిద్ధుడు. తెలంగాణపు ముద్దుబిడ్డ. భార్గవరావు శోకమే పద్యమై పొంగివచ్చింది. భావకవుల కవిత్వం వలెనే సిరిప్రెగడ కవిత్వమంతా ఆత్మాశ్రయమే. సంప్రదాయ మూల్యాలను పరిరక్షించి, అద్భుతమైన పద్యాలను రచించిన భార్గవరావును, నవ్యభావకవి అని విమర్శకులు పేర్కొన్నారు.

ఆనాటి కవి ప్రవరకందరికి నీడనిచ్చిన కవితా మాకందం పాపాతీమేఖల, భార్గవానందలహరిలో

'వీణానిక్వణనమ్ముతోడ, కబరివిన్యస్తపుష్పానన
ధ్యానమ్ముక శ్రుతి గూర్చియున్ గళమునెత్తంబాపు ఆ
వేళనీ
సానందద్యుతి చంద్రికా లలితలాస్యన్యాస మైసర్గిక
శ్రీ నైర్మల్యము ఖంబు జూపగదె తల్లీ
సాహితీ మేఖలా'

అంటూ ఆ సంస్థ గొప్పతనాన్ని సిరిప్రెగడ ప్రస్తుతించారు. వృత్తరచనలో, శిల్పతో శబ్దాలంకార ప్రయోగము అరితేరిన కవి సిరిప్రెగడ. భార్గవానందలహరిలో

పన్నీరు, కన్నీరు, మున్నీరు, భక్త్యాంజలి అనేవి ప్రధాన శీర్షికలు

పన్నీరులో – ప్రాంజలి, గానేందిర, ఏకాంతగోష్ఠి, వెలబాలుడు, మధురయామిని, తెలుగుతల్లి, మధులక్ష్మి, ఓదార్పు ఆవేదన అన్న ఖండకావ్యాలున్నై,

కన్నీరు, సతీవియోగంతో రచించిన శోకకావ్యం.

మున్నీరులో యశోద పిలుపు, వేణుగానం, ఏకాంత గోష్ఠి, రాధికా విరహగీతి, అందాల కలము, భావమైత్రి వంటి పదమూడు ఖండికలున్నై.

భక్త్యంజలిలోని నాలుగు ఖండకావ్యాలు ఆయన గురుదేవులైన అంబటిపూడి వెంకటరత్నంగారిని ప్రస్తుతిస్తూ రచించినవే.

కోతలు వడ్డ నాయెడ దక్కునే నవనీతము
భిక్షపెట్టి ప్ర
స్థిత మనోజ్ఞగానరస సింధువుచే నుపశాంతి గూర్చి లీ
లాతత పాదనూపుర ఝుళంఝుళ రమ్యరమమున్ స్ఫుర
ద్దీతికలందజేసి జగతిన్ నను నిల్పెడి వాణి మ్రొక్కెదన్
అని (ప్రాంజలి)

వాణీని కవి ప్రశంసించిన తీరు మనోజ్ఞం.

కన్నులరమోడ్చి కమ్మని కంఠమెత్తి
సుందరోహకరంబితానందగగన
యానములలోన మోహనగార ఝుల


(తరువాయి 8వ పేజీలో)

# భావితరాల ప్రయోజనకారి-నేటి విద్యావిధానం

*అనేక సామాజిక రుగ్మతలకు మూలం నిరక్షరాస్యత.*

*ఈ నిరక్షరాస్యతకు మూలం సామాజిక అసమానతలు.*

విద్య, వైద్య విధానాల రూప కల్పన, ఆచరణ ఆయా సామాజికాభివృద్ధికి కారణమవుతాయి. నూతన రాష్ట్రం ఏర్పడినాక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ విద్య అందాలన్న సదాశయంతో దేశంలో మరెక్కడా లేని విధంగా కెజీ టూ పీజీ ఉచిత విద్యకు అంకిత భావంతో అంకురార్పణ చేసింది. గిరిజన, ఆదివాసీ, మైనారిటీ, దళిత బహుజన విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలను, స్థానిక, ప్రాంతీయ భాషల అభివృద్ధిలో భాగంగా ఉర్దూ పాఠశాలలను, మోడల్ స్కూళ్లను విజయవంతంగా నిర్వహిస్తున్నది. కరోనా అన్ని రంగాల వలె విద్యా రంగాన్ని అతలాకుతలం చేసింది. సుదీర్ఘకాలం విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఆన్‌లైన్ క్లాస్‌లు అందరికీ అందుబాటులో లేవు. డ్రాఫ్-అవుట్స్ పెరిగాయి. సుదీర్ఘకాలం పాఠశాలలు మూసివేత వల్ల వచ్చే అనర్థాల గురించి విద్యా వేత్తలు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉన్నారు. వీటిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరోనా మూడవ వేవ్ విజృంభిస్తున్న సమయంలో కూడా ఎందరు వ్యతిరేకించినా పాఠశాలలను తెరిచింది. విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నది.




ఇంతవరకూ రెసిడెన్షియల్, ప్రైవేట్ పాఠశాలలకే పరిమితమైన ఇంగ్లీష్ మీడియంను వచ్చే ఏడాది నుంచి 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని స్థాయిల్లో ప్రవేశ పెట్టాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఇంగ్లీష్ బోధించగలిగే సామర్థ్యమున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ యిస్తుంది. ఎల్‌కేజీ, యూకేజీ వలె ఒకటవ తరగతికి ముందు ప్రత్యేక ఇంగ్లీష్ శిక్షణకు ప్రయత్నిస్తుంది. ఈ విధానాన్ని నిర్ధిష్టంగా అమలు చేయడానికి విద్యాధికారులు, విద్యావేత్తలతో చర్చలు నిర్వహిస్తుంది. ఏ మీడియం కావాలన్న ఎంపికను విద్యార్థుల, తల్లిదండ్రులకు యిస్తుంది. ఈ రెండు మాధ్యమాల విద్యావిధానం విద్యార్థుల ప్రయోజనాలను కాపాడుతోంది. ఈ విధానాన్ని ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు హర్షిస్తున్నారు. నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అంకిత భావంతో చర్యలు తీసుకుంటున్నందుకు అభినందనలు. అయితే ఈ నూతన విద్యా విధాన ఆచరణలో వున్న సాంకేతిక అడ్డంకులను పరిష్కరించుకోవలసి వుంది.

రైతుల జీవిత బీమా పథకం రైతులకు బలమైన భరోసా 2018 ఆగస్ట్ 15న ప్రారంభించిన ఈ పథకం వల్ల ఈ మూడున్నర ఏళ్లలో 72వేల మంది రైతులు పరిహారం పొందారు. రైతుల తరఫున ప్రభుత్వమే ప్రతి ఏడాది వెయ్యి కోట్ల రూపాయలు ప్రీమియం చెల్లించడం దేశంలో మరెక్కడా లేదు. ఈ నిశ్శబ్ద విప్లవ రూపకర్త కేసీఆర్ అభినందనీయులు.

ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతర ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరగబోతున్న మేడారం జాతర. ఎనిమిది శతాబ్దాలుగా ఒక తరం నుంచి మరో తరానికి సాంస్కృతిక వారధి ఈ జాతర. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అధికారిక జాతర. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఈ జాతర లివింగ్ హెరిటేజ్. ఈ విశిష్టతను UNESCO దృష్టికి తీసుకెళ్లి UNESCO గుర్తింపును సాధించే వైపుగా ప్రభుత్వం, పురావస్తు, వారసత్వ సంపద పరిరక్షకులు, సామాజిక, సాంస్కృతిక శాస్త్రవేత్తలు కృషి చేయాల్సి వుంది.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

నాలపింతుమురమ్ము నాయందునీవో వంటి పద్యాలు (ఏకాస్త గోష్ఠి) పదు తెలంగాణ

సిరిప్రెగడ భావకవితా సౌందర్యాన్ని ఎత్తి చూపుతాయి.

కృష్ణశాస్త్రిని తలపుకు తెస్తాయి.

'నాలోన వందబృందానమ్ములు లేచి
దిగ్దిగంతల నర్తిల్లనిమ్ము
నాలోన వేయిరత్నాకరంబులు పొంగి
శంపాలతత గౌగిలింపనిమ్ము
నాలోన లక్షఘంటానాదములు మించి
నినదించి జగమెల్ల నిండనిమ్ము
నాలోన గోటి చందన సౌరభములూరి
ఆ సీమ ఈ సీమ నలమనిమ్ము
నీ యశోవైభవ ప్రవాహయామాన
గౌతమీకృష్ణవేణి ప్రపూతశీత
నవ పయోధార నాహృదానందవిధి
కావ్య కమనీయసారై కదలనిమ్ము (తెలుగుతల్లి).

సిరిప్రెగడ పోతన్నలాగా పోతపోసిన సీసపద్యాల రచన ఆయన కవితా ప్రౌఢిమకు శైలీరమ్యతకు పరమోదహరణాలు.

సిరిప్రెగడ 'కన్నీరు' పద్యాలు వింటే శిలలు ద్రవించి ఏడుస్తాయి. భార్యవియోగంతో క్రుంగిపోయి ఆయనలోని శోకం ఏరై పారింది. తెలుగు సాహిత్యంలో భార్యావియోగం వస్తువుగా దువ్వూరి, విశ్వనాథ వంటి ప్రముఖులు రచించిన కావ్యాలు అందరికీ తెలిసినవే. నేనెరిగినంతవరకు 'కన్నీరు' వంటి శోకకావ్యం తెలుగు సాహిత్యంలో రాలేదు.

శోకబంధురమైన జీవితం గడుపుతూ ఉండగా భార్గవుడికి వివాహమయింది. తన జీవితం సుఖప్రదమైందని ఆనందించాడు. కొద్దికాలం అర్ధాంగిలో స్వర్గాన్ని దర్శించాడు. అనుభవించాడు. తాను సర్వస్వంగా భావించిన ఆమె అకస్మాత్తుగా కన్ను మూసింది. భార్గవరావు ఘనభోంత రాళాలు ద్రవించి పోయేలా విలపించాడు. ఆయన జీవితపు సోంపుల మేడలు కూలిపోయినాయి. కన్నీటి కణాలే మిగిలినాయి.

*'నా యానందయవై దరస్మితమవైన వెల్లువై చూడ్కివై
నా యుత్సాహమలై సుధారంజనిపై నాశయ్యపై సుప్తివై
నా యిష్టంబుల ప్రోవువై మానసువై నా సర్వమై నేనయై
మాయంబైతివి నీవు నీవులేని జగతీ మధ్యన నే
మిధ్యగాన్.'* (కన్నీరు)

అన్న ఒక్క పద్యం చాలు సిరిప్రెగడ హృదయం దుఃఖార్ణవ మైందని చెప్పడానికి.

కన్నీరులోని ప్రతిపద్యం ఘోషించిన కవినేత్రాల నుండి రాలిన అశ్రుకణం ..

*'కనుదోయిన్ ముకుళించినన్ దెరచినన్
క్రమస్మితంబొప్పమో
హనధావళ్య సుచేతవై
నూసితవర్ణాన్వీత సచ్ఛేళవై
కనువిందై త్రిజగన్మనోజ్ఞ
లలనాకల్యాణ ఖండంబ ! నిన్
క్షణమైనన్ మరువంగ జాలన సుతుల్ జ్వాలారు
నందాకనున్* (కన్నీరు)

కన్నీరులో అనలైన కవి హృదయము పొంగి పొరలి ప్రవహించింది అన్నారు కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి.

సిరి భార్గవరావు అంబటిపూడి వెంకటరత్న దేశికుల అంతే వాసిత్వంలో ఎదిగిన కవి కుమారుడు. ఆ గురుదేవులకు శిష్యుడు భుక్తితో సమర్పించుకొన్న ప్రసూనాంజలి భక్త్యంజలి.

*'బ్రతుకెల్లన్ వడగట్టి సత్కళకుధారన్‌వోసి యుద్రద్రసాం
చిత సత్కావ్యములన్ రచించి కవులన్ సృష్టించి
నిద్రాణమై
న తెలంగాణమునందు నింపె కవితానంద
ప్రవాహోర్మిలా
లితరజ్యన్నవనాద సద్గళ కళాలీలా విభూతుల్ వేసన్*
(ముగ్గురుదేవులు)

అని తెలంగాణలో అంబటిపూడి చేసి సాహితీసేవను ప్రస్తుతించారు.

జీవితంలో దెబ్బలు తిన్నవాడు భార్గవరావు. ఆ బాధలోంచి అద్భుత కవిత్వం పలికినవాడు. భార్గవుడు వాఙ్మయ తపస్వి అన్నారు రాయప్రోలు.

ఈ కవి చక్కగా నిర్దుష్టముగా పద్యములు వ్రాయగల వాడని, భావసంగ్రహణ బుద్ధియని తోచినది ఈ చిన్నికావ్యమాతని యశఃపతాకగా నిలుచుగాక, ఇది విశ్వనాథ ప్రశంస.

'తెలంగాణము తెలుగుతల్లి అందాలకోరె. ఆ తల్లి తన కొప్పులో ముద్దుగా ముడుచుకొన్న ఒక మల్లెమొగ్గ మన భార్గవుడు' అన్నారు మహాకవి శేషేంద్ర.

జీవనగాథను కవితామయం చేసి పిన్న వయసులోనే అస్తమించిన సిరిప్రెగడ భార్గవరావు. తెలుగు వారు గర్వించే తెలంగాణ మహాకవి. ఒకే ఒక వేదనామయ కావ్యం 'భార్గవానందలహరి' ద్వారా సాహిత్య ప్రపంచంలో దేదీప్యమానంగా వెలిగే కవిద్యుమణి.

తెలుగువారికి పోతనలా ప్రాతఃస్మరణీయుడైన మధురకవి. సిరిప్రెగడ భార్గవరావు వేలకలంబుగైకొని చిగిరిన భావపరంపరా విమద్దాలల నాలలాడుచు రసోదయసిద్ధి గడించుకొన్న రాగాలసమైన సత్కవిభావము సిరిప్రెగడది.

తెలుగు కవితా సామ్రాజ్యంలో కలకాలం నిలిచే కవిచక్రవర్తి, ఆరని తెలంగాణ కవితాజ్యోతి సిరిప్రెగడ.

*'జయన్తితే సుకృతినో
రస సిద్ధాః కవీశ్వరాః
నాస్తితేషాయశః కాయే
జరామరణ జంభయమ్'.*

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన* **'తెలంగాణ తేజోమూర్తులు'** *నుంచి)*

**- డా॥ తిరునగరి**

# మనం మరచిన సంస్థాన మహిళలు

హైదరాబాద్ రాజ్యమే ఎనుకటి ఇండియాలో పెద్ద సంస్థానం. దానికి అనుబంధంగా ప్రతి జిల్లాలో చిన్న, పెద్ద సంస్థానాలు పరిపాలన సాగించేవి. ఈ సంస్థానాధీశులతో చాలా మందికి దగ్గరి సంబంధాలుండేవి. దోమకొండ సంస్థానానికి అమరచింత సంస్థానాధీశులతో, గద్వాల సంస్థాన పాలకులకు మెదక్ జిల్లాలోని పాపన్నపేట సంస్థానానికి, జటప్రోలు (కొల్లాపురం) సంస్థానాధీశులకి వెంకటగిరి, నూజివీడు, బొబ్బిలి పాలకులతో, వనపర్తి సంస్థానం వారికి మునగాల పాలకులతో సంబంధ బాంధవ్యాలుండేవి. ఇవన్నీ ఆ పరిపాలన సజావుగా జరగడానికి, వారి రాజరికాన్ని, అధికారాన్ని నిలుపుకోడానికి ఏర్పాటు చేసుకున్న బాంధవ్యాలు. పెద్ద సంస్థానాలతో పాటుగా చిన్న చిన్న సంస్థానాలు కూడా చాలానే ఉండేవి. మహబూబ్‌నగర్ జిల్లాలోని బోరవెల్లి, లోకాయపల్లి, నల్లగొండ జిల్లాలోని సంస్థాన్ నారాయణపురం, రాజపేట, నిజామాబాదులోని సిర్నాపల్లి, ఖమ్మంలోని పాల్వంచ ఇలా అనేక సంస్థానాలు, జమిందారీలు సాహిత్య పోషణతో పాటుగా, తెలంగాణ సాంస్కృతిక వికాసానికి దారులు వేసి, కళలకు ప్రోత్సాహమిచ్చారు. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు పరిస్థితి భిన్నంగా ఉండింది. తెలంగాణలోని దాదాపు అన్ని సంస్థానాల్లో పరిపాలన ఎప్పుడో ఒకప్పుడు మహిళల చేతుల్లో ఉందనేది అక్షరసత్యం. వారసత్వ గొడవలు, దత్తపుత్రుల ఎంపిక, ఈ సంస్థానాల్లో ఎడతెగని సమస్యలుగా ఉండేవి. వనపర్తి, గద్వాల లాంటి పెద్ద సంస్థానాలు తప్ప మిగతా సంస్థానాలన్నీ పేరు గొప్ప ఊరు దిబ్బ లాగుండేది. అభివృద్ధికి ఆమడదూరంలో ఉండి, నిజాం పాలకులను అనుసరిస్తూ, అధికార మత్తులో ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వకుండా వారిపై పన్నులు వేస్తూ డబ్బులు పిండుకునే వారు. ఇది తర్వాతి కాలంలో తిరుగు బాటుకు కూడా దారి తీసింది. మునగాల సంస్థానంలో ప్రజలు ప్రత్యక్షంగా తిరుగుబాటు చేశారు. ఆంధ్ర మహాసభ తరఫున నిజనిర్ధారణ సభ్యులుగా గద్వాల సంస్థాన స్థితిగతులు పరీక్షించిన బద్దం ఎల్లారెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామిలు తమ నివేదికలో ఆ సంస్థానాధీశులు చేస్తున్న దుర్మార్గాలను రికార్డు చేశారు. ఇక మునగాలలో అధిక పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమించిన రైతులు అందులో తమ ప్రాణాల్ని అర్పించుకున్నారు. మునగాల జమిందార్ రాజా నాయని వెంకట రంగారావు తెలంగాణలో తొలి చైతన్య వికాసాలు ప్రజ్వలితం చేసిన వ్యక్తే అయినప్పటికీ 1940వ దశకం ఆరంభం నాటికి సంస్థానంపై అజమాయిషీ అధికారులపై వదిలివేయడంతో వారు ప్రజల్ని దోచుకునే వారు. దాంతో అంతకు ముందు ఆయన చేసిన సేవలు కూడా గుర్తింపుకు నోచుకోకుండా పోయాయి.


కొల్లాపూర్ సంస్థాన్

మెదక్ జిల్లాలో అతిప్రాచీనమైన సంస్థానం పాపన్నపేట. ఈ సంస్థానాధీశులు నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసి యుద్ధంలో తమ ప్రాణాల్ని సైతం అర్పించి తెలంగాణ ప్రజలకు మార్గదర్శకులయ్యారు. రాణి శంకరమ్మ కత్తి పట్టి యుద్ధం చేసిన అపర రుద్రమ దేవి. ఈమె వీరగాథలు ఇప్పటికీ గ్రామాల్లో మార్మోగుతాయంటే ఆమె ఘనతను అర్థం చేసుకోవచ్చు. ఈ సంస్థానాల్లో మహిళలు పాలించిన కాలంలో జరిగిన కార్యకలాపాలు, నోచుకున్న అభివృద్ధి, చోటు చేసుకున్న ఆధునికత, పోషించిన కళలు, సాహిత్యం తెలుసుకోవడం ద్వారా తెలంగాణ ప్రగతిని అర్థం చేసుకోవచ్చు. ఇందులో ప్రభ్వీణుల పాత్ర, ఈ కాలంలో వెలువడ్డ సాహిత్యానికి వారు చేసిన ఇతోధిక సేవ, మొత్తం తెలంగాణ అభివృద్ధిలో వారి తోడ్పాటు అంచనా వేయడానికి ఈ పరిశీలన ఒక పరికరంగా ఉపయోగపడుతుంది. కొందరు సంస్థానాధీశులు కర్కషంగా వ్యవహరించినందుకు అందర్నీ నిందించడం కూడా సబబు కాదని అర్థం చేసుకోవాలి. నాటి కాల, స్థల, పరిస్థితులను బట్టి సంస్థానాధీశుల చర్యల్ని పరిశీలించి చరిత్రలో వారి పాత్రపై ఒక నిర్ణయానికి రావాల్సిన అవసరముంది. ఇందుకు సాహిత్యం, ఇంటర్వ్యూలు, గెజిట్స్, పత్రికలు ఇలా చాలా వనరుల నుంచి సమాచారాన్ని సేకరించి క్రోడీకరించుకొని సంస్థాన పాలక, మహిళల పాత్రని నిర్ధారించాలి. తెలియకుండా పోయిన చరిత్రను పరిశోధించి వెలుగులోకి తేవాలి. కొత్తగా రాసుకోవాలి.

వనపర్తిలో జానమ్మ, గద్వాల ఆదిలక్ష్మి దేవమ్మ, పాపన్నపేట శంకరమ్మ, అమరచింత భాగ్య లక్ష్మమ్మ, మునగాల లచ్చాయమ్మ ఇలా ప్రతి ఒకరు అపర రుద్రమదేవిలా పరిపాలన చేసి ప్రజాభ్యున్నతికి కృషి చేశారు. ముందుగా సాహిత్య రంగానికి చిరస్మరణీయమైన సేవ చేసిన రాణీ భాగ్యలక్ష్మమ్మ గురించి తెలుసుకుందాం.

### రాణీ భాగ్యలక్ష్మమ్మ

తెలంగాణ సాహిత్య గౌరవానికి తగిలిన దెబ్బకు స్పందనగా సురవరం ప్రతాపరెడ్డి సంకలనం చేసిన తెలంగాణ కవుల 'గోలకొండ' సంచిక అంకితం పొందిన మహిళ ఈ భాగ్యలక్ష్మమ్మ. ఆధునిక కాలంలో ఇది తొలి తెలంగాణ (కవితా) సంచిక. అమరచింత – ఆత్మకూరు సంస్థానం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది. మొదట ఈ సంస్థానం అజరుచింత (అమరచింత) వర్ధమాను అను రెండు

పరగణాలుగా ఉండేది. ఇందులో మొత్తం 64 గ్రామాలుండేవి. 1292 సంవత్సరంలో ఏర్పాటయిన ఈ సంస్థానంలోని 25వ తరం వాడయిన రాజా శ్రీరామ భూపారామభూపాలరావు చనిపోయిన 4 సంవత్సరాలకు భాగ్యలక్ష్మమ్మ అధికారంలోకి వచ్చింది. భావ సంవత్సర జ్యేష్ఠ శుక్ల పూర్ణిమ (1933?) నాడు అధికారాన్ని చేపట్టిన భాగ్యలక్ష్మమ్మ తన భర్తతో కలిసి అనంతశయనము, సేతు మొదలైన దక్షిణ దేశ యాత్రలను చేసి అక్కడి భక్తులకు వసతి సదుపాయాలు కల్పించారు. ఈమె గురించి గోలకొండ కవుల సంచిక ఇలా పేర్కొంది.

"శ్రీమంతు సవైరాజా శ్రీరామభూపాలరావు బల్వంత బహదరుగారి పట్టపు రాణి శ్రీమంతు సవైరాణి భాగ్యలక్ష్మమ్మ గారు పతివ్రతా శిరోమణులు, దేవబ్రాహ్మణ భక్తియుక్తులు, ప్రజాపాలనా ప్రావీణ్యురాలు, న్యాయైక విచక్షణలు, ధైర్య స్థయిర్య సౌశీల్య చాతుర్య వినయాది సుగుణోపేతలు, విద్యా వివేకయుతులు, రాజనీతి నిపుణురాలు." (గోలకొండ కవుల సంచిక, 1934)

నిజాం నవాబుచే 1343 (1933 ప్రాంతం) ఫసలీలో అధికారానికి వచ్చిన భాగ్యలక్ష్మమ్మ ఖర సంవత్సరం ఆశ్వయుజ శుక్ల షష్టినాడు వృషభలగ్న మందు దోమకొండ సంస్థానాధీశులగు జస్వంత్, రంగమాంబ దంపతులకు జన్మించారు. గోలకొండ కవుల సంచికను అంకితమిస్తూ సురవరం ప్రతాపరెడ్డి ఇలా పేర్కొన్నారు.


వనపర్తి సంస్థాన్

"అమరచింత - ఆత్మకూరు సంస్థాన ప్రభ్విణి శ్రీశ్రీశ్రీ సవైరాణీ భాగ్యలక్ష్మమ్మ బహదరువారికి - శ్రీవారి నిర్మల యశస్సౌరభము నిఖిలాంధ్ర ప్రపంచమునందు చిరస్థాయిగా బ్రబలరించునట్లు - గోలకొండ ఆంధ్ర కవివరేణ్య కవితా విలాసపుష్పము' కృతజ్ఞతా బద్ధముగా - అనుజ్ఞాపూర్వకముగ సమర్పితము." ఆ నాటికి పెద్ద సంస్థానాలైన గద్వాల, వనపర్తి కాకుండా అమరచింత సంస్థానాధీశురాలికి అంకితమివ్వడంలో ప్రతాపరెడ్డికి ఆమెతో గల సాన్నిహిత్యమే కారణం. రాణి కోరిక మేరకు అంతకుముందు సంస్థానంలో జరిగే అవకతవకలను అరికట్టే నిమిత్తం అక్కడ పర్యటించి తీసుకోవాల్సిన చర్యల్ని భాగ్యలక్ష్మమ్మకు సూచించడం కూడా జరిగింది. అలాగే సంస్థానం పూర్తి బాధ్యత కోర్టు నుండి అప్పుడప్పుడే తన అధికారంలోకి రావడంతో గోలకొండ కవుల సంచిక ప్రచురణకు ఆవిడ విరివిగా విరాళాలిచ్చి ఆదుకున్నారు. బహుశా అందుకే ఆమెకు అంకితమిచ్చి ఉంటాడు. తమ సంస్థానంలో ప్రతి యేటా ఫాల్గుణ శుక్ల తదియ, చవితి రోజుల్లో విద్వత్కవి గాయక సభలు నిర్వహించే వారు. ఇందులో తెలుగు సీమలోని ప్రతి ప్రాంతం నుంచి పండితులు పాల్గొనే వారు. సవైరాణి భాగ్యలక్ష్మమ్మ పరిపాలన సమయంలో కూడా ఈ సభలు ఏలాంటి లోపం లేకుండా జరిగేవి. రాఘవశాస్త్రి లాంటి ప్రాచీనులే గాకుండా నవీనులైన నంబాకం రాఘవాచార్యులు, బులుసు అప్పన్న శాస్త్రి, గాడేపల్లి వీరరాఘవ శాస్త్రి, తిరుమల బుక్కపట్టణం వేంకటాచార్యులు మొదలయిన కవి పండితుల చేత శాస్త్ర పరీక్ష చేయించి వారికి బహుమతులందజేసే వారు. (సురవరం ప్రతాపరెడ్డి, గోలకొండ కవుల సంచిక, 1934, హైదరాబాద్).

భాగ్యలక్ష్మమ్మ భర్త రామభూపాలు బహదూర్ తల్లిదండ్రులు రామలక్ష్మమ్మ, సీతారామ భూపాల బల్వంత బహదూరు. రామభూపాలుడు శా. శకం 1810 (క్రీ.శ 1888) సర్వధారి సంవత్సర అధిక చైత్ర శుక్ల పంచమినాడు వృశ్చిక లగ్నమందు జన్మించాడు. ఈయన ఆంధ్రాంగ్ల, పార్సీ భాషలభ్యసించాడు. ఈయన విశ్వావసు సంవత్సరంలో రాజ్యభారం తండ్రి ద్వారా స్వీకరించి ప్రమోదూత సంవత్సర వైశాఖ బహుళ అమావాస్యనాడు మరణించాడు. అనంతరం దాదాపు నాలుగేళ్ళ తర్వాత భాగ్యలక్ష్మమ్మ రాజ్యభారాన్ని, నిజాం ద్వారా సనదుని స్వీకరించింది. ఈమె బంధువు తాటికొండ అనంత రెడ్డి ప్రోత్సాహము ద్వారా గోలకొండ కవుల సంచిక ప్రచురణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తోడ్పడింది. (తూమాటి దోణప్ప; ఆంధ్ర సంస్థానములు సాహిత్య సేవ)

సవై మహారాజా రామభూపాల రావు కాలంలోనూ (1915-1930) కాలంలోనూ, తర్వాత భాగ్యలక్ష్మమ్మ కాలంలోనూ విద్వత్సభలు కొనసాగాయి. ఈ సభలు ప్రతియేటా ఫాల్గుణ శుద్ధ తదియ, చవితి రోజుల్లో జరిగేవి. ఇందులో పాల్గొనేందుకు దూరప్రాంతాల నుండి కూడా ఎందరో పండితులు హాజరయ్యేవారు. ఇందులో బులుసు అప్పన్నశాస్త్రి, త్రిపురాంతక శాస్త్రి, గాడేపల్లి వీరరాఘవ శాస్త్రి, శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి, అవధానం చంద్రశేఖర శర్మ, పోకూరి కాశీపతి అవధాని, పెద్దమందడి వేంకట కృష్ణకవి, చెమికల చెన్నారెడ్డి తదితరులు పాల్గొనేవారు. వీరికి తిరుమల బుక్కపట్టణం వేంకటాచార్య, నంబాకం రాఘవాచార్యులు పరీక్షాధికారులుగా వ్యవహరించే వారు. (ఎస్వీ రామారావు, మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వం).

శ్లో. శ్రీమద్దివ్యరథాంగ శంఖ మహా పద్మాగిసర్వాయుధైః
శమత్కౌస్తుభ దివ్యహారమణిభి శ్రీవత్స చిహ్నాదిభిః
యుక్త శ్రీపతి రేషనిత్యమవతు శ్రీభూమినీళాదిభిః
శ్రీరామా వనిపాల మౌళి మహిషీం శ్రీ భాగ్యలక్ష్మంబికాం

- తిరుమల బుక్కపట్టణం వేంకటచార్యులు

మం. స్థిర సామ్రాజ్యమనాయంబు జయలక్ష్మీ వ్యాప్తి శశ్వద్యశ
స్ఫురణంబండిత పోషనాభిరతి సంపూర్ణానుకంపాప్తియున్
బరమౌదార్యము నైజపాదభజన వ్యాసంగమున్ గూర్చి శ్రీ
కర కుర్మూర్తి గిరీశుడోము నిను దీక్షన్ భాగ్యలక్ష్మంబికా

- దీక్షితుల నరసింహన్ శాస్త్రి

జయతు జయతు నైజాం చక్రవర్తీ రాజ్యం
జయతు జయతు రాజత్ప్రజా తత్కుటుంబం
జయతు జయతు తస్యానుగ్రహాల్లబ్ధ రాజ్యా

జయతు జయతు రాజ్ఞీ భాగ్యలక్ష్మంబికాఖ్యా

– జోస్యం వేంకటాచర్యులు

(గోలకొండ కవుల సంచికలో ఆశీస్సు పేరిట గ్రంథాదిలో ఈ పద్యాలున్నాయి)

**మునగాల**


ఈ మునగాల సంస్థానం చాలా ప్రాచీనమైంది. 1262 – 1326 మధ్యకాలంలో ఇది కాకతీయుల చక్రవర్తుల కింద సామంత రాజ్యం. ఔరంగజేబు కాలంలో దీనికి సన్నదు దొరికింది. 1802 (?)లో సర్కారులపై ఆధిపత్యానికై ఇంగ్లీష్, ఫ్రెంచి వారికి జరిగిన ఆధిపత్య పోరులో మునగాల వారు ఇంగ్లీష్ వారికి మద్దతుగా ఒక ఫ్రెంచ్ పటాలాన్నీ ఓడించడంతో బ్రిటిష్ వారు జమిందారీ హోదా కల్పించారు. మెకంజీ కథనం ప్రకారం గుర్లపాటి అయ్యన్న దేశాయి వీరి పూర్వీకుల్లో ఒకరు. 1693లో అయ్యన్న దేశాయి మరణించడం, అంతకుముందే ఆయన కుమారుడు చనిపోవడంతో కోడలు సుభద్రమ్మకు సంస్థానాధికారం సంక్రమించింది. అయితే సంస్థాన పరిపాలన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించలేక పోవడంతో ఆమె సోదరుడు కీసర ముకుందప్ప మునగాల పాలకుడయి ఔరంగజేబు సన్నదు పొందిండు. ముకుందప్ప తర్వాత ఆయన కోడలు, నరసన్న భార్య అయిన లచ్చాయమ్మ మునగాల సంస్థాన నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. ఈమె, యుద్ధతంత్రంలో, రాజనీతిలో చాకచక్యంతో రాణించి సంస్థానానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చింది. ఈమె కుమారుడు వెంకటరామన్న. ఆయన కుమారుడు వెంకట నరసింహారావు 1802లో ఇంగ్లీషు వారి నుండి సన్నద్ – ఇ మిల్కియత్ ఇస్తిమిరార్ స్వీకరించాడు. వెంకట నరసింహారావు అనంతరం ఆయన కుమారుడు కోదండరామయ్య రాజ్యభారం వహించి 1814లో అకాలమరణం పొందాడు. ఈయన కుమారుడు వెంకటనరసింహారావు పసివాడగుటచే సంస్థానము 1814 – 1818 మధ్యన కోర్టు ఆఫ్ వార్డ్స్ వశమయింది. ఆ తర్వాత 1818లో వెంకటనరసింహారావు అధికారంలోకి వచ్చి 18 యేండ్లు పాలించి 1836లో మృతి చెందాడు. ఈయనకు సంతానం లేనందున కోదండరామయ్య అనే అతన్ని దత్తత తీసుకున్నారు. ఈతను మైనర్ కావడంతో మరోసారి అధికారము కోర్టాఫ్ వార్డ్స్ చేతిలోకి వెళ్ళింది. 1850లో కోదండరామయ్యకు సంస్థాన పట్టం దక్కింది. అయితే అది ఎంతో కాలం నిలువలేదు. 1854లో కోదండరామయ్య మరణించడంతో ఆయన భార్య రుక్కమ్మ జమిందారిణీ అయ్యింది. ఆమె 14 సంవత్సరాలు పాలన చేసి 1868లో మరణించింది. అయితే వారసత్వ గొడవల కారణంగా 1873లో సంస్థానపాలకురాలిగా బాధ్యతలు చేపట్టిన లచ్చుమ్మారావు 1892లో చనిపోయేవరకు వాటిని నిర్వహించారు. ఈమె పాలన కాలంలో మునగాల సంస్థానం కార్యకలాపాలు శిరిపురం కేంద్రంగా నడిచాయి. అనంతరం కేసరి రుక్కమ్మ కూతురు లచ్చుమ్మా రావు అధికారంలోకి వచ్చి వరంగల్లు జిల్లాకు చెందిన నాయని వెంకట రామయ్యని వివాహమాడింది. ఆయన నిస్సంతుగా మరణించడంతో 1888లో మరో బంధువు మహబూబాబాద్ తాలూకా నెల్లికుదురు గ్రామానికి చెందిన నాయని రాఘవ రెడ్డి మూడో కుమారుడు రంగారెడ్డిని లచ్చుమ్మారావు దత్తత తీసుకుంది. ఆయనకు వెంకటరంగారావు అని నామకరణం చేసింది. మైనర్ అయిన కారణంగా సంస్థానం కోర్టాఫ్ వార్డ్స్ లో ఉండింది. నాయని వెంకట రంగారావు 1900లో మేజర్ అయి సంస్థాన బాధ్యతలు స్వీకరించాడు. కేసరి రుక్కమ్మ, ఆమె కుమార్తె లచ్చుమ్మారావు ఆధునిక కాలంలో మునగాల సంస్థానికి మూలస్థంబాలని చెప్పవచ్చు. ఎన్నో కోర్టు కేసులు ఎదుర్కొని సంస్థాన అధికారాన్ని నిలుపుకొని ఆధునికత ద్వారాలు తెరిచారు. మూడు వైపుల మద్రాసు ప్రెసిడెన్సీ యిలాకా ఉండడంతో మచిలీపట్నం, జగ్గయ్యపేట, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో జరిగే కార్యకలాపాలు తమ సంస్థానంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేశారు. విద్యావసతులు కల్పించారు. అయ్యదేవర కాళేశ్వర రావు, కొమర్రాజు వెంకట శివయ్య, పింగళి వెంకయ్య తదితరుల్ని సంస్థాన ఉద్యోగులుగా నియమించి వారిచే కార్యకలాపాలు నడిపించారు.





గద్వాల్ సంస్థాన్

1930వ దశకం నాటి సంస్థానం ఖజానా వివిధ వ్యాజ్యాల మూలంగా ఖాళీ కావడంతో ప్రజలపై అధికభారం మోపి దౌర్జన్యాలు కొనసాగించండంతో ప్రజలు తిరుగుబాటు చేశారు. ఈ సమయంలో జమిందారు వివిధ వ్యాజ్య గొడవల్లో ఇరుక్కొని వరంగల్లు, హైదరాబాద్, మచిలీపట్నం, మద్రాసు కోర్టుల్లోనూ, లండన్ ప్రీవీ కౌన్సిల్లోనూ కేసులు నడిచాయి. నాయని వెంకటరంగారావు తన వ్యాజ్యాలే గాకుండా తన భార్య తాలూకు, ఆమె పితృ సంబంధమైన వ్యాజ్యాలను, తన మరదలు ఎనసాని రుక్కమ్మ వ్యాజ్యాలను, వనపర్తి రాజా కుమారుని వ్యాజ్యాలు కూడా చూడాల్సి వచ్చింది. రెండు కేసులైతే 40 యేండ్లకు పైగా సాగాయంటే వాటికి ఆయన వెచ్చించిన మొత్తం అందుకు ఖజానా ఖాళీ అయిన తీరు అవగతమవుతుందని తటవర్తి వెంకటేశ్వరరావు అంటున్నారు. (తటవర్తి వెంకటేశ్వరరావు – మునగాల పరగణా ప్రజా ఉద్యమ చరిత్ర, మునగాల, 1981).

–సంగిశెట్టి శ్రీనివాస్,
m:98492 20321
e: sangishettysrinivas@gmail.com





రకరకాల కారణాలతో తెలంగాణ ప్రముఖుల చరిత్రలు అంతగా వెలుగులోకి రాకుండా పోయాయి. ఆయా ప్రముఖులపై ప్రజలకు ఒక అవగాహన కల్పించేలా వివిధ వ్యాసాల సంకలనంతో మనిషి పేరిట తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది.




పై పుస్తకాలు లభించు చిరునామా :

టీఆర్‌సి 3-6-712/2, స్ట్రీట్ నెం.12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఫోన్ : 9030 6262 88. Email: trchyd@gmail.com



వికార్‌మంజిల్ ప్యాలెస్

# భగ్నహృదయాల దయ్యాల మేడ 'వికార్ మంజిల్'

**ప్రేమకోసం తాజ్‌మహల్ వెలిసింది. ఒక ప్రియుడు, తన ప్రియురాలికి ఇచ్చిన ప్రేమ కానుకగా హైద్రాబాద్ నగరం అవతరించింది.**

అసలు హైద్రాబాదే ఒక ప్రేమనగరం. కొడుకు మీద ప్రేమతో ఒక ముసలి తండ్రి నిర్మించిన వంతెన పూరానాపూల్. తన ముస్లిం భార్య మీద ప్రేమతో ఒక ఆంగ్లేయుడు కట్టించిన భవనమే కోఠిలోని రెసిడెన్సీ. ప్రస్తుతం ఇది ఉమెన్స్ కాలేజీగా చెలామణి అవుతుంది. ఒక ముస్లిం ప్రేమికుడు తన పార్సీ భార్యకోసం కట్టించిన మహల్ "వికార్ మంజిల్". అతను ఎవరో కాదు ఫలక్‌నుమా ప్యాలెస్ నిర్మాత వికారుల్ ఉమ్రా. ఈ ప్రేమలన్నీ విభిన్న మతాల మధ్యన సామరస్యతకు సంకేతంగా నిలిచినాయి.

మనం నెక్లెస్ రోడ్‌లో జలవిహార్ దాటి సంజీవయ్య పార్కు వైపు వెళ్లుతుంటే ఎడమ వైపు రైలు లైను వెనుక ఒక పెద్ద బంగళా కనబడుతుంది. అదే వికార్ మంజిల్. ఆ ఏరియా బేగంపేట్ ప్రకాశ్ నగర్ వెనుకభాగం క్రిందికి వస్తుంది. శిథిలావస్థలో, నిర్మానుష్యంగా, ఒంటరిగా బిక్కుబిక్కుమని నిల్చున్న ఆ వికార్ మంజిల్ ఒక "బూత్ బంగ్లా" గా ఇప్పుడు కనబడుతుంది గాని ఒకప్పుడు వైభోవోజ్వలంగా వెలిగిన మహల్ అది. తర్వాత కాలంలో అదొక విషాదకావ్యంగా ఒంటరొంటరిగా మిగిలిపోయింది.

వికారుల్ ఉమ్రా మంచి వయస్సులో చేసుకున్న రెండు పెళ్లిళ్లు కూడా పెద్దలు నిర్ణయించినవే. అందులో ఒకామె నవాబు గారి చెల్లెలు. నిఖాకు ముందు వీరి ముఖాలైనా అతను చూడలేదు. చివరికి జీవితం చరమదశలో ఒక పార్సీ చిన్నదాని ప్రేమలో చిక్కుకున్నాడు.

**"ముజే పూచే బినా దిల్ మే ఆనే లగే**

**మీఠీ నజ్రోంకీ బిజిలీ గిరానే లగే".**

బొంబాయిలో జరిగిన ఒక విందులో ఆ విద్యుల్లత అతనికి తటిల్లున తారసపడింది. ఆమెది కూడా హైద్రాబాద్ నగరమే. పేరు గులాబీ. ఆమె వికాజీ అనే ఒక ఉన్నత పార్సీ కుటుంబానికి చెందిన స్త్రీ. వారిద్దరూ కలుసుకునే నాటికే ఆమె హైద్రాబాద్ నగరంలో డాక్టరుగా పనిచేస్తుంది. అదేగాక ఆమెకు వంశపారంపర్యంగా లభించిన ఆస్తి బోలెడు ఉంది. ప్రథమ వీక్షణంలోనే వారిద్దరూ ఒకరినొకరు దోచుకున్నారు. నిఖా జరిగాక గులాబీ ఇస్లాం మతం స్వీకరించి నూర్జహాన్‌గా పేరు మార్చుకుంది. తన వైద్యవృత్తిని పూర్తిగా వదిలి పర్దాను పాటించి ఇంటికే పరిమితమయ్యింది.

వికారుల్ ఉమ్రా కార్యదర్శి పేరు రజాక్ అలీబేగ్. ఇతను కూడా ఉన్నత వంశీకుడు. ధనిక కుటుంబానికి చెందినవాడు. ఇతను ఒక ఎత్తైన కొండ ప్రాంతంలో అందమైన భవనాన్ని నిర్మించసాగాడు. ఆ ఖర్చు తలకు మించిన భారమయ్యింది. ఇంకా సగం పని కూడా పూర్తి కాలేదు. ఆ భవనం ఎత్తైన కొండ ప్రాంతంలో ఉండటం వలన నిర్మాణానికి అవసరమైన నీళ్లు పైకి ఎక్కించటం చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం "చారానా ముర్గీకో బారానా మసాలా" అన్నట్లయ్యింది. ఏం చేయాలో దిక్కుతోచలేదు. బాగా ఆలోచించగా

చివరికి ఒక చిట్కా దొరికింది.

ఒక పండు వెన్నెల, పున్నమి రాత్రి వికారుల్ ఉమ్రాను ఆ అసంపూర్తి భవనంలోనే విందుకు ఆహ్వానించాడు. గానా బజానాలతో, ధావత్ ధూమ్ ధామ్ జోరుగా హుషారుగా కొనసాగుతుంది. అతిథి ఆ అందమైన వాతావరణానికి పరవశించి ముగ్ధుడైపోయాడు.

ఎదురుగా హుస్సేన్‌సాగర్ దాని అలల మీద నుండి వీస్తున్న శీతల పవనాలు. గాలి కూడా సడిచేయని ప్రశాంతమైన ప్రకృతి. ఆకాశం పందిరి క్రింద కొలువు తీరిన కొత్త భవనం. అట్లాంటి సరైన సమయంలో సరైన బాణాన్ని వదిలాడు రజాక్ అలీ బేగ్.

“నవాబ్‌సాబ్ ఈ మహల్ మీకోసమే నిర్మించాను. దయచేసి దీనిని నా నజరానాగా స్వీకరించండి.”

*పది సంవత్సరాల చట్ట పోరాటం చేసి కోర్టు ద్వారా విజయం సాధించిన నూర్జహాన్ తన ప్రేమ మందిరం వికార్ మంజిల్‌కు తిరిగి వచ్చింది. అప్పటికే ఆ గదులలోని విలువైన వస్తువులన్నీ మాయం అయినాయి. ఆమె ప్రాణప్రదంగా పెంచుకున్న పువ్వుల తోట కూడా ధ్వంసం చేయబడింది. వికార్ మంజిల్‌లోని ఆమె కలల ప్రపంచం కుప్పకూలిపోయింది. జ్ఞాపకాల గాయాలు ఆమెను బాధిస్తుంటే ఆమె ఆ వికార్ మంజిల్‌ను వదిలేసి ఒక చిన్న అద్దె ఇంట్లోకి మారి “దర్ద్ హీ దర్ద్ కా దవా హై” అన్నట్లు 30 సంవత్సరాలు అక్కడే గడిపింది. కాలక్షేపం కోసం అనేక చిత్రాలు వేసేది. చివరికి 1931 లో నగరంలో ప్లేగు వ్యాధి వ్యాపించగా ఆమె ఆ వ్యాధిసోకి మరణించింది.*

“బహుత్‌ఖూబ్. కాని ఉచితంగా తీసుకోవటం ధర్మం కాదు అని అప్పటి వరకు అయిన ఖర్చు అణా పైసలతో సహా ఖరీదు చేసి ఆ అసంపూర్తి భవనాన్ని అన్ని సౌకర్యాలతో ఆధునీకరించి దానికి “వికార్ మంజిల్” అని నామకరణం చేసి తన ముద్దుల భార్య నూర్జహాన్‌కు ప్రేమ కానుకగా సమర్పించాడు. అక్కడ ప్రతిరాత్రి **“రాత్ ఫూలోంకీ, బాత్ ఫూలోంకీ”**లా గుభాళించింది.

“ఆమె నయన శయనాగారంలో” రెండు వసంతాలు రెండు క్షణాలుగా జీవించి 1902లో వికారుల్ ఉమ్రా హఠాత్తుగా అల్లాకు ప్రియమైనాడు. అతని మరణానంతరం ఆమె తన ప్రాణం పట్ల కీడును శంకించి పనిమనిషి వేషంలో కోఠిలోని బ్రిటిష్ రెసిడెన్సీకి పారిపోయి వారి ఆశ్రయంలో తలదాచుకుంది. ఆమె నివసించిన వికార్ మంజిల్‌లోని గదులకు వికారుల్ ఉమ్రా రెండవ భార్య తాళం వేసింది. ఆస్తికోసం భార్యల మధ్య తగాదాలు జరిగాయి. ఉమ్రా రెండవ భార్య 5వ నిజాంకు కూతురు, 6వ నిజాంకు చెల్లెలు. తన స్వార్థం కోసం ఎవర్నైనా హత్య చేసే మొగలుల రక్తం ఆమెలో ప్రవహిస్తూ ఉండేది. తనకు ఇష్టంలేని వారిని ఆమె సులువుగా పరలోకానికి పంపిస్తుందని కథలు వినబడుతుండేవి. ఒక పని మనిషిని ఆమె రహస్యంగా చంపించిందని అందరూ అనుకునేవారు. ఈ నేపథ్యంలో వికారుల్ ఉమ్రా మరణం ఆ పార్సీ యువతిలో ప్రాణభయాన్ని కల్గించింది.

పది సంవత్సరాల చట్ట పోరాటం చేసి కోర్టు ద్వారా విజయం సాధించిన నూర్జహాన్ తన ప్రేమ మందిరం వికార్ మంజిల్‌కు తిరిగి వచ్చింది. అప్పటికే ఆ గదులలోని విలువైన వస్తువులన్నీ మాయం అయినాయి. ఆమె ప్రాణప్రదంగా పెంచుకున్న పువ్వుల తోట కూడా ధ్వంసం చేయబడింది. వికార్ మంజిల్‌లోని ఆమె కలల ప్రపంచం కుప్పకూలిపోయింది.

జ్ఞాపకాల గాయాలు ఆమెను బాధిస్తుంటే ఆమె ఆ వికార్ మంజిల్‌ను వదిలేసి ఒక చిన్న అద్దె ఇంట్లోకి మారి “దర్ద్ హీ దర్ద్ కా దవా హై” అన్నట్లు 30 సంవత్సరాలు అక్కడే గడిపింది. కాలక్షేపం కోసం అనేక చిత్రాలు వేసేది. చివరికి 1931 లో నగరంలో ప్లేగు వ్యాధి వ్యాపించగా ఆమె ఆ వ్యాధిసోకి మరణించింది.

“మధురమైన జీవితాల కథ ఇంతేనా” అన్నట్లు ఆ వికార్ మంజిల్ ఒంటరిగా మిగిలిపోయి దయ్యాల మేడగా మారిపోయింది. రాత్రుళ్లు అందులో పార్సీ దయ్యం తిరుగుతుందని ఇప్పటికీ బేగంపేట ప్రకాశ్‌నగర్ ప్రజలు నమ్ముతున్నారు. దరిదాపులేని అనంతమైన ఇసుక ఎడారిలో కాళ్లు విరిగిన ఒంటరి ఒంటెలా ఆ మహలు పాడుబడి పోయి గబ్బిలాలకు నిలయమయ్యింది.

నేటి వికారాబాద్ ఒకప్పుడు వికారుల్ ఉమ్రా స్వంత జాగీరు ప్రాంతం. అందుకే ఆ జాగీరుకు వికారాబాద్ అని పేరు వచ్చింది. అక్కడి అనంతగిరి “మలయమారుతాలు” చాలా ఆరోగ్యకరమైనవి. నైజాం కాలంలోనే అక్కడ టి.బి. శానిటోరియం ఏర్పడింది. కాళోజీ ఒకప్పుడు అక్కడ కొద్దిరోజులున్నాడు. “వికారాబాద్ కీ హవా ఏక్ లాఖ్ కీ దవా” అన్న సామెత అందరికీ తెలిసిందే. చరిత్ర పునరావృత్తం అన్నట్లు ఎర్రగడ్డ టి.బి. దవాఖానాను మళ్లీ అక్కడికే తరలించాలన్న ఆలోచన కూడా ఉంది.

మీకు వీలైతే ఎప్పుడన్నా నెక్లెస్‌రోడ్డుకు వెళ్ళి రైలు కట్టకు అవతల కనబడే వికార్ మంజిల్‌ను చూసి వికారుల్ ఉమ్రాను, ఆ పార్సీ యువతిని క్షణకాలం జ్ఞాపకం చేసుకోండి.

**“ఆషిక్ మర్‌తే నహీం**
**వో జిందా దఫ్నాయే జాతేహైం**
**కబర్ ఖోద్‌కర్ దేఖో**
**వో ఇంతెజార్‌మే రహతే హైం.”**
ప్రేమికులు మరణించరు
వారిని సజీవంగా సమాధి చేస్తారు
సమాధి త్రవ్వి చూడండి
వారొకరి కోసం మరొకరు నిరీక్షిస్తునే ఉంటారు.

*(షహర్ నామా (హైద్రాబాద్ వీధులు - గాథలు) పుస్తకం నుంచి)*

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# పర్యావరణం – శాస్త్రం – నైతికత – తాత్విక దృక్పథాలు

(గత సంచిక తరువాయి)

**సోషల్ ఎకాలజీ**

ముర్రేబుక్‌చిన్ అనే సామాజిక సిద్ధాంతకర్త సాగించిన ఆలోచనధారను 'సోషల్ ఎకాలజీ'గా వ్యవహరిస్తున్నారు. నాలుగు దశాబ్దాలపై చిలుకుగా ఈయన సామాజిక ఆధిపత్యం, ప్రకృతిపై ఆధిపత్యం మధ్యగల సంబంధాలను గురించి సాగించిన రచనల సారాంశం సోషల్ ఎకాలజీగా గుర్తింపు పొందింది.

ఈయన సాగించిన చింతనకు మూలాలు భిన్న రకాలైన తాత్త్విక సంప్రదాయాలలో కనిపిస్తాయి. ముఖ్యంగా మార్క్సీయ సామ్యవాదం, ఉదార అరాచకవాదం, పాశ్చాత్య జీవవాదాలలో దర్శనమిస్తాయి. అదే విధంగా అరిస్టాటిల్, హెగెల్ వంటి తత్త్వవేత్తల ఆలోచనల ప్రభావం కనిపిస్తుంది.

ముర్రే బుక్‌చిన్ ప్రధానంగా ఆధిపత్యం అనే భావనను పరిశీలించాడు. ఆయన వాడిన సామాజిక ఆధిపత్యం అనేది ఏ అర్థంలో వాడాడో పరిశీలించాలి. ప్రత్యేకంగా ముర్రే సిద్ధాంతంలో శ్రేణులు (hierarchies) అనేది ప్రధాన భావనగా కనిపిస్తుంది. చాలా వివరణాత్మకంగా శ్రేణులు గురించి తెలిపాడు.



"The cultural and psychological systems obedience and command not merely the economic and political system to which the terms class and state most appropriately refer. Accordingly, hierarchy and domination could easily continue to exist in a "class less" or "state less society".

రాజ్యం, వర్గం అనే పదాలు ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను ఎంత ఖచ్చితంగా సూచిస్తాయో, సాంస్కృతిక, సంప్రదాయ, మానసిక వ్యవస్థలైన విధేయత, ఆదేశాలనేవి సూచించవు. వర్గం ఆర్థికాన్ని, రాజ్యం రాజకీయ వ్యవస్థలను సరళంగానే సూచిస్తాయి. అంటే రాజ్యం, ఆర్థిక వ్యవస్థల నుండి ఆదేశం, విధేయతలను మినహాయించి చూశాడు. ఇవి సంప్రదాయం, సాంస్కృతిక, మానసిక వ్యవస్థలకు చెందినవిగా పేర్కొంటున్నాడు. అదేవిధంగా ముర్రే బుక్‌చిన్ ఈ విధంగా అభిప్రాయడ్డాడు.

"Accordingly, hierarchy and domination could easily continue to exist in a "class less" or "state less Society"

పెద్దలు, పిల్లలను, పురుషులు స్త్రీలను, ఒక జాతి మరొకజాతిని, జన సమూహాన్ని, పట్టణం పల్లెపై ఆధిపత్యం నెరపుతుందనే అర్థంలో domination అనే పదాన్ని సూచించాడు.

శ్రేణులు అంటునప్పుడు కనీసం రెండు బృందాలు లేదా సమూహాలు ఉంటాయి. ఒకటి మరొక దానిపై అధికారం కలిగి ఉంటుంది. ఈ అధికారంలో ఆధిపత్యవర్గం ఆదేశాలను ఇస్తుంది. న్యూనవర్గం విధేయతను పాటిస్తుంది. శ్రేణులు సామాజిక వ్యవస్థలో ఆధిపత్యాన్ని ప్రోత్సహిస్తాయి. దీనితో ఆధిక్యతలో ఉన్న బృందం తమకంటే తక్కువగా ఉన్న బృందం ద్వారా తన ప్రయోజనాలను నెరవేర్చుకోగలుగుతుంది. ఇది తమకంటే తక్కువ బృందాల ఆకాంక్షలను నెరవేర్చుకోవటంలో అడ్డుకూడా తగులుతుంది. ఆర్థికవర్గాలలోనే సామాజిక శ్రేణి, ఆధిపత్యం ప్రాథమిక రూపంలో ఉంటుందని సంప్రదాయ మార్క్సిస్టులు భావించినట్లుగా ముర్రే భావించలేదు. అలాగే అనార్కిస్టులు భావించినట్లుగా సామాజిక ఆధిపత్యానికి ఆధునిక రాజ్యం ప్రాథమిక ఏజెంట్‌గా ఉంటుందనీ భావించలేదు. ఆర్థిక వర్గాలు లేని సమాజాలలోనూ ఆధిపత్య నిర్మాణాలుంటాయని భావించాడు. అదేవిధంగా ముర్రే చెప్పిన దానిలో భౌతిక ఆధిపత్యం, అధికారం సామాజిక నియంత్రణకు మాత్రమే సాధనాలు కావు. దీనిని గురించి విశ్లేషించిన Jardins ఈ విధంగా వ్యాఖ్యానించాడు. "Hierarchy" is also a state of consciousness" as well as a social condition. People can be oppressed by their consciousness, their understandings and beliefs, as much as by external forces".

బాహ్యశక్తులు ఎంతగా తమను అణిచివేస్తాయో తమ స్వీయ చైతన్యంలో అంతగా అణచివేయబడతారు. వారి అవగాహనలు, విశ్వాస నమ్మకాలు కూడా అంతగా అణచివేతకు గురవుతాయి.

అంటే సామాజికంగా ఉన్న శ్రేణీగత నిర్మాణాలను ప్రజలు అంతర్లీనపరచుకుంటారు. తద్వారా తమ జీవితాలు అవమానాలకు, అపరాధ భావాలకు గురవుతుండగా, ఆధిపత్యం గలవారు జీవితంలోని సుఖ సంతోషాలను ఆనందిస్తారు. ఈ రకమైన శ్రేణీగత నిర్మాణాలు, ఆధిపత్యం పాతరాతియుగం మొదలుకొని ఆధునిక యుగం వరకు భిన్న రూపాల్లో ఉనికిలో ఉన్నాయని బుక్‌చిన్ గుర్తించి సూచించాడు.

సామాజిక శ్రేణుల పద్ధతుల నుండి ప్రకృతి ఆధిపత్యం మొలకెత్తింది. అయితే బుక్‌చిన్ ప్రామాణిక మార్క్సిస్టు అన్వయాన్ని తల్లకిందులు చేశాడు. మార్క్సిస్టుల దృష్టిలో మానవుల ఆధిపత్య సామర్థ్యం వ్యక్తిగత ఆస్తి సంపదను సృష్టించడానికి దోహదపడింది. వర్గ నిర్మాణాలు వర్గ సంఘర్షణకు అణచివేతకు దారితీశాయి. బుక్‌చిన్ దృష్టిలో ఆధిపత్య సామాజిక నిర్మాణాలు ప్రకృతిపై ఆధిక్యతకు మార్గాన్నిచ్చాయి. అంటే సామాజిక ఆధిపత్య విధానాలు ఒక విస్తృత సాంస్కృతిక మనస్తత్వాన్ని పెంపొందించాయి లేదా భావజాలాన్ని రూపొందించాయి. ఈ భావజాలం ప్రకృతిపై ఆధిపత్యాన్ని సమర్థించేదిగా మిగిలింది. అంటే "social hierarchies provide both the psychological and material conditions- the motivation and the means- for exploiting and dominating nature" అని చెప్పవచ్చు.

శ్రేణీగత సమాజాలలో సామాజిక సంస్థలు, ఆచరణలు అన్నీ

నియంత్రణను కల్పించడానికి రూపకల్పన చేయబడి ఉంటాయి. ఆర్థిక సామర్థ్యం ఒక ఆదర్శంగా పేర్కొనబడుతుంది. ఇటువంటి సమాజాలలో విజయం ఆధిపత్యం వహించటం, నియంత్రించటంగా అవగాహన చేసుకోబడుతుంది. అంటే ఎక్కువ మంది ఒక్కరికోసం పనిచేయటం, అధిక సంపద, అధికారం, హెూదాను కలిగి ఉండటమే విజయంగా అభివర్ణింపబడుతుంది. ఇటువంటి స్థితి ఉన్నప్పుడు సమాజం విజయాన్ని మానవేతర ప్రకృతిపై ఆధిపత్యంగా, నియంత్రణగా గుర్తిస్తుంది. శ్రేణీగత సమాజాలు రద్దు అయినప్పుడు మాత్రమే ప్రకృతి, మానవేతర ప్రపంచం విముక్తమవుతుంది. అట్లాంటప్పుడే పర్యావరణ సంక్షోభాలు అంతరిస్తాయి. సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మానవాధిపత్యం నుండి ప్రకృతికి స్వేచ్ఛ ఎప్పుడు లభిస్తుందంటే మానవులు కూడా ఆధిపత్యం నుండి స్వేచ్ఛ పొందినప్పుడని బుక్‌చిన్ ప్రబలంగా విశ్వసించాడు. బుక్‌చిన్ ప్రతిపాదనలు పర్యావరణ తాత్త్విక సిద్ధాంతాలను ఒకమేరకు ప్రభావితం చేశాయి. మానవాళి తమ ఆధిపత్య ధోరణులను అర్థం చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడింది. పర్యావరణ సంక్షోభాల విషయంగా తాత్త్విక చర్చలను ముందుకు నెట్టింది. పర్యావరణ సంక్షోభాలకు ముగింపు పలికే ప్రతి తాత్త్విక ఆలోచన కూడా అటు పర్యావరణానికి, ఇటు మానవ సమూహాలకు తోడ్పడ్తుందనటంలో సందేహించాల్సిందేమీ లేదు.



**పర్యావరణ స్త్రీవాదం (Ecofeminism)**

పర్యావరణ సంబంధాంశాలను స్త్రీవాద దృష్టికోణంతో పరిశీలించటంతో పర్యావరణ స్త్రీవాదం ఉనికిలోకి వస్తుంది. స్త్రీవాదం పితృస్వామ్య వ్యవస్థ, ఆధిపత్యం, పురుషాధిక్యతలు, కుటుంబ నియంత్రణ, జెండర్‌పరంగా అసమానతలను గురించి పేర్కొంటుంది. సరిగ్గా సామాజిక పర్యావరణ వాదం పేర్కొన్న ఆధిపత్యం, నియంత్రణల గురించి పర్యావరణ స్త్రీవాదం మాట్లాడుతుంది. అటు సోషల్ ఎకాలజీని ఇటు స్త్రీవాదుల ఆలోచనలను కలిపి స్త్రీవాద పర్యావరణమని వ్యవహరిస్తున్నారు. అయితే ఈ రెండింటి మధ్య ఎన్ని సామ్యాలు కనిపిస్తాయో అన్ని తేడాలు కూడా ఉన్నాయి. కాగా ముర్రే బుక్‌చిన్ సామాజిక పర్యావరణ వాదానికి ఆద్యుడు. పర్యావరణ స్త్రీవాదంలో భిన్న ఆలోచనా స్రవంతులు కలగలుస్తాయి. ఇది ఒక ఏకీకృత సిద్ధాంతంగా కంటే, స్త్రీవాదులలో ఎన్ని వైవిధ్యపూరిత దృష్టి కోణాలున్నాయో వాటిని ప్రతిఫలింపజేస్తూ పర్యావరణ సమస్యలపై సాధారణ దృక్పథాలను వెల్లడిస్తుంది. "Social ecology and ecofeminism have much in common in their general analysis of ecological problems. Each sees ecological destruction as related to social problems of control and dominance"

పర్యావరణ విధ్వంసం అనేది నియంత్రణ, ఆధిపత్యం అనే సామాజిక సమస్యలకు సంబంధించిందిగా భావిస్తుంది. అయితే అటు సోషల్ ఎకాలజి గానీ, ఇటు పర్యావరణ స్రీవాదంగానీ ఈ సామాజిక సమస్యలకు భిన్నమైన ప్రత్యేకమైన వివరణలను అందించాయి. అట్లాగే సామాజిక మార్పుకోసం వీరు తలపెట్టే కార్యక్రమాలు కూడా పూర్తిగా ప్రత్యేకం. భిన్నంగానూ ఉంటాయి.

సోషల్ ఎకాలజీ, ఎకోఫెమినిజం పర్యావరణ సంక్షోభాలకు దారితీసిన కారణాలను అన్వేషించేందుకు సమాజాన్ని పరిశీలిస్తాయి. ఈ రెండు కూడా గుప్త పర్యావరణ వాదుల్లా పర్యావరణ విధ్వంసానికి మానవ, సామాజిక కారణాలను విస్మరించవు. ఈ రెండూ మానవకేంద్రక దృష్టికోణమే విధ్వంసాలకు కారణమని అంగీకరించవు. మానవులు రూపుదిద్దుకున్న వ్యవస్థలు, ఆచరణలు కారణమని చెపుతాయి. ముఖ్యంగా న్యాయసమ్మతంకాని వ్యవస్థలు, ఆచరణలను గురించి విమర్శనాత్మకంగా ఉంటాయి. సంప్రదాయ నైతికతల వైఫల్యమే పర్యావరణ సమస్యలకు కారణమనే వాదాన్ని ఇవి అంగీకరించవు. సామాజిక న్యాయం గురించిన సంప్రదాయ సిద్ధాంతాలు పర్యావరణ సమస్యలను విశ్లేషించడానికి తగినవనే దృక్పథాన్ని వీరు అంగీకరించరు. కొన్ని సామాజిక కారణాలు పర్యావరణ సంక్షోభాలకు మూలం అని వాదిస్తారు.

Specifically, social ecologists and ecofeminists believe that the domination and degradation of nature arise from social patterns of domination and hierarchy, patterns of social life in which some humans excercise control or domination over others"

సామాజిక పద్ధతులు సామాజిక జీవితంలో కొందరు ఇతరులపై నియంత్రణను, ఆధిపత్యం కలిగి ఉండటానికి వీలు కల్పించాయని ఇవే ప్రకృతిపై ఆధిపత్యానికి ప్రకృతిని క్షీణింప జేయడానికి మౌలికమైన కారణం అన్నది వీరి వాదం. వీరికి సామాజిక న్యాయం అనేది ప్రధానంగా దృష్టి నిలపాల్సిన అంశంగా అనిపిస్తుంది.

తొలిస్త్రీవాద తాత్త్వికులైన Rosemary Radford Reuther పర్యావరణ సమస్యలను సంబోధించాలంటే ఏం చేయాలో ఈ విధంగా సూచించింది.

"Women must see that there can be no liberation for them and no solution to the ecological crisis within a society whose fundamental model of relationships continue to be one of domination. They must unite the demnads of the womens movement with those of the ecological movement to envision a radical reshaping of the basic socioeconomic relations and the underlying values of this society"

పర్యావరణ విధ్వంసాన్ని మానవ ఆధిపత్యరూపంగా అర్థం చేసుకోవాలి. స్త్రీల ఆకాంక్షలన్నిటినీ ఐక్యం చేస్తూ పర్యావరణ ఉద్యమంలో భాగం చేస్తూ సామాజిక ఆర్థిక సంబంధాలను, సామాజిక విలువలను సరికొత్త రూపానికి మార్చటం అవసరం అని భావించాలి. ఆధిపత్యం అంటే ప్రకృతిపై ఆధిపత్యమే కాబట్టి అటు సోషల్ ఎకాలజిస్టులు, ఇటు పర్యావరణ స్త్రీవాదులు మానవులపై ఇతర మానవులు నెరపే సామాజిక సాధారణ పద్ధతులను అర్థం చేసుకోవలసి ఉంటుందని భావించారు. పర్యావరణ సంక్షోభాలకు సంబంధించిన సరైన అవగాహనతో సామాజిక, రాజకీయ తాత్త్వికతలను ప్రశ్నించాల్సిన అవసరాన్ని వీరు నొక్కిచెప్పారు.

మనమెట్లా జీవించాలి అనే ప్రాథమిక ప్రశ్న ఒక వ్యక్తిని,

సమూహాన్ని సంబోధిస్తుంది. ఇది కొన్నిసార్లు "నీతి"గా అభివర్ణింప బడుతుంది. మనమెలా కలసి జీవించాలి? అనే ప్రశ్న సామాజిక న్యాయానికి సంబంధించింది. అందువల్లనే పర్యావరణ స్త్రీ వాదులు సామాజిక న్యాయం అనే మాట సామాజిక, రాజకీయతత్వానికి తొలిసూత్రంగా మార్చగలిగారు. కలిసి జీవించటం అంటే సమానత్వంతో మానవులతో జీవించటం. కేవలం మానవులతోనే కాకుండా మానవేతరమైన అన్నిటితో సమానత్వ భావనతో జీవించటం. సామాజిక ఆధిపత్యానికి, ప్రకృతిపై ఆధిపత్యానికి మధ్య నున్న సంబంధాలను ఎకోఫెమినిజం విభిన్నమైన పద్ధతులలో గుర్తించింది. స్త్రీవాద ఉద్యమాలకు, పర్యావరణ ఉద్యమాలకు గల సంబంధాలను కూడా ఇది గుర్తించింది. ఆ మేరకు పర్యావరణ తత్త్వ వివేచనలో తన దోహదాన్ని ప్రాధాన్యాంశంగా చూపగలిగింది.

అయితే ఆధిపత్యం గురించి లోతయిన అంశాలను కూడా వారు స్పృశించారు. ప్రతి ఆధిపత్యానికి ఒక తర్కం ఉంటుంది. ఇది ఆలోచనా పద్ధతికి సంబంధించింది. పురుషుల ఆధిపత్యం స్త్రీలపై ఉండటానికి గల కారణం ఆలోచనా విధాన ఫలితమే. అది చారిత్రకంగా, అనుభ వాత్మకంగా, ప్రతీకాత్మ కంగా, సైద్ధాంతికంగా కూడా వృద్ధి పొందుతూ వచ్చింది.



స్త్రీలు ఉద్వేగాత్ములు, పురుషులు తార్కింగా ఉంటారు అనే ఆలోచనా పద్ధతిలో ఒకరు అధికులు, మరొకరు అనధికులు అనే విలువ జత చేయబడింది. స్త్రీ పురుషుల స్వభావాలను, లక్షణాలను ఈ విలువ ఒక శ్రేణీగత నిర్మాణంగా రూపుదిద్దుకుంటుంది. స్త్రీలు తార్కికంగా ఆలోచించలేరు కనుక అధికులు కాలేరు అని నిర్ధారించబడుతుంది. సహజంగానే పురుషులకు ఉన్నత స్థితి, స్త్రీలకు న్యూనస్థాయి కల్పించబడుతుంది. ఈ తరహా ఆలోచనా పద్ధతులను, ఆధిపత్య తర్కాన్ని ఫెమినిజం నిరాకరిస్తుంది.

అలీసన్ జగ్గర్ రూపొందించిన ఆలోచనా చట్రం చాలామంది పర్యావరణ స్త్రీవాదుల ఆలోచనలను ప్రభావితం చేసింది. అలీసన్ జగ్గర్ ఉదార, మార్క్సిస్టు, రాడికల్ సోషలిస్టు ఫెమినిజాలుగా విభజించింది. ఇన్ని విధాలైన స్త్రీవాదాలకు ఆమె అణచివేతను, ప్రత్యామ్నాయ తాత్త్వికతలను పేర్కొంది.

ఉదారవాద స్త్రీవాదం స్త్రీ పురుషుల మధ్య తేడాలు ఉన్నాయనే విషయాన్ని నిరాకరిస్తుంది. ఉదార స్త్రీవాదం మానవులు ఒకే రకమైన స్వభావాన్ని కలిగి ఉంటారని, తార్కిక లక్షణం ఉంటుందని పేర్కొంటుంది. ఏ విధమైన చిన్న చూపు చూసినా, అసమానత పాటించినా అది న్యాయబద్ధం కాదని వాదిస్తుంది. అందువల్లనే ఉదార స్త్రీవాదం వివక్షతను గుర్తిస్తూ దానికి వ్యతిరేకంగా పోరాడుతుంది. సమాన హక్కులు, సమాన అవకాశాలను కోరుతుంది.

మార్క్సిస్టు ఫెమినిజం ప్రకారం స్త్రీల అణచివేతకు కారణం ఇంటిపనికి స్త్రీని పరిమితం చేయడం అంటుంది. ఇంటిపనిని ఆధారిత శ్రమరూపంగా భావిస్తుంది. స్త్రీల శ్రమకు వేతనరూప ప్రతిఫలం ఉండదు. స్త్రీల శ్రమ విస్మరణకు గురవుతుంది. గృహ సంబంధమైన పని, శ్రమ స్త్రీలకు ఆస్తిహక్కులను యాజమాన్య హక్కులను ఇచ్చేది కాదు. స్వతంత్రమైన ఉత్పాదక శ్రమ రూపాల్లో స్త్రీలు పాల్గొనటం ద్వారా స్త్రీలు అణచివేత, దోపిడీల నుండి విముక్తం అవుతారని సూచిస్తుంది.

సామ్యవాద స్త్రీవాదం మార్క్సిస్టుల వర్గ విశ్లేషణను నిరాకరిస్తుంది. సంక్లిష్టమైన సామాజిక సంబంధాల కారణంగానే స్త్రీల అణచివేత కొనసాగుతుందని భావిస్తుంది. ఈ సంబంధాలలో ఆర్థిక కారణాలతో పాటు సంప్రదాయ జండర్ విధానాలు, గుర్తింపులు దాగి ఉన్నాయని పేర్కొంటుంది. అందుకే వీరు ఒక మార్గాన్ని చూపారు. "Both marxist and socialist feminists would likely to describe the women of the chipco movement as becoming liberated from economic and social oppression to take a move autonamous and responsible role in theirown lives"

స్త్రీలపై ఆధిపత్యం, అణచివేతలు తొలగిపోవాలంటే చిప్కో ఉద్యమంలో స్త్రీలలాగా స్వయం ప్రతిపత్తిని పొందాలని సూచిస్తుంది. ఆర్థిక, సామాజిక, స్వయం ప్రతిపత్తిని పొందాలి.

ఇక రాడికల్ ఫెమినిస్టుల ప్రకారం జైవిక, లైంగిక తేడాలు స్త్రీ పురుషుల మధ్య ఉన్న కారణంగానే అణచివేతకు ఒక పునాది ఏర్పడిందని భావిస్తుంది. తల్లిగా, భార్యగా, లైంగిక వస్తువుగా స్త్రీ పరిగణన పొందటానికి ఈ జైవిక తేడాలను సమాజం సమర్థనీయంగా ప్రయోగించ గలిగింది. సంప్రదాయ జెండర్ పాత్రలు రద్దు పరచగలిగితే స్త్రీల అణచివేత సాధ్యపడు తుందని రాడికల్ ఫెమినిజం భావిస్తుంది.

ప్రకృతిపై ఆధిపత్యానికి, స్త్రీలపై ఆధిపత్యానికి గల సంబంధాలను థర్డ్‌వేవ్ ఫెమినిజం బలంగా గుర్తించింది. ఈ ఆధిపత్యం సాధారణ పద్ధతిగా కాకుండా భిన్న మార్గాలలో సంబంధితమై ఉన్నట్లుగా సూచిస్తుంది. ఎందుకంటే "Women have been identified as close to nature and Nature has been identified as feminine" ఈ రెండింటిమీద ఆధిపత్యం, అణచివేతలు కొనసాగాయి. అందువల్ల ఆధిక్య-న్యూనతలు, అణచివేత దారులు, అణచివేతకు గురయ్యేవారు లాంటి నిర్మాణ చట్రాలను సవాలు చేస్తూ పోవటమే పర్యావరణ స్త్రీవాదం చేసే పని. వీటికి ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తూ, ఆవిష్కరిస్తూ తమపై ఆధిపత్యాన్ని, ప్రకృతిపై ఆధిక్యాలను తొలగించటమే ఇకోఫెమినిజంలోని ప్రధాన తాత్త్విక ఆకాంక్షగా పేర్కొనవచ్చు.

### గుప్త పర్యావరణ అధ్యయనం (Deep Ecology)

పర్యావరణ అధ్యయనాల గురించి వెలువడిన తాత్త్విక వాదాల్లో ఇది ఒకటి. దీనిని నార్వేజియన్ తాత్వికుడు Arne Naess ఒక ఉద్యమంగా ప్రతిష్ఠించాడు. డీప్ ఎకాలజీగా నామకరణం చేశాడు. ఇది సంస్కరణ పర్యావరణ వాదానికి విరుద్ధమైంది. సంస్కరణ పర్యావరణ వాదాన్ని వ్యతిరేకిస్తుంది. పర్యావరణ సమస్యలను పరిష్కరించాలంటే ఆర్థిక, రాజకీయ నిర్మాణాలలో కొన్ని అవసరమైన సర్దుబాట్లు, మార్పులు చేస్తే చాలని సంస్కరణ పర్యావరణ వాదం భావిస్తుంది. దూరదృష్టిలేని, పైపైన ఆలోచనలు చేసే సంస్కరణ పర్యావరణ వాదంలోని డొల్లతనాన్ని

బయటపెట్టింది. ఈ తాత్త్విక చింతనలోని ప్రధాన ఆలోచన ప్రకారం ప్రాణికోటి మధ్య పరస్పర ఆధారపడి ఉన్న సంబంధాల సంక్లిష్టతలోకి పర్యావరణం అంతర్దృష్టిని ప్రసరించటం వల్ల ప్రాథమిక అంచనాలలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తాయని భావిస్తుంది. ఆధునిక మానవాళి తన సహజ పరిసర ప్రపంచంతో అత్యంత దౌష్ట్య పూరితంగా వ్యవహరిస్తుంది. ఎందుకంటే వారి సంస్కృతి ప్రకారం, మానవాళి తన సహజ ప్రపంచంకంటే తనని తాను భిన్నమైనదిగా, అధికమైనదిగా, ఉన్నతమైనదిగా సంభావించుకుంటుంది. దీనికి భిన్నంగా డీప్ ఎకాలజీ ఆలోచిస్తుంది.

Deep ecology, on the other hand, affirms an understanding of life in which the thinking of the 'self' must already include other organisms and all that supports them, as part of ones own Identity"

దీని బట్టి చూస్తే తోటి ప్రాణి కోటిలో తన స్వీయాత్మను గుర్తించటం, గౌరవించటం అనే అవగాహను డీప్ ఎకాలజి ఇస్తుంది. స్వీయం అంటే ఇతర జీవులను కూడా తన అస్తిత్వంలో మిళితం చేసుకుని చూడటం. 'స్వీయం' అనేది విడిగా లేదు. అది మహా ప్రాణ చైతన్యంలో అంతర్భవించి ఉంది. అది నిరంతరం తన అస్తిత్వ లేదా గుర్తింపు చక్రాన్ని ఇతర ప్రాణులతో పోల్చుకోవడం ద్వారా విశాల పరచుకుంటూ ఉంటుంది. ఉదార వాద పెట్టుబడి దారి విధానంలో కనిపించే అణుమాత్ర మానవుడి లాంటి ఉనికి కాదు అది. ఒక ప్రాణిని సంహరించటమంటే తనపై తానే ఆత్మహింసకు పాల్పడే చర్యగా అర్థం చేసుకోమనే ఆలోచనను ఇది కలిగిస్తుంది. దీనిలో నుంచే ప్రాణి కేంద్రక నైతికత ఉద్భవిస్తుంది.



ఒక విశాల సామాజిక ఉద్యమంగా 'డీప్ ఎకాలజీ' ప్రాణి కేంద్రక నైతికతను అనేకాంశాలతో విస్తారంగా పంచుకుంటుంది. ఈ గుప్త పర్యావరణం ఆచరణాత్మక నైతికత లేదా న్యాయ ఆలోచన లేకుండానే సంప్రదాయ పరిష్కారాలను సూచిస్తుంది. అదేమంటే సమాజాన్ని మార్చటం కోసం స్వీయాత్మను మార్చుకోవటం ఉత్తమమని సూచిస్తుంది. ఈ తాత్త్విక చింతనలో రెండు నియమాలు కనిపిస్తాయి.

**ఒకటి : స్వీయ చైతన్యం (Slef-realisation)**

**రెండు : ప్రాణి కేంద్రక సమానత్వం (Biocentric equality)**

అదేవిధంగా మానవ జీవన శైలి పట్ల కూడా ఈ వాదం అభ్యంతరాలను వ్యక్తపరిచింది. మానవులు సాధ్యమైనంత నిరాడంబరంగా ఉండాలని, సాంకేతిక రహితంగా ఉండాలని సూచించింది.

Our life styles ought to be simple in the sense that our consumer or material desires should be kept to a minimum.

దీనిని గురించి ఆలోచిస్తే మన భౌతిక వాంఛలు లేదా కోరికలు అన్నీ మానవ సమాజపు కృత్రిమ ఉత్పత్తులే అని తేలుతుంది.

డీప్ ఎకాలజీని గురించి పేర్కొన్న వారిలో ప్రముఖంగా ముగ్గురు చింతనాశీలురు కనిపిస్తారు. ఒకరు Arne Neass, రెండవ వారు Devall, మూడవ వారు George Sessions.

వీరిలో Arne Neass ఉపరి పర్యావరణ ఉద్యమం Shallow ecology movementలోని లోపాన్ని ఎత్తి చూపాడు. ఉపరి పర్యావరణ ఉద్యమం కాలుష్యానికి, వనరుల తరుగుదలకు వ్యతిరేకంగా నిబద్ధతతో పోరాడింది. ఈ నిబద్ధతాయుత పోరాటం పర్యావరణానికి చేకూర్చే హితవేమీ లేదు. పైగా ఇది అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన సమృద్ధత గల ప్రజల ఆరోగ్యాలను సంరక్షించటమే ముఖ్య లక్ష్యంగా పోరాడింది. ఇది మానవ కేంద్రకమైనది. కాలుష్యానికి, వనరుల క్షీణతలకు గల సామాజిక, మానవ కారణాలను అన్వేషించకుండా కేవలం వాటికి వ్యతిరేకంగా పోరాడటం ప్రయోజన రహితమని డీప్ ఎకాలజిస్టులు భావించారు. నేస్ మనం విడివ్యక్తులుగా మనల్ని మనం మార్చుకొని, సంస్కృతిని మార్చాల్సిన అవసరాన్ని గుర్తించగా దేవాల్, సెషన్స్‌లు కొత్తది ఏమీ సృష్టించకుండానే పాతదాన్ని జాగృతం చేయాలని ఆశించారు. ఈ కొత్తది రూపొందటంలో పర్యావరణ చైతన్యం, పర్యావరణ, తాత్త్విక, ఆధ్యాత్మిక విధానాలు దోహదం చేయాలని ఆశించారు. భూమి, వృక్షాలు, జంతువులు, మానవుల మధ్య ఐక్యత ఉండాలని ఆకాంక్షించారు.

పర్యావరణ సమస్యలు, సంక్షోభాలకు కారణం మన ప్రాపంచిక, తాత్త్విక దృక్పథాలే కనుక అవి మారాలని ఆశించారు. ప్రత్యామ్నాయాల కొరకు అన్వేషించారు. ప్రత్యామ్నాయ ప్రాపంచిక, తాత్త్విక దృక్పథాలను 'పర్యావరణ తాత్త్వికత'గా 'ఇకో-సోఫీ'గా పేర్కొన్నారు.

ఇందుకోసం వారు కొన్ని సాధారణ సూత్రాలను, ప్రకటనలను రూపొందించి డీప్ఎ కాలజీకి ఒక భూమికను సమకూర్చారు. వాటిల్లో ముఖ్యమైనవి ఇవి.

1. The flourishing of human and non human life on Earth has intrinsic value.

The value of non human life-form is independent of the usefulness these may have for narrrow human purposes.

2. Rich ness and diversity of life -forms are values in themselves and contribute to the flourishing of human and non human life on Earth.

3. Humans have no right to reduce the richness and diversity except to satisfy vital needs.

4. Present human interference with the non human world in excessive and the situation is worsening.

వీటితో పాటు మరికొన్ని సూత్రాలను రూపుదిద్దారు. మొత్తం మీద మానవ ఆధిపత్య భావనతో కూడిన ప్రాపంచిక దృక్పథం మారి పర్యావరణ హితకారక ఆలోచన విధానం రూపొందాల్సిన అవసరాన్ని డీప్ ఎకాలజీ నొక్కి చెప్పింది.

-డా॥ ఆర్. సీతారామారావు,
m : 9866563519
e : sitametaphor@gmail.com

## అలనాటి మేటి తెలంగాణ శాసనాలు-18

## అనేక ప్రత్యేకతలు గల ఇద్దరు రాజుల

# ఉజ్జలికోట శాసనం


## (క్రీ.శ.966 & క్రీ.శ.1097)

ఉజ్జిలి, మునుపటి మహబూబ్‌నగర్ జిల్లా, మక్తల్ తాలూకాలోని ఒక ప్రాచీన కోట. కళ్యాణ చాళుక్యుల కాలంలో ఒక రాజధాని. ఉజ్జిలి ఇపుడొక చిన్న గ్రామమైనా, క్రీ.శ.10-12 శతాబ్దాల్లో ఒక పాలనా కేంద్రంగా వెలుగొందిన నగరం. ఆ గ్రామంలోని ఒక బావి దగ్గర అనేక ప్రత్యేకతలున్న ఒక కన్నడ శాసనముంది. 131 సం॥ల తేడాతో ఒకేరాతిపై గల క్రీ.శ.966 నాటి మొదటి శాసనాన్ని మహామండలేశ్వర శ్రీ వల్లభచోళ మహారాజు, క్రీ.శ.1097 నాటి రెండో శాసనాన్ని నాలుగో సామేశ్వరుని మహాప్రధాని భానుదేవరసరు వేయించారు.

ఈ శాసనాన్ని తొలిసారిగ, **తెలంగాణ శాసనాలు** వా.2, సంఖ్య, 35గా, లక్ష్మణరాయ పరిశోధక మండలి, హైదరాబాదు, 1935లోనూ, **ఆంధ్రప్రదేశ్ అర్కియాలజికల్ సీరీస్,** వా.1, లో మహబూబ్‌నగర్ శాసన సంఖ్య 61 గానూ, **ఏ కాటలాగ్ ఆఫ్ ఇన్స్‌క్రిప్షన్స్ కాపీడ్ అప్ టూ 1964,** గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, హైదరాబాద్, 1965, పే.81-82, లోనూ, ఎన్నెస్ రామచంద్రమూర్తి (సం), **ఇన్స్‌క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, మహబూబ్‌నగర్ డిస్ట్రిక్టు,** వా.1, శా.సం.149, హైదరాబాదు, 2003 పే.278-280లోనూ ప్రచురించబడింది. ఇదే శాసనం పైన ఒక వ్యాసాన్ని ఎన్నెస్ రామచంద్రమూర్తి, **ఆం.ప్ర.హిస్టరీ కాంగ్రెస్ ప్రొసీడింగ్స్** వా. 20, 1996, పే.70-74లో ప్రచురించారు.

**శాసనపాఠం : మొదటి వైపు**

1. .......... స ...............
2. బృధ్వీవల్లభ మ. ............
3. త్యాశ్రయ కుళతిళకం చాళుక్యాభ. ........
4. దేవర విజయ రాజ్యముత్తరోత్తరాభివృద్ధి
5. తారంబరం సలుత్తమిరె కల్యాణపురదనెలె వీడినోళు ....
6. థా వినోదదిం రాజ్యంగెయుత్తమిరె తతుపాద పద్మోపజీవి స్వస్తి సమధిగ (త.పం)
7. చ మహాశబ్ద మహా మణ్ణళేశ్వరం శ్రీ వల్లభ చోళ మహారాజరు శకవశ ᳵ
8. నెయ ప్రభవ సంవత్సరద మార్గ ᳵ శిరశుద్ధ పంచమీ బ్రిహా
9. స్పతి వారదు ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తదిం కల్ల కెళగయ్యా
10. రర మొదలబాడం రాజధాని ఉజ్జివొళలలకోటె యొళగణబసది శ్రీ
11. మద్రావిళ సంగదసేనగళద కౌరూరగచ్ఛదబద్ది జినాలయద చంనపా
12. శ్వ దేవర అంగభోగక్కం నివేద్యదీపదూప తాంబూళ ఈ బంద
13. హొదరిశియర అజ్జియర ఆహారదానక్కం సౌతెశుణ్ణ జీర్ణో ద్ధారక్కకం శ్రీ
14. వాదిరాజాన్వయద వాదిరాజదేవర శిశ్యరప్ప అల్లియ ఆచాయ్య ᳵ రు ఇంద్రసేన
15. పండితదేవర కాలం కచ్చి ధారాపూర్వ ᳵ కం మాడి ఉజ్జివొళల



పడువణ సీమెయెు (ళ)

16. గె బద్ది పళ్లియిం బడగలు కొట్ట కెఱె ఒందుకెయి మత్తప్ప ॕ ం నె 12 సినెయత..

17. యలుహూవినతోంటమత్తకమ్మ 3 ౦౦ అశేష నకరంగళుం దేవగ్గె ॕ అచ్చినకం మట

18. దలుదళకెహార ఒందంబిట్టరు దీవిగెగె గాణొందం అశేషనకరహొన్నవణి హేరింగె

19. ౧౦౦ ఎలెయం బిట్టరు ఇంతిధమ్మ ॕమం ప్రతిపాళిసువరు సౌధరె ఉలపయ్య నాయకరుం సౌ

20. ధరెప్రోలెయ నాయకనుం సౌధరయాజయ నాయకనుం అశేషనకరంగళుం, సమెయ

21. గళుం పంచమఠస్థానంగళుం ఇంతిధమ్మ ॕమం ప్రతి పాళిసువరు...

రెండవవైపు

22. ......... శ్రీస్వస్తి సమస్త భువనాశ్ర

23. య శ్రీపృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర పరమ భట్టారకం సత్యాశ్రయ

24. కుళతిళకం చాళుక్యాభరణం శ్రీమచాళుక్య చక్రవత్తి ॕ వీరసోమేశ్వర దేవ

25. వషద సకవశ 1019 నేయ పరాభవ సంవత్సరద పుశ్య సుద్ధ 13 యొదసి బ్రిహస్ప

26. తి వారదందు ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తదిం కల్ల కెళగునాడ మొదల బాడం

27. రాజధాని ఉజ్జివెళల కోటెయొళగణ బసది బద్దిజినాలయద దేవర వేద్య దీపధూప

28. ఫళ అష్టవిధాచ్ఛ ॕనెగిం పొతెసుణ్ణ జీర్ణోద్ధారక్కం శ్రీ మన్మహా ప్రధానం సేనాధిపతి బాహత్తర

29. నియోగం శ్రీ కరణం శ్రీ మతకల్లకెళగు నాడ దండనాయకం భానుదేవరసరు

30. శ్రీమతు కల్లకెళగు నాడ సౌధరెకేషవయ్య నాయకరన్మతదిం అల్లియ ఆచాయ్య ॕ

31. రు ఇంద్రశేణ పండిత దేవర కాలం కచ్చి ధారాపూవ్వ ॕకం మాడి ఉజ్జివొళలి పడువణ సీమెయె

32. ళగె రావుళహల్లియబడగ తోపులకుంటెయెంబకెఱెయం కొట్టరు ఆకెఱెయం తెంక

33. క్రయిమత్తప్ప 12 రడం కొట్టరు ఇన్తిధమ్మ ॕమం ప్రతిపాళిసువరు సౌధరెకే కేశవనాయు

34. కదుం సౌదరే... కనం.....

**మొదటి శాసన వివరాలు**

పృథ్వీవల్లభ, సత్యాశ్రయకులతిలక... దేవర, కళ్యాణపురం నుంచి రాజ్యం చేస్తున్నప్పుడు ఆయన పద్మోపజీవి, సమధిగత పంచమహాశబ్ద, మహామండలేశ్వర, శ్రీవల్లభచోళమహారాజు, శక సంవత్సరం 888 (క్రీ.శ.966)లో కల్లకెళగెనాడులోని ఉజ్జివోళల కోట రాజధానిగా పాలిస్తున్నపుడు , ఉజ్జిలిలోని ద్రావిళ సంఘం, సేనగణ, కౌరూరు గచ్ఛకు చెందిన బద్దిగజినాలయంలోని చెన్నపార్శ్వ (నాథ) దేవర అంగభోగం, ధూప, దీప, నైవేద్య, తాంబూళానికి, సందర్శనకొచ్చిన జైనాచార్యుల భోజనాలకు, ఆలయ జీర్ణోద్ధరణ, సున్నం గొట్టటానికి గాను అశేషనకరాలు కలిసి, స్థానికాచార్యుడు ఇంద్రసేన పండితుని కాళ్లు గడిగి, ఉజ్జవోళాల పడువణ సీమలోని బద్దిపల్లిలో కొంత భూమిని, తోటలను దానం చేసినట్లునూ, ఈ ధర్మాన్ని సౌధెరె (చౌదరి) ఉలపయ్య నాయకుడు, సౌధరె ప్రోలెయనాయుడు, సౌధరె యాజయనాయకుడు, అశేష నకరాలు (వ్యాపార సంస్థలు), సమయాలు (మతసంస్థలు), పంచమఠస్థానాలు కాపాడాలని చెప్పబడింది.

**రెండో శాసనం వివరాలు**

శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజ, పరమేశ్వర, పరమభట్టారక, సత్యాశ్రయ కులతిలక, చాళుక్యాభరణ, చాళుక్య చక్రవర్తి వీర (నాలుగో) సోమేశ్వరదేవుడు, శకవర్షం 1019 (క్రీ.శ.1097)లో ఉత్తరాయణ సంక్రాంతినాడు, కల్లకెళగునాడులోని, ఉజ్జివోళలకోట రాజధానిగా పాలిస్తుండగా అక్కడి బసదిలో సున్న బద్ధిజినాలయంలోని (పార్శ్వనాథుని) నైవేద్య, దీప, ధూప, ఫల, అష్టవిధార్చన, జీర్ణోద్ధారణ కోసం, శ్రీమన్మహా ప్రధాని, సేనాధిపతి, బాహత్తరనియోగి, శ్రీకరణం, శ్రీమత్ కల్లకెళగునాడుదండనాయకుడు అయిన భానుదేవరసరు, ఇంకా సౌధరెకేషవయ్య నాయకుడు, అక్కడ ఆచార్యుడైన ఇంద్రసేనపండితుని కాళ్లు కడిగి, ఉజ్జివొళలి పడువణసీమలోని రావులపల్లి తోపులకుంటె వెనుక చెరువుకింద, కొంత భూమిని కొని దానం చేశారని, ఈ ధర్మాన్ని సౌధరె కేశవనాయకుడు... కాపాడతారని చెప్పబడింది.

**ఇక శాసనంలోని ప్రత్యేకతలు**

ఈ రాతిపైన ఇద్దరు రాజుల పాలనలో ఇద్దరు వ్యక్తులు, సంస్థలు, జినాలయానికి చేసిన దానాలున్నాయి. మొదటి **శాసన తేదీ క్రీ.శ.966.** కళ్యాణచాళుక్య పాలన క్రీ.శ. 972కు గాని ప్రారంభం కాలేదు. అందుచేత ఈ తేదీ తప్పు. దేవుని పేరు **చెన్నపార్శ్వనాథుడు.** చెన్న కేశవ, చెన్నమల్లికార్జునుల మాదిరిగా పార్శ్వనాథుని ముందు చెన్న పదం గమనార్హం. మొదటి శాసనంలోని శ్రీవల్లభచోళుడు క్రీ.శ.1181-1200 మధ్య పాలించిన వీరసోమేశ్వరుని సమకాలికుడు. కాని క్రీ.శ.966లో పాలిస్తున్నట్లు పేర్కొనటం మరో తప్పు. ఈ శాసనం మొదటి సారిగా, **సేనగణ** అనే జైనశాఖను, **ఇంద్రసేన పండితుడనే** జైనాచార్యుణ్ణి, అప్పటి పాలనా విభాగమైన **కల్లకెళగునాడు-500**ను ప్రస్తావించింది. కాకతీయుల కాలంలో ప్రాముఖ్యతను సంతరించుకొన్న **బాహత్తరనియోగ** వ్యవస్థ, కళ్యాణ చాళుక్యుల కాలంలోనే పురుడు పోసుకుందని కూడా ఈ శాసనం వల్లే తెలుస్తుంది.

శాసనంలోని కుళతిళకం=కులతిలకం, తతుపాద = తత్పాద, మణ్డళేశ్వర = మండలేశ్వర, బ్రహస్పతి = బృహస్పతి, శ్రీమద్రావిళసంగ = శ్రీమద్రావిళ సంఘ, కౌరంగచ్ఛ = కౌరూరుగచ్ఛ, సకవర్ష = శకవర్ష పుశ్య = పుష్య; సుద్ధ = శుద్ధ, కేషవయ్య = కేశవయ్య, గా చదువుకోవాలి. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ శాసనం **అలనాటి మేటి తెలంగాణ శాసనాల్లో** ఒకటి.

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# ఆకాశంలో తెగిపడే చుక్కలు

నిజానికి ఉల్కలు అనేవి ఆస్టరాయిడ్ బెల్ట్ నుంచి వచ్చేవి. సౌరకుటుంబంలో అంగారక, గురుగ్రహాల నడుమ 'గ్రహశకలాల సమూహం' (Asteroids Belt) ఎల్లప్పుడు ఒక కక్ష్యలో తిరుగుతుంటాయి. ఒక్కోసారి ఈ గ్రహశకలాలు ఆ గుంపు నుంచి వెలువడి అత్యంతవేగంతో భూమి వాతావరణంలోనికి ప్రవేశించినపుడు వాటిలో ఎక్కువభాగం మండిపోతాయి. కొన్ని మాత్రమే అరుదుగా భూమిమీద రాలిపడుతుంటాయి. దాన్నే ఉల్కాపాతం అంటారు. రాలిపడ్డ పదార్థాలు ఉల్కలు. గ్రహాంతర పదార్థశకలాలు (Celestial Bodies). భూమి అక్షంలో వక్రత, భూమండలం మీద వాటి స్థానం కారణంగా రష్యా, అర్జెంటీనా వంటి దేశాలలో ఎక్కువగా ఉల్కాపాతాలుంటాయి. గ్రహాలుగా మారలేని గ్రహశకలాలు ఉల్కలుగా మారుతాయి. ఇవి 1. గ్రహశకలాలు, 2.మీటియోరైట్స్, 3.తోకచుక్కల నుంచి వచ్చిన పదార్థం, 4. చంద్రుడు, అంగారక గ్రహాల నుంచి వచ్చే పదార్థాలు.



**ఉల్కలు మూడురకాలు.**

1. స్టోనీ మీటియోరైట్స్, 2.ఐరన్ అండ్ స్టోనీ మీటియోరైట్స్, 3. ఐరన్ మీటియోరైట్స్

**స్టోనీ మీటియోరైట్స్:**

వీటిలో సిలికేట్ ఖనిజాలెక్కువగా వుంటాయి. ఇవి రెండు రకాలు.

1. కాండ్రైట్స్, 2. అకాండ్రైట్స్

**కాండ్రైట్స్:**

గ్రహాలు ప్రాథమికదశలో ఎట్లుండేవో ఇవీ అట్లనే వుంటాయి. కాండ్రైట్స్‌ని చూసినపుడు వాటిమీద చిన్న, చిన్న బిందువుల్లాంటి సిలికేట్స్, సల్ఫైడ్, ఇనుము రేణువులు కనిపిస్తాయి. గ్రీకుభాషలో కాండ్రైట్స్ అంటే ఇసుకరేణువులు.

**అకాండ్రైట్స్:**

అకాండ్రైట్స్ కొన్ని కార్బన్ సమ్మేళనాలను కలిగి ఉంటాయి ,కర్బనం, ఆర్గానిక్ పదార్థాలుంటాయి. వీటిలో కాండ్రైట్స్ లో వుండే టెక్చర్ వుండదు. భూమ్మీద కరిగిన స్థితిలో ఉండే 'ఇగ్నీషియస్ డిఫరెన్షియేషన్' ఉంటుంది. ఇనుమువంటి బరువైన మూలకాలుంటాయి. లోపలికి చొచ్చుకుపోయి క్రస్ట్ లో చేరివుండేవి తేలికగా వుంటాయి.

**ఐరన్-స్టోనీ మీటియోరైట్స్:**

వీటిలో ఇనుము, నికెల్, సిలికేట్ భాగాలుంటాయి. ఇవి రెండు రకాలు: 1.పెల్లసైట్స్, 2. మీసో సైడరైట్స్... భూమిలోని మాంటిల్ కు కరస్పాండింగ్ గా వుంటుంది. మాంటిల్ లోని పదార్థాలే ఇందులో వుంటాయి. ఈ మీటియోరైట్స్‌లో వజ్రాలుంటాయి. రత్నాలు, ఉపరత్నాలు దొరకవచ్చు.

**ఐరన్ మీటియోరైట్స్:**

ఆస్టరాయిడ్స్ నుంచి వచ్చే కోర్ పదార్థాలు. వీటిలో ఇనుము, నికెల్, సల్ఫైడ్స్ ఉంటాయి. ఇందులోని ఇనుము పొరలుగా ఉంటుంది. Rocky Planets అనబడే Mercury, Mars, Venus and Earth లలో స్తరీకరణ లుంటాయి. అదే స్తరీకరణ ఐరన్ మీటియోరైట్స్ లోని ఇనుములో ఉంటుంది.

ఉల్కాపదార్థం ఆస్టరాయిడ్ బెల్ట్, కోమెట్స్ నుంచి వస్తుంది. ఇవిగాక అతి తక్కువశాతంలో చంద్ర, కుజ గ్రహాల నుంచి కూడా వస్తుంది. ఆస్టరాయిడ్స్ వచ్చిన పదార్థాలు భూమివలెనె 450కోట్ల సం.రాలు, అంతకు మించి వయస్సు కలిగివుంటాయి. చంద్రగ్రహం నుంచి వచ్చిన ఉల్కలు 250కోట్ల సం.రాలు, అంగారకగ్రహం వచ్చినవి 165కోట్ల సం.రాల పైబడి వుంటాయి.

**ఉల్కాపాతాలు:**

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేత భారతీయ మ్యూజియంలో 643 మెటియోరైట్లు భద్రపరచబడ్డాయి. మనదేశంలో 2021సం. జూన్ నెలలో రాజస్థాన్లో లభించిన ఉల్కాశిల పిడికిట్లో పట్టేంత చిన్నది. జీఎస్ఐ వారు ఈ ఉల్కమీద పరిశోధన చేస్తున్నారు. 2016లో తమిళనాడులో ఉల్కపడ్డది. 2001లో తెలంగాణా రాష్ట్రం హుజూర్ నగర్ సమీపంలోని ఒక గ్రామం దగ్గర ఉల్కావర్షం (మీటియోరైటిక్ షవర్) పడ్డది. అవి ఎటువంటి ఉల్కలో ఎవరూ చూడలేదు. ఇంకా 1814లో గుర్రంకొండ ప్రాంతంలో 28 గ్రాములు, 1852లో యేటూరులో 13కిలోలపైన, 1870లో నెడగొల్ల ప్రాంతంలో, 1898, 1936లలో హైద్రాబాద్‌లో, 1901లో అల్వాల్ ప్రాంతంలో, 1934లో తిరుపతిలో 240గ్రాములు, 1997లో విస్సన్నపేటలో(కృష్ణా జిల్లా, ఆం.ప్ర.) 1300గ్రాముల ఉల్కలుపడ్డ వివరాలు లభిస్తున్నాయి.

మనకండ్ల ముందు పడే ఉల్కలను 'ఫాల్స్' అంటారు. ఎపుడోపడి, తర్వాత చూసిన వాటిని 'ఫైండ్స్' అంటారు. ఉల్కలకు అయస్కాంతం చేత ఆకర్షింపబడే స్వభావముంటుంది. కొన్ని ఉల్కలను పోలిన 'క్లస్టర్ రాక్స్' ఉంటాయి. లోహాన్ని శుద్ధి చేసినపుడు మిగిలిపోయే చిట్టెంముద్దలు ఉల్కల రూపంతో పోలి వుంటుంది. కాని, ఉల్కలనిపించి తికమకపెడ్తాయి.



**ఉల్కల చరిత్ర:**

చారిత్రకయుగంలో, చరిత్రపూర్వయుగంలో ఈ ఉల్కల కారణంగా భూమ్మీద ఎన్నో మార్పులు జరిగాయి. భారతదేశంలో మహారాష్ట్రలోని 'లోనార్' సరస్సు, రాజస్థాన్‌లో, మధ్యప్రదేశ్ లోని శివపురి, రాంఘడ్‌లలో పెద్దక్రేటర్స్ కనిపిస్తాయి. అరిజోనా క్రేటర్ ప్రపంచ ప్రఖ్యాతమైనది. ఈ లోతైన గుంతలు అతివేగంగా భూమిని ఢీకొట్టిన పెద్ద, పెద్ద ఉల్కల వల్లనే ఏర్పడ్డాయి. గ్రహాంతర పదార్థాలతో కూడిన ఉల్కలు నేలమీద పడ్డపుడు, అక్కడ నేలలోని పదార్థాలు కరిగి, ఉల్కా పదార్థాలతో కలిసి ఏర్పడే వాటిని 'ఇంపాక్టైట్స్' అంటారు. గాజుపూసల్లాంటి 'స్ఫెరికల్ బాడీస్' టెక్టైట్స్, చిలుకా సరస్సులో లభించే ఆకుపచ్చని సెమీప్రెషియస్ స్టోన్స్‌గా లభించే వాటిని 'మోల్డోవైట్స్' అంటారు. లిబియల్ డెసర్ట్ గ్లాస్(ఎల్డీజి) కూడా ఉల్కలవల్ల ఏర్పడ్డ పదార్థమే.

చరిత్రపూర్వయుగంలో 61/2కోట్ల సం.రాల క్రితం మెక్సికో యూకటాన్ పెనిన్సులాలోని చిక్సులూబులో 6మైళ్ళ విస్తీర్ణంలో ఉండే ఉల్కాఖండం పడినపుడు అక్కడ 125 కి.మీ.ల వైశాల్యంలో క్రేటర్ (గొయ్యి) ఏర్పడ్డది. అపుడు ఎగజిమ్మిన పదార్థంతో భూమిమీది వాతావరణం అతలాకుతలమైంది. అపుడున్న డైనోసార్లు, సంబంధిత జాతులన్నీ పూర్తిగా నశించిపోయాయి. మిగిలిపోయిన క్షీరదాలు తమతోపోటీపడే డైనోసార్లు లేకపోవడంతో ఎంతో ఎదిగిపోయాయి. పరిణామక్రమంలో క్షీరదాల నుంచే మానవజాతి ఆవిర్భవించింది. అంటే ఒకవిధంగా మానవజాతి పరిణామానికి ఉల్కాపాతం కారణమైంది. అంతేకాదు ట్రయాసిక్ యుగాంతంలో జరిగిన ప్రళయాలకు (ఎక్స్‌టెంక్షన్స్) ఉల్కలుపడడమే కారణమంటారు. భూమ్మీద ఇంతగా నీరుండడానికి సౌరమండలంనుంచి, తోకచుక్కల నుంచి రాలిపడిన ఉల్కాపాతమే కారణంగా చెప్తారు శాస్త్రవేత్తలు. గ్రహాంతరాలనుంచి జీవం నేలమీదకు ఉల్కలవల్లనే వచ్చిందనే సిద్ధాంతాలు కూడా రూపుదిద్దుకుంటున్నాయి.

**ఉల్కలు–యాజమాన్యచట్టాలు:**

ఉల్కలు యజమాని లేని వస్తువులు. యాజమాన్యం ఎవరిదన్న ప్రశ్న అవి పడ్డ భూభాగం ఏ దేశానికి చెందినదో ఆ దేశం యొక్క చట్టంపై ఆధారపడి ఉంటుంది. కొన్ని దేశాలలో ఈ అంశంపై వ్యవహరించడానికి నిర్దిష్ట చట్టం లేదు. కొన్ని దేశాల్లో మతపరమైన చట్టం వర్తించబడుతుంది. ప్రామాణిక భూచట్టాలు కూడా ఉల్కలకు వర్తిస్తాయి. అపుడు భూమి యజమానే ఉల్కల యజమాని. అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో ఉల్కలు కనుగొనబడితే వాటి యాజ మాన్యం ఆ మెటియోరైట్ యొక్క ఉపయోగంపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తికి సంవత్సరానికి పది పౌండ్లకు మించకుండా చేతితో తీసుకెళ్లగలిగే ఉల్క దొరికితే అది సేకర్తకే చెందుతుంది. అమెరికా చట్టం ప్రకారం వీటి కొనుగోలు మార్కెట్ విలువ ప్రకారం ఉంటుంది.

శాస్త్రపరిశోధనల కోసం విద్యాసంస్థలు పురా వస్తువుల చట్టం ప్రకారం అనుమతులకు లోబడి మెటియోరైట్‌లను సేకరించి ఉంచుకోవడానికి అవకాశం ఉంటుంది. బోర్డ్ ఆఫ్ లాండ్ మేనేజ్మెంట్ (BLM) జారీచేసిన భూ వినియోగ అనుమతిపత్రం ద్వారా అమ్మకం కొరకు పన్నుకట్టే షరతుమీద వాణిజ్య సేకరణకు అనుమతించబడుతుంది. అర్జెంటీనాలో ప్రాంతీయచట్టాలు వర్తిస్తాయి, ప్రాంతీయ ఆస్తిగా ప్రకటించబడిన ఒక 18కి.మీ విస్తీర్ణంలో ఉల్కలు ప్రాంతీయ ఆస్తిగా ప్రకటించబడ్డాయి. సేకరణపై రుసుము వర్తించ బడుతుంది. అమ్మకానికి లభించే ఉల్కలు ఎక్కువగా అర్జెంటీనా నుండి వచ్చాయి.

కెనడాలో ఇది ఆ భూమి యజమాని యొక్క ఆస్తి. తనకు విక్రయించే హక్కు ఉంది. అయితే ఎగుమతి అనుమతి కోసం, స్థానిక సంస్థలు కొనుగోలు చేయడానికి 6నెలల వ్యవధి ఉంటుంది. డెన్మార్క్‌లో మెటియోరైట్ ఒక జాతీయ ఆస్తి. దొరికినవారు పన్నుకట్టాలి. జపాన్‌లో ఉల్క అనేది అన్ని హక్కులతో కూడిన భూ యజమానుల ఆస్తి. మెక్సికోలో అంతరిక్ష వస్తువులు జాతీయ ఆస్తి. మెటియోరైట్ దిగుమతి చట్టబద్ధం. బ్రిటన్‌లో ఉల్క భూయజమాని ఆస్తి, ప్రత్యేక పరిస్థితులలో దానిని ట్రెజర్ ట్రోవ్‌గా కూడా ప్రకటించవచ్చు. అప్పుడు అది ప్రభుత్వ ఆస్తి అవుతుంది. అంటార్కిటిక్‌లో జరిగే ఉల్కల సేకరణ, వ్యవహారాలన్నీ అంటార్కిటికా ఒప్పందానికి లోబడి ఉంటాయి. భారతదేశంలో ఉల్కను ప్రభుత్వానికి అప్పగించడం తప్పనిసరి. ఇది ప్రభుత్వ ఆస్తిగా పేర్కొనబడినప్పటికీ, ఇది ఏ చట్టం ప్రకారం అని స్పష్టంగా లేదు. మెటియోరైట్‌లు మరియు వాటి సేకరణకు సంబంధించిన నిర్దిష్ట చట్టమేదీ దృష్టికి రాలేదు.

– చకిలం వేణుగోపాల్ రావు,
m: 9866449348
e : venugopal.cakilam1@gmail.com
– శ్రీరామోజు హరగోపాల్, m : 99494 98698



# తెలంగాణ గిరి'జనం' జాతర

మేడారం మహా జాతర ఓ అద్భుతం. ఇది ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవం. గత ఎనిమిది వందల ఏళ్లుగా ఒక తరం నుంచి మరొక తరానికి అందిస్తున్న ఆదివాసీల ఆరాధ్యదైవాల సజీవ సంస్కృతుల సమ్మేళనం. అడవిబిడ్డల ఆరాధ్యదేవతలైన సమ్మక్క-సారలమ్మ పోరాట పటిమకు.. ధిక్కారస్వరానికి.. ఆత్మగౌరవానికి ప్రతీకలు. ఆదివాసీల పరిభాషలో పంచభూత ప్రకృతి దైవాలుగా విరాజిల్లుతున్న సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు, నాగులమ్మల కలయికే మేడారం జాతర. కీకారణ్యంలో రెండేళ్లకోమారు ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఈ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించడంతో.. మేడారం జాతర అంతర్జాతీయస్థాయికి ఎదిగింది. గూగుల్, ఇంటర్నెట్, వాట్సాఫ్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల్లో మేడారం జాతర విశేషాలు మారుమోగాయి. స్వదేశీయుల జానపదపాటలు, విదేశీయుల లఘుచిత్రాలు హైలెట్‌గా నిలిచాయి. బహుభాషల్లో అడవితల్లుల స్మరణ కొనసాగింది.

**ఈ సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించే ఈ మూడు రోజుల జాతరకు కోవిడ్ ఆంక్షలతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులకు దర్శనం కల్పించనున్నారు.**

మామూలు రోజుల్లో మౌనం ఆవహించినట్లుండే మేడారం ఒక్కసారి ఆధ్యాత్మికచింతనతో ప్రపంచాన్ని తనవైపు తిప్పుకుంది. ఆదిమ వారసత్వాన్ని ఒకసారి గుర్తుచేసింది. అడవి తల్లులైన సమ్మక్క, సారలమ్మకు భక్తివిశ్వాసమే ప్రధానాలంభనగా సేవించుకొని తరిస్తున్న భక్తులతో మేడారం పులకరించిపోయింది. జంపన్నవాగు.. భక్తిసాగరమైంది. చిన్నారులను కేరింతలు కొట్టించింది. భక్తులకు పూనకాలు తెప్పించింది. అశేష జనాలకు పుణ్యస్నానాలు చేయించింది. జలాశీస్సులు ఇచ్చి.. పరమపవిత్రంగా గద్దెలకు చేర్చింది.

## తెలుగునాట కుంభమేళ
## సమ్మక్క - సారలమ్మ జాతర

మేడారం జాతర... తరతరాల మహిళా శక్తి ప్రాధాన్యాన్ని చాటిచెప్పే మహత్తర జాతర ఇది. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నాలుగు రోజుల పాటు ఇది జరుగనుంది. పితృస్వామ్య వ్యవస్థను సవాల్ చేసే జాతర ఇది. చారిత్రాత్మక వీర నారీమణుల శౌర్యప్రతా



పాలకు జోహార్లు అర్పించే జాతర ఇది. ఉత్తర భారతంలోని గంగానదికి జరిగే ప్రయాగ కుంభమేళా తర్వాత, గోదావరి, కృష్ణానది పుష్కరాలం తటి జనం సందర్శించే విశిష్టమైన బృహత్ జాతర ఇది. రాష్ట్ర ప్రభుత్వం 18 ఏళ్ల కిందటే, అంటే 1996 లోనే అధికారిక జాతరగా ప్రకటించిన జాతర ఇది.

రెండేళ్ల కొకమారు దండకారణ్యంలో జరిగే తెలుగువారి గిరిజన జనారణ్య జాతర ఇది. ఎలాంటి దేవతామూర్తుల ప్రతిమలు లేకుండా చెట్ల మధ్య కేవలం కుంకుమభరిణలనే తెచ్చి పూజించే సంప్రదాయమున్న గిరిజన కోయపూజారులు నిర్వహించే జాతర ఇది. మన రాష్ట్రం నుంచే కాకుండా, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బస్తర్ మధ్యప్రదేశ్, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వెల్లువలా సందర్శించే జాతీయస్థాయిలో చెప్పుకోదగిన జాతరలలో ఇది ఒకటి. తెలంగాణకే పరిమితం కాదు, తెలుగునాట, దక్షిణ భారతంలో ప్రసిద్ధి పొందిన జాతర ఇది. దివ్యమైన శక్తి ప్రభావాలను వీరనారీమణులైన తల్లీబిడ్డలకు ఆపాదించి, కొలవందుకుంటున్న సమ్మక్క – సారాలమ్మ జాతర. ఇలా చెప్పుకుంటూ పోతే, ఈ జాతర ఎన్నెన్నో రికార్డులను తిరగరాస్తోంది. ప్రతిసారీ కొత్త రికార్డులను సొంతం చేసుకుంటోంది. విజయనగరంలో పైడితల్లి జాతర, విజయవాడ, అలంపురం క్షేత్రాల్లో దుర్గా జోగులాంబా తల్లుల నవరాత్రి ఉత్సవాలు, సికింద్రాబాద్ మహంకాళి బోనాలు, తెలంగాణ బతుకమ్మ పండుగ, రాయల సీమలో గంగానమ్మ జాతరలు కూడా శక్తి స్వరూపాలతోనే జరుగుతున్నాయి. కాకతీయుల కాలంలో ప్రతాపరుద్రదేవుడిని ఎదిరించిన వీర నారీ మణులైన సమ్మక్క – సారలమ్మల ధైర్యసాహసాలకు ఈ జాతర మూలకారణంగా నిలిచింది. కాకతీయుల వీర ప్రతాపాన్ని, పరిపాలన పటిమను మనం పొగుడుకుంటూనే, వీరిని ఎదిరించి కప్పం కట్టడానికి నిరాకరించి, వీర మరణం పొందిన ఈ గిరిజన నారీమణులను ఆరాధించే తత్వం వైవిధ్యంగా, రెండు రకాలుగా కనిపిస్తుంది.

కాకతీయ రాణి రుద్రమ, వీరనారీ ఝాన్సీలాగా సమ్మక్క సారలమ్మలు గత ఏడు వందల సంవత్సరాల నుంచి చరిత్రలో. నిలిచిపోయారు. వీరిని స్మరించుకుంటూ మాఘ పౌర్ణిమ నుంచి జరిగే జాతరను చూడడానికి రెండు కళ్లు సరిపోవు. మూడు రోజులు జాతరగా చెప్పుకుంటున్నప్పటికీని, దాదాపు నెల రోజుల ముందు నుంచే జాతరకు జనం గద్దెల వద్దకు తరలివచ్చి, మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఏటూరునాగారం అభయారణ్యంలో వరంగల్ జిల్లా తాడ్వాయి మండలంలో నిర్వహించే ఈ జాతరకు లక్షల మంది వస్తారు.

గిరిజనులతో సంబంధాలున్న జాతరల్లోకి వెడితే ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్లో గోండుల ఆధ్వర్యంలో జరిగే నాగోబా జాతర, శ్రీశైల క్షేత్రంలో నల్లమల గుట్టల్లో నివసించే చెంచులు ఆరాధించే మల్లన్న శివరాత్రి జాతరలు కూడా సుప్రసిద్ధమైనవే. వీరు ఈ దేవతామూర్తులను నేటికినీ తమ ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఖమ్మం, నల్లగొండ తదితర జిల్లా నుంచి పలు లంబాడాల జాతరలు కూడా ఉన్నాయి. గిరిజన పోరాట యోధుటైన బిర్సాముండా. కొంరంభీమ్, గోండ్వానా రాంజీలు కూడా గిరిజనులకు ఆరాధ్యదైవాలే.


భక్తులు సమర్పించిన చీరలు, కానుకలతో సమ్మక్క, సారలమ్మ దేవతలు

### కథలోకి వెళ్లితే...

కాకతీయ రాజ్యానికి సామంతరాజైన మేడారం పగిడిగిద్దరాజు కరువు కాటకాల వల్ల కప్పం చెల్లించడానికి నిరాకరిస్తాడు. పగిడిగిద్ద రాజు కరీంనగర్ జిల్లా పాలన ప్రాంతాన్ని పాలించిన మేడరాజుకు మేనల్లుడు. కాకతీయ చక్రవర్తియైన ప్రతాపరుద్రుడు కోపించి, తన మంత్రి యుగంధరుడిని సైన్యంతో యుద్ధానికి పంపిస్తాడు. మేడారం వద్ద యుద్ధం చేస్తాడు. ఆ యుద్ధంలో సంపెంగవాగు వద్ద కుమారుడు జంపన్న వీర మరణం చెందుతాడు. అప్పటి నుంచి ఆ వాగుకు జంపన్నవాగు అని పిలుస్తున్నారు. పగిడిగిద్ద రాజుతో పాటు, అతని భార్య సమ్మక్క- బిడ్డ సారలమ్మ, అల్లుడు గోవిందరాజులు వీరమరణం పొందుతారు. సమ్మక్క మాత్రం చిలుకలగుట్టవైపు వెళ్లి అంతర్థాన మైందని, ఆమె కోసం వెదికితే అక్కడ కుంకుమ భరిణె దొరికిందని అప్పటి నుంచి వీరనారీమణులకు జోహారుగా ఈ జాతరను రెండేళ్ల కొకసారి గిరిజనులు నిర్వహిస్తున్నట్లు చెబుతారు. ఈ వృత్తాంతం చరిత్రలో సరిగా నమోదు కాలేకపోవడం వల్ల రకరకాలుగా కథలు, జనఐతిహ్యంలో ప్రచారంలో ఉన్నాయి. ఇటీవలి కాలం నుంచి పక్కా ఆధారాలను వెతికే పనిలో పరిశోధకులు ఉన్నారు. ఇప్పటికే ఈ చారిత్రక సంఘటనపై పరిశోధకులు దృష్టి సారించి, కొంత సమాచారాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు.

డా. దివిటి అంజనీదేవి, కాకతీయ విశ్వవిద్యాలయ ఆ ఆచార్య అజ్మీరా సీతారాంనాయక్, డాక్టర్ ఎండి రాజ్‌మహమ్మద్, రాష్ట్ర గిరిజన మ్యూజియం క్యురేటర్ డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ తదితరులు ప్రత్యేకంగా పరిశోధనలు చేస్తూ, వ్యాసాలన వెలువరిస్తున్నారు. మేడారం చిలుకలగుట్ట సమీపంలో కట్టిన రెండు గద్దెలతో ఈ జాతర జరుగుతుంది. జాతర జరిగే నాలుగు రోజులు సమయంలో అక్కడ తల్లీబిడ్డలను రప్పించి ఈ జాతరను గిరిజను సంప్రదాయం ప్రకారంగానే నిర్వహిస్తున్నారు. గిరిజన తెగల్లోని కోయలు, చెంచులు, వడ్డెలు, గోండులు, లంబాడీలు, భిల్లులు తదితరులు ఈ జాతరను విశేషంగా సందర్శిస్తున్నారు.

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతరను నామమాత్రంగా

### మేడారం 'కథనం'

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన, ఆసియాలోనే అతిపెద్ద జనజాతర సమ్మక్కసారలమ్మ జాతర, అడవిలో కొలువైన దేవతలను కొంగు బంగారంగా కొలిచే జన ప్రవాహపు పవిత్రమైన జాతర. చారిత్రకంగా చూస్తే క్రీ.శ.1260 కాలంలో ఓరుగల్లు సామ్రాజ్యాన్ని పాలించిన ప్రతాపరుద్రుని సామంత రాజులుగా మేడారం పాలకుడిగా పగిడిద్దరాజు, కరీంనగర్ పాలకుడిగా మేడరాజును నియమించుకున్నాడు. నేటి జగిత్యాల జిల్లా పొలవాస ప్రాంత పాలకుడు మేడరాజు తన కూతురు సమ్మక్కను తన మేనల్లుడు మేడారాన్ని పాలిస్తున్న పగిడిద్దరాజు కిచ్చి వివాహం చేశాడు. పగిడిద్దరాజు, సమ్మక్క దంపతులకు ముగ్గురు సంతానం. వీరి పెద్ద కూతురే సారలమ్మ. మిగిలిన ఇద్దరు నాగులమ్మ, జంపన్నలు, మేడారంలో కరువు పరిస్థితుల కారణంగా పగిడిద్దరాజు కాకతీయ ప్రభువుకు కప్పం కట్టలేకపోతాడు. దీనికి కోపోద్రిక్తుడైన ప్రతాపరుద్రుడు అక్కడి గిరిజన జాతులను తన రాజ్యానికి వ్యతిరేకంగా మారుస్తున్నాడని పగిడిద్దరాజు పై యుద్ధం ప్రకటిస్తాడు. ఈ యుద్ధంలో 'గిరి'జనాన్ని ఏకతాటిపైకి తెచ్చి వారి ఆత్మ గౌరవాన్ని, అస్థిత్వాన్ని కాపాడటంలో పగిడిద్దరాజుతో సరిసమానంగా పోరాడిన వీర వనిత సమ్మక్క. సారలమ్మను, పగిడిద్దరాజును, నాగులమ్మ, గోవింద రాజులను ఈ యుద్ధంలో హతమారుస్తారు. శత్రువుల బారి నుండి తప్పించుకున్న జంపన్న సంపెంగ వాగులో పడి మరణిస్తాడు. ఇతని పేరు మీదనే దీనికి జంపన్న వాగు అనే పేరు స్థిరపడింది. ఓటమి భయంతో కాకతీయ సైనికుల సమ్మక్కను వెనుక నుండి తీవ్రంగా గాయపరుస్తారు. అలా తీవ్రంగా గాయపడ్డ సమ్మక్క చిలుకల గుట్టపైకి వెళ్ళి అదృశ్యమవుతుంది.

ఆమెను వెదుకుతూ వెళ్ళిన వారికి గుట్టపైన అదృశ్యమైన ప్రాంతంలో పసుపు, కుంకుమలు కనిపిస్తాయి. వాళ్లు దాన్నే సమ్మక్కగా, ఆనాటి నుండి సమ్మక్క, సారలమ్మలను వనదేవతలుగా పూజించటం మొదలు పెట్టారు. ఈ విధంగా మొదలైందే సమ్మక్క సారలమ్మ జాతర.

ఈ జాతర రెండేళ్లకోసారి అంగరంగ వైభవంగా జరుగుతుంది. గిరిజనులు వీరిని కులదైవాలుగా కొలుస్తూ ఉంటారు. ఇలా మొదలైన జాతర దేశవ్యాప్తంగా ప్రచారమై ప్రతి యేడు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ భక్తుల కోరికలు తీరుస్తూ ప్రజల ఇలవేల్పులుగా మారారు.





నిర్వహిస్తుండగా, 1975 నుంచి 1986 వరకు ఈ జాతర ప్రాధాన్యత పెరిగింది. తదుపరి ప్రభుత్వంలోని వివిధ శాఖల సమన్వయం, సంయుక్తాధ్వరంలోనే జాతర ఏర్పాట్లు జరుగుతున్నాయి. వరంగల్ జిల్లా మేడారం వద్దనే కాకుండా గత ముప్పై ఏళ్ల నుంచి కరీంనగర్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో సుమారు 70కి పైగా చోట్ల ఉప జాతరలు జరుగుతున్నాయి. సింగరేణి కార్మికులు తమ పనులు వదిలి జాతరకు వెళ్లకుండా ఉండడానికి గోదావరిఖనివద్దే ఈ జాతరను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ జాతరను ఆసియా ఖండంలోనే అరుదైన ప్రత్యేక గిరిజన జాతరగా అభివర్ణిస్తున్నారు.



ఈ జాతరలో గిరిజనుల మనోభావాలు, ఆచార సంప్రదాయాలు దెబ్బతినకుండా చూడడానికి నిర్వాహకులు ప్రయత్నిస్తున్నా.. కొన్ని ఆటంకాలు ఎదురవుతుండడం పట్ల గిరిజన సంఘాల నాయకులు తమ అసంతృప్తులను వెల్లగక్కుతున్నారు. ఉప జాతరల నిర్వహణ తతంగం పెరిగిపోతుండడంతో మేడారం కోయ పూజారులతో సహా, గిరిజన సంఘాలు తమ నిరసన వ్యక్తం చేస్తున్నాయి. జాతర ప్రాధాన్యం నిర్వీర్యం చేయడానికి, మదింపు చేయడానికి ఉప జాతరలు నిర్వహిస్తున్నారని వీరు పేర్కొంటున్నారు.

మాఘ పూర్ణిమ నాటి నుంచి మూడు రోజుల పాటు జాతర వైభవం కనబడుతుంది. తెల్లవారి తల్లీబిడ్డలను సాగనంపే వరకు ఈ జాతర నాలుగు రోజుల అధికారిక జాతరగా పేర్కొనవచ్చు. జాతరలో మొదటి రోజు కన్నెపల్లి నుంచి సారాలమ్మను తొలుత కోయపూజారులైన వడ్డెలు తీసుకుని వస్తారు. రెండో రోజు చిలుకల గుట్ట నుంచి సమ్మక్కను తీసుకొని వస్తారు. మూడో రోజున మొక్కు బదుల చెల్లింపులు ఉంటాయి. నాలుగవ రోజున సాయంత్రం దేవతలు వనప్రవేశం (వీడ్కోలు) చేస్తారు. పగిడిగిద్ద రాజు, గోవిందరాజులను కొత్తగూడ మండలం పొన్నుగూడెం నుంచి, తాడ్వాయి మండలం కొండాయ్ నుంచి తీసుకొని వస్తారు.

### జాతర విశిష్టాంతాలు

1992 లోనే జిల్లా కలెక్టర్ వంద మీటర్ల పొడవుగల జంపన్న వాగుపై బ్రిడ్జిని నిర్మించడం వల్ల మేడారానికి గిరిజన తెగలు రాకపోకలు సాగించడం సులువైంది. ఈ జాతరలో జంపన్న వాగులో పుణ్యస్నానాలు, శివసత్తుల పూనకాలు, అమ్మవార్ల గద్దెల సందర్శనాలు, తులాభారాలు, ముడుపులు, ఎదురుకోళ్ళు, తలనీలాలు వంటి మొక్కుబడులు చెల్లించుకోవచాలు. టెంకాయలు కొట్టడం, బంగారం (బెల్లం) పంచడం, బంగారంగా పసువు వినియోగించడాలు విశేషంగా వుంటాయి. ఈ జాతరకు వచ్చేముందు భక్తులు వేములవాడ రాజన్నను, కొమురవెళ్ళి మల్లన్నను, కొత్తకొండ వీరన్నను, ఐనవోలు క్షేత్రాలను సందర్శించుకునే ఆచారం వుంది. వీటన్నింటిని పరికించి చూస్తే, శాక్తేయానికి మిశ్రమ వీరశైవారాధనకు ఈ జాతర ముడిపడివుందని అర్థమవుతుంది.

– కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com

ద



# 'రైతు బీమా' – రూపశిల్పి

## తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు

సంక్రాంతి సందర్భంగా 'రైతు బంధు' సంబరాలు ఎలా సాగినా కూడా ఒక అంశంలో ప్రభుత్వ చర్యను అభినందించాలి. అది రైతుల జీవిత బీమా పథకం. మృతుల కుటుంబాలకు ఇది చీకట్లో చిరు దీపం. రూపశిల్పి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ప్రత్యేక అభినందనలు.

రూపొందించిన పథకాల్లో రైతు బీమా పథకం విలక్షణమైనది. విమర్శలకు తావు లేనిది. ప్రభుత్వమే రైతుల తరపున ప్రీమియం చెల్లిస్తూ మూడున్నరేళ్లుగా చేపడుతున్నఈ పథకం దేశంలో మరెక్కడా లేనిది. సకల జనులూ అభినందించదగిన ఈ పథకం ఆచరణలో విజయవంతమైనది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018లో ప్రారంభించిన రైతు బీమా ఒక ఉదార ప్రయత్నం. Farmers Group Life Insurance Scheme పేరిట రూపొందించిన ఈ పథకం వల్ల గడిచిన మూడున్నరేళ్ళలో దాదాపు 72 వేల రైతులకు పరిహారం అందడం అంటే అది మామూలు విషయం కాదు. ఒక్కో కుటుంబానికి ఐదు లక్షల చొప్పున మొత్తం నిన్నటి వరకు 3,618 కోట్ల 55 లక్షల సహాయం పరిహారంగా అందడం నిజంగానే ఒక నిశ్శబ్ద విప్లవం.




ముఖ్యమంత్రి కేసిఆర్ రైతాంగానికి ప్రాధాన్య మిచ్చి

18 సంవత్సరాల నుంచి 59 ఏండ్ల మధ్య వయస్సులైన రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా Life Insurance Corporation of Indiaతో ఒడంబడిక చేసుకొని ఏర్పాటు చేసిన బీమా సౌకర్యం నిరుపేద రైతులకు ఓదార్పుగా ఉన్నది. కేసిఆర్ దూరదృష్టి కారణంగా దుఃఖభారంతో ఉన్న కుటుంబానికి చక్కని అండగా మారింది.

ఒక నాటి తెలంగాణాలో నెలకొన్న జీవన విధ్వంసాన్ని మరచి, ఒక్క వరి రైతాంగం సమస్యలన్నీ రాష్ట్ర ప్రభుత్వం కొలిక్కి తేవాలను కోవడం, జీవిత బీమా

## 7. Rythu Bima - Farmer Group Life Insurance Scheme

**Reporting Date : 13 January 2022**

| SN | Year | No.of Farmers enrolled (In Lakhs) | Annual Premimum per farmer in Rs. | Total Premium Paid in Cr (excl GST) | No.of Deaths reported | No.of Claims Settled | Claim Amount Paid in Crores | Pending Claims | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | No.of Claims with LIC | No.of Claims with DAO | Total Pending Claims | Pending Claims Value in Cr |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 2018-19 | 31.25 | 2271.5 | 602.19 | 17757 | **17645** | 882.25 | 111 | 1 | **112** | 5.6 |
| 2 | 2019-20 | 30.73 | 3457.5 | 902.86 | 19102 | **18957** | 947.85 | 62 | 83 | **145** | 7.25 |
| 3 | 2020-21 | 32.73 | 3486.9 | 967.17 | 29126 | **28469** | 1423.5 | 235 | 422 | **657** | 32.85 |
| 4 | 2021-22* | 35.64 | 4110.11 | 732.51 | 9481 | **7300** | 365 | 298 | 1883 | **2181** | 109.05 |
| | TOTAL: | | | 3204.73 | 75466 | 72371 | 3618.55 | 706 | 2389 | 3095 | 154.75 |

* Total Premium for 2021-22 (Rs 732.51 Cr) paid towards first half yearly installment only excluding GST

పథకం నేపథ్యంలో వెల్లడైన మరణాల సంఖ్యని బట్టి ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం సహేతుకం కాదు.

ఈ పథకం ఆరంభించినప్పటి నుంచి దాదాపు 75 వేల మంది రైతులు చనిపోయారని తెలుస్తోంది. అందులో అనారోగ్యంతో మృతి చెందిన వారున్నారు. యాక్సిడెంట్ వంటి ప్రమాదాల్లో కన్ను మూసిన వారున్నారు. అలాగే ఆత్మహత్య చేసుకున్న రైతులు కూడా ఉన్నారు.



ఈ మరణాలన్నిటినీ ఒకే గాటున కట్టి ఒక నాటి తెలంగాణాలో నెలకొన్న జీవన విధ్వంసాన్ని మరచి, ఒక్కపరి రైతాంగం సమస్యలన్నీ స్వరాష్ట్రంలో ఒక కొలిక్కి రాలేదనడం, ఈ మరణాల సంఖ్యని ఎత్తి చూపుతూ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని అనుకోవడం సహేతుకం కాదనే చెప్పాలి.

ఐతే, నిజానికి ప్రభుత్వం గానీ ప్రైవేట్ సంస్థలు గానీ వీరి మరణాలకు గల కారణాలపై లోతైన అధ్యయనం చేస్తే అసలు రైతులు అరవై ఏండ్ల లోపే మరణించడానికి గల కారణాలతో పాటు మరెన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి. ఇలా కనీసం ఒక రెండు దశాబ్దాల గణాంకాలు గనుక లభిస్తే ఈ సమస్య లోతుపాతుల పట్ల అంచనా వేసుకోవోచ్చు. స్వరాష్ట్రంలో తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా తీసుకోగలం. ఏమైనా ఈ పథకం ఆరంభించిన కారణంగా అరవై ఏండ్ల లోపు రైతుల మరణాల సంఖ్య వ్యవసాయ అధికారుల వద్ద లభించడం ఇదే మొదటిసారి, అది భవిష్యత్తులో ఉపయోగమే అని చెప్పాలి.

కాగా, రాష్ట ప్రభుత్వం 2018 ఆగస్టు 15 రోజున ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది మొదలు, మొదటి సంవత్సరం 17, 757 మంది రైతులు మరణించగా, రెండో సంవత్సరం 19,102 మంది, మూడో సంవత్సరం అత్యధికంగా 29,126 మంది చనిపోయారు. గత మాసం గణాంకాల ప్రకారం 9,481 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. కాగా, మొత్తం మూడున్నరేళ్లలో మృతుల సంఖ్య 75, 466 ఉండగా ఇన్స్యూరెన్సు కంపెనీ నుంచి 72,371



కుటుంబాలకు ఐదేసి లక్షల చొప్పున పరిహారం అందింది. ఇంకా 3,095 మందికి అందవలసి ఉన్నది.

ఈ పథకం ద్వారా అత్యధికంగా పరిహారం పొందుతున్న సామాజిక శ్రేణులను పరిశీలిస్తే సహజంగానే వెనుకబడిన తరగతులే ఎక్కువ అని చెప్పాలి. దాదాపు యాభై శాతం రైతులు బిసిలే ఉన్నారు. ఆ తర్వాతి స్థానం వరుసగా ఎస్సీ, ఎస్టీలది. మొత్తం అందుతున్న పరిహారంలో మైనారిటీలు అందుకుంటున్న భాగం ఒక శాతం మాత్రమే ఉన్నదని కూడా తెలుస్తోంది.

18 నుంచి 59 ఏండ్ల వయో పరిమితి ఉన్న ఈ పథకంలో అందుకుంటున్న పరిహారాలను బట్టి వివిధ వయస్కుల వారు ఎవరూ అని విశ్లేషిస్తే ఈ పథకంలో యాభై ఏండ్లు నిండిన రైతులే అత్యధికంగా మరణిస్తున్నట్లు మన దృష్టికి వస్తోంది. ఆ తర్వాత అత్యధికంగా 39 నుంచి 48 ఏండ్ల మధ్య వయస్కులు మరణిస్తున్నారు. వారే దాదాపు 32 శాతం పరిహారం పొందారు. ఆ తర్వాత 29 నుంచి 38 ఏండ్ల మధ్య వయస్కులు దాదాపు 12 శాతం పరిహారం పొందారు. కాగా, 18 నుంచి 28 వయో పరిమితిలో మరణించిన రైతులు కూడా రెండు శాతం పరిహారం పొందారు.

నిజానికి గత రెండేళ్లుగా మరణాల సంఖ్య పెరగడానికి గల కారణాల్లో కోవిడ్ కూడా భాగమని మనం గమనించవలసి ఉన్నది. విశేషం ఏమిటంటే, ఈ పథకం వల్ల అకస్మాత్తుగా కోవిడ్ బారిన పడి మరణించిన ఎంతో మంది రైతులు ఈ బీమా పథకం ఉన్నందున ఐదు లక్షల సహాయాన్ని పొందగలిగారు.

నిజానికి కోవిడ్ బాధితులను ఇముడ్చుకునే ఆరోగ్య బీమా పథకాలేవీ లేని సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం మృతుల కుటుంబాలకు ఈ విధంగా కలిసి రావడం ఎవరమూ ఊహించలేదు. ఆ లెక్కన కూడా ఈ పథకం మనకు మరింత ప్రయోజనకారిగా మారిందనాలి.

కాగా, ప్రభుత్వం ఈ పథకంపై వెచ్చిస్తున్న డబ్బుల వివరాలకు వస్తే, తొలి ఏడాది తలా 2, 271 రూపాయల చొప్పున 602 కోట్లను ప్రీమియంగా చెల్లించగా రెండో ఏడు మొత్తం 902 కోట్లను ఆ తర్వాత ఏడాది 967 కోట్లను వెచ్చించింది. ఈ ఏడు తలా 4,110కి పెరగగా మొత్తం చెల్లింపు 1,464 కోట్లకు చేరింది. ఈ అర్ధ సంవత్సరానికి గాను అందులో సగం ఇప్పటికే 732 కోట్లు (జిఎస్‌టితో కలిపి) చెల్లించింది. దీంతో ఇప్పటిదాకా ప్రభుత్వం మొత్తం 3,204 కోట్ల రూపాయలను ఈ పథకానికి వెచ్చించగా ఎల్ఐసి రైతులకు పరిహారంగా చెల్లించినది అంతకన్నా ఎక్కువే.... నిర్దిష్టంగా చెప్పాలంటే 3,618 కోట్ల 55 లక్షల రూపాయలు కావడం విశేషం.

తనదైన శైలిలో, దూరదృష్టితో రైతాంగానికి మేలు చేసే ఈ పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రికి ఈ విషయంలో అభినందనలు చెప్పవలసిందే.

ప్రభుత్వం ప్రతి ఏటా వేయి కోట్లకు పైగా ఈ పథకంపై ఖర్చు చేయడం నిజానికి భారమే అయినప్పటికీ వేలాది రైతులకు లభిస్తున్న అండతో పోలిస్తే ఇది చాలా మంచి పనిగా చెప్పుకోవాలి. ఇది తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అభినందించదగ్గ పథకంగానూ పేర్కొనాలి.

సోర్స్ : తెలుపుటీవీ.కామ్‌లో
కందుకూరి రమేష్ బాబు వ్యాసం

# పర్యావరణ హితంగా భారతదేశం

## గ్లాస్గో సదస్సులో ప్రధాని మోదీ

భారతదేశం రాబోయే యాభైయేళ్ళలో శూన్యస్థాయి కర్బన ఉద్గారాల లక్ష్యాన్ని సాధిస్తుందని ప్రధాని మోదీ గ్లాస్గో సదస్సులో ఇచ్చిన హామీ పర్యావరణ ప్రేమికులను ఆనందాశ్చర్యాల్లో ముంచెత్తింది. పారిస్ ఒప్పందానికి కట్టుబడి ఉన్నది మేమేనంటూ భారత్ ఈ దిశగా వేసిన అడుగులను వివరించారు ప్రధాని. ప్రపంచ జనాభాలో 17శాతం ఉన్న దేశం, కర్బన ఉద్గారాల వాటాలో మాత్రం ఐదుశాతంగానే ఉందని గుర్తుచేస్తూ, పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో భారత్ ప్రపంచంలో నాలుగోస్థానంలో ఉన్నదని గుర్తుచేశారు. పర్యావరణ పరిరక్షణలో భారత్ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ ఐదుసూత్రాల ఎజెండాను ప్రకటించారు.



సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా సాగే విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 2030 నాటికి 500 గిగావాట్లకు పెంచడం, యాభైశాతం దేశ ఇంధన అవసరాలను పునరుత్పాదక వనరుల ద్వారా తీర్చుకోవడం, కర్బన ఉద్గారాలను బిలియన్ టన్నుల మేరకు తగ్గించడం ఇత్యాది హామీలను అటుంచితే, నెట్ జీరో లక్ష్యాన్ని యాభైయేళ్ళలోనే సాధిస్తామని మోదీ చేసిన ప్రమాణం ఊహకు అందనిది. ఈ విధమైన హామీలకు భారత్ సిద్ధంగా ఉన్న సంకేతాలు జీ 20 సదస్సులో కూడా లేవు. కర్బన ఉద్గారాల నిలిపివేతకు ఏ గడువులూ పెట్టుకోలేదని అక్కడ పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు కూడా. ఒకపక్క హామీ ఇచ్చిన మేరకు అభివృద్ధి చెందిన దేశాలనుంచి ఆర్థికసాయం దక్కకుండా, ఆధునిక సాంకేతికతల బదలాయింపులు జరగకుండా భారత్ గడువులు ఎలా ప్రకటించ గలుగుతుందని ఆయన ప్రశ్నించారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లకు స్వస్తిచెప్పడం, శిలాజ ఇంధనాలకు దూరం కావడం వంటివి నూక్లియర్ సప్లయర్స్ గ్రూపులో చోటు దక్కకుండా మాకు ఎలా సాధ్యమని ప్రశ్నించారు కూడా. ఎన్ఎస్ జీలో భారత్ ప్రవేశానికి చైనా మోకాలడ్డుతున్న విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో, మిగతా ప్రపంచానికి సరిగ్గా లెక్కలేసుకొనే మోదీ ఈ హామీలు ఇచ్చారా? అన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. వందకోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను నిలువరించడం అంటే, దేశం మొత్తం కర్బన ఉత్పత్తిలో దాదాపు ఐదోవంతు తగ్గించుకోవడం. దేశ విద్యుదవసరాల్లో పునరుత్పాదక ఇంధన వనరుల వాటా 12శాతం మాత్రమే ఉన్న స్థితినుంచి గట్టిగా మాట్లాడుకుంటే కేవలం ఎనిమిదేళ్ళలో యాభైశాతానికి చేరడం చాలా కష్టమైన ప్రయాణం. బ్రిటన్ ప్రకటించిన 'ఇండియా గ్రీన్ గ్యారంటీ' కొంతమేరకు మాత్రమే వెసులుబాటు కల్పిస్తుంది. ఇరుదేశాలూ చేయీచేయీ కలిపి ప్రకటించిన గ్లోబల్ స్థాయి సోలార్ పవర్ గ్రిడ్ ప్రాజెక్టు ఈ దిశగా మంచి అడుగే కానీ ఓ సుదీర్ఘ ప్రయాణం. సౌర, పవన విద్యుదుత్పత్తి వ్యవస్థలమీద భారీ పెట్టుబడులు పెట్టి ఆయా దేశాలను అనుసంధానించాలన్న బృహత్తర లక్ష్యం చేరుకోవడానికీ, ఫలితాలను అందుకోవడానికీ ఎంతో సమయం పడుతుంది. 'నెట్ జీరో' గడువు ప్రకటించని ఏకైక జీ 2-0 దేశంగా భారత్ కు ఉన్న అప్రదిష్ట మోదీ ప్రకటనతో తీరిపోయింది. దాదాపు వందదేశాలు 2050 గడువును చెప్పుకున్నప్పటికీ, పదిపదిహేను దేశాలు మాత్రమే తమ చట్టాలను తదనుగుణంగా సవరించుకున్నాయట. ఈ 'కార్బన్ నెట్ జీరో' లక్ష్యాన్ని ఇప్పటికి చిన్నదేశాలైన భూటాన్, సురినామ్ మాత్రమే సాధించాయి. మోదీ పంచసూత్రాలు మిగతాదేశాలకు ఉత్ప్రేరకంగా పనిచేయవచ్చు. అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలకు అండగా ఉంటామని ఎన్నడో హామీ ఇచ్చిన బడాదేశాలు ఇప్పటికైనా ఆచరణలోకి దిగితే మంచిది. పర్యావరణ పరిరక్షణ సదస్సు నిమిత్తం రోమ్ నుంచి గ్లాస్గోకు తరలివచ్చిన జీ 20దేశాల అధినేతల ప్రత్యేక విమానాలు వాతావరణంలోకి 14టన్నుల కార్బన్ ను విడుదల చేశాయని స్వీడన్ సంస్థ ఒకటి లెక్కకట్టింది. దేశాల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, కంపెనీల అధికారులు మొత్తం వెయ్యిమందికి పైగా 400 చిన్నాపెద్దా విమానాల్లో వచ్చి అతికొద్ది గంటల్లో వాతావరణాన్ని అత్యధికంగా కలుషితం చేశారని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. మాటల్లో చెప్పింది మనసులో లేకపోతే ఇలాగే ఉంటుంది. ఆశయానికీ, ఆచరణకూ మధ్య ఎండం ఉన్నప్పుడు లక్ష్యం ఎంత దూరంలో ఉన్నా చేరుకోవడం అసాధ్యం.

- దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



### భారతదేశపు మొట్టమొదటి యునెస్కో వారసత్వ నగరం

# అహ్మదాబాద్ (గుజరాత్)

**● ఏకైక బహుళ సాంస్కృతిక వారసత్వం ● జూలై 8, 2017న గుర్తింపు**


**భా**రతదేశంలోని సబర్మతీ నది తూర్పు ఒడ్డున 15వ శతాబ్దంలో సుల్తాన్ అహ్మద్ షా స్థాపించిన గోడల నగరం అహ్మదాబాద్. ఈ నగరం సుల్తాన్ కాలం నాటి గొప్ప నిర్మాణ వారసత్వాన్ని అందిస్తుంది. ముఖ్యంగా భద్ర కోట, కోట నగరం యొక్క గోడలు, ద్వారాలు తదితర నిర్మాణాలు ఎంతో అద్భుతంగా ఉంటాయి. మసీదులు, సమాధులు అలాగే తరువాతి కాలంలో ముఖ్యమైన హిందూ, జైన దేవాలయాలు, దిగుడు బావులు, మతపరమైన సంస్థలు వంటి లక్షణాలతో గేటెడ్ సాంప్రదాయ వీధుల్లో (పురాస్) చక్కగా నిర్మించి సాంప్రదాయ గృహాలతో (పోల్స్) రూపొందించబడింది. ఈ నగరం ఆరు శతాబ్దాల నుండి నేటికీ గుజరాత్ రాష్ట్రానికి రాజధానిగా కొనసాగుతుంది.

దేశంలోని పశ్చిమ రాష్ట్రాల్లో అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో ఒకటైన అహ్మదాబాద్ నగరాన్ని (గుజరాత్) జూలై 8, 2017న యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చబడింది. భారతదేశంలో యునెస్కోచే గుర్తించబడిన మొట్టమొదటి నగరం అహ్మదాబాద్. ఈ నగరం వారసత్వ ప్రదేశాల యొక్క నిధి.

#### అత్యుత్తమ సార్వత్రిక విలువ

గోడలతో కూడిన అహ్మదాబాద్ పాత నగరం చాలా శతాబ్దాలుగా మనుగడలో ఉన్న దాని ప్లాట్లతో పురావస్తు సంస్థగా పరిగణించబడుతుంది. పట్టణ పురావస్తు శాస్త్రం సుల్తాన్ కాలానికి చెందిన అవశేషాల ఆధారంగా పట్టణం యొక్క చారిత్రక ప్రాముఖ్యతను తెలుపుతుంది. సుల్తాన్ కాలం నాటి స్మారక కట్టడాలు





చారిత్రాత్మక నగరం యొక్క బహుళ సాంస్కృతిక స్వభావం యొక్క ప్రత్యేకతను ప్రదర్శిస్తున్నాయి. ఈ వారసత్వం ఇతర మతపరమైన భవనాలలో మూర్తీభవించిన పరిపూర్ణమైన సంప్రదాయాలతో, పాత నగరం యొక్క విలక్షణమైన "హవేలీలు" (పరిసరాలు), "పోల్స్" (గేటెడ్ రెసిడెన్షియల్ ప్రధాన వీధులు), ఖాడ్కీలు (పోల్స్‌లోని లోపలి ప్రవేశాలు)తో చాలా అద్భుతంగా దేశీయ చెక్కతో నిర్మాణాలు చేశారు. ఇవి అక్కడ సాంప్రదాయాన్ని ప్రదర్శించబడతూ, అహ్మదాబాద్ యొక్క పట్టణ వారసత్వంలో అంతర్భాగంగా ఉన్నాయి.


చారిత్రాత్మక నగరం యొక్క కలప-ఆధారిత వాస్తుశిల్పం అసాధారణమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. అహ్మదాబాద్ నగరం సాంస్కృతిక సంప్రదాయాలకు, కళలు, చేతిపనులకు, నిర్మాణాల రూపకల్పన, పదార్థాల ఎంపికకు, స్థానిక వాసులతో దాని సాంస్కృతిక సంబంధాలను నొక్కిచెప్పే పురాణాలు, నగరం దేశీయ వాస్తుశిల్పం యొక్క టైపోలాజీ కమ్యూనిటీ-నిర్దిష్ట పనితీరు, వారసత్వంలో ముఖ్య భాగమైన కుటుంబ జీవనశైలితో ప్రాంతీయ నిర్మాణానికి ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలిచి వుంది. అనేక మతాలకు చెందిన సంస్థల ఉనికి (హిందూ, ఇస్లాం, బౌద్ధం,



జైనం, క్రైస్తవం, జొరాస్ట్రియనిజం, జుడాయిజం) అహ్మదాబాద్ చారిత్రాత్మక పట్టణ నిర్మాణానికి బహుళ సాంస్కృతిక సహజీవనానికి అసాధారణమైన ప్రత్యేకమైన ఉదాహరణలు.

15వ శతాబ్దపు సుల్తానేట్ కాలం నాటి చారిత్రక వాస్తుశిల్పం దాని కాల వ్యవధిలో మానవ విలువల ముఖ్యమైన పరస్పర మార్పిడిని ప్రదర్శించింది. ఇది పాలక వలస వర్గాల సంస్కృతిని నిజంగా ప్రతిబింబిస్తుంది. పరిష్కార ప్రణాళిక మానవ విలువల సంబంధిత సిద్ధాంతాలు, సమాజ జీవనం, భాగస్వామ్యం, పరస్పరం ఆమోదించబడిన నిబంధనలపై ఆధారపడింది. మత తత్వ శాస్త్రానికి ప్రాతినిధ్యం వహించే ఈ స్మారక భవనాలు భారతదేశంలో అసమానమైన ఒక ముఖ్యమైన ప్రాంతీయ సుల్తానేట్ నిర్మాణ వ్యక్తీకరణకు ఉదాహరణగా నిలిచాయి. ఈ ప్రాంతంలో తమ ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు, సుల్తానేట్ పాలకులు స్థానిక మతపరమైన భవనాల భాగాలను, మూలకాలను నగరంలో మసీదుల నిర్మాణంలో తిరిగి కలపడానికి రీసైకిల్ చేశారు. అనేక కొత్త మసీదులు కూడా స్థానిక హస్తకళాకారులు, మేస్త్రీల గరిష్ట వినియోగంతో చిన్న భవనాల పద్ధతిలో నిర్మించబడ్డాయి. వారి స్వదేశీ హస్తకళను ఉపయోగించుకోవడానికి వారికి పూర్తి స్వేచ్ఛ నిచ్చాయి. దాని ఫలితంగా ఏర్పడిన వాస్తుశిల్పం ఉపఖండంలోని ఇతర ప్రాంతాలలో తెలియని ఒక ప్రత్యేకమైన ప్రాంతీయ సుల్తానేట్ ప్రతిబింబాన్ని అభివృద్ధి చేసింది. ఇక్కడ ఇస్లాం మతపరమైన భవనాలలో స్థానిక సంప్రదాయాలు, హస్తకళలు ఆమోదించబడ్డాయి. అవి ఇస్లామిక్ మతపరమైన భవనాల సిద్ధాంతాలను ఖచ్చితంగా పాటించక పోయినా, సుల్తానేట్ కాలం నాటి స్మారక చిహ్నాలు 15వ శతాబ్దపు పశ్చిమ భారతదేశ చరిత్రలో స్మారక కళల కోసం వాస్తుశిల్పం, సాంకేతికత అభివృద్ధి యొక్క ఒక ప్రత్యేక దశను సూచిస్తాయి.

నగర వీధులతో పాటు, కమ్యూనిటీ ప్రదేశాలతో పాటు, జీవన వాతావరణ సోపాన క్రమంలో అహ్మదాబాద్ నగరం స్థిరనివాస ప్రణాళిక స్థానిక జ్ఞానం, బలమైన సమాజ బంధానికి ప్రతినిధి. ఇల్లు, నీరు, పారిశుద్ధ్యం, వాతావరణ నియంత్రణ కోసం దాని స్వంత నిబంధనలతో స్వయం సమృద్ధి కలిగిన వ్యవస్థ. చెక్క చెక్కడం, కానానికల్ బేరింగ్‌ల ద్వారా వ్యక్తీకరించబడిన మతపరమైన ప్రతీకవాదంతో దాని చిత్రం, దాని భావన నివాసానికి ఒక తెలివిగల ఉదాహరణ. ఇది సంఘం ఆమోదయోగ్యమైన రూపంగా స్వీకరించబడి నప్పుడు, సెటిల్‌మెంట్ స్థాయిలో దాని బహిరంగ ప్రదేశాల్లో వ్యక్తీకరించబడిన కమ్యూనిటీ అవసరాలతో పూర్తి పరిష్కార






నమూనాను రూపొందించింది. స్వయం సమృద్ధిగా ఉన్న గేటెడ్ స్ట్రీట్ "పోల్" (రెసిడెన్షియల్ ప్రధాన వీధులు)ను రూపొందించింది. ఆ విధంగా అహ్మదా బాద్ పొరుగున ఉన్న క్లోజ్-ప్యాక్డ్ పోల్ యొక్క స్థిరనివాస నమూనాలు మానవ నివాసానికి అత్యుత్తమ ఉదాహరణగా నిలుస్తాయి.

### సాంప్రదాయిక సమగ్రత

అహ్మదాబాద్ ఆరు శతాబ్దాల కాలంలో అభివృద్ధి చెందింది. పెద్ద నగరంగా ఇప్పటికీ దాని మనుగడ అర్బన్ ప్రాంతాల్లో చెక్కుచెదరకుండా సంపూర్ణతను వెదజల్లుతుంది. దాని సాంప్రదాయిక స్థితిస్థాపకతతో మార్పులు, వృద్ధిని గ్రహించింది.

స్థలాకృతి, భౌగోళిక శాస్త్రంతో సహా చారిత్రాత్మక నగరంలో సమగ్రత ఇప్పటికీ పెద్ద స్థాయిలో ఉంచబడ్డాయి. స్థానిక అధికారులు మౌలిక సదుపాయాలను ప్రగతిశీలంగా అమలు చేయడం వల్ల హైడ్రాలజీ, సహజ లక్షణాలు మార్పులకు లోనయ్యాయి. నగరం యొక్క జనాభా, సమాజ ఆకాంక్షల పరంగా కూడా మార్పుల అవసరం పెరిగినందున విస్తరించబడింది. కాని బహిరంగ ప్రదేశాలు, ఉద్యానవనాలు, భూ వినియోగ నమూనాలు, ప్రాదేశిక సంస్థ చాలా వరకు మారలేదు. ఎందుకంటే పూర్వ కాలపు పాదముద్రలు, అవగాహనలు, దృశ్య సంబంధాలు (అంతర్గత, బాహ్య రెండూ). భవనం ఎత్తులు, మ్యాపింగ్ అలాగే పట్టణ పాత్ర, ఫ్యాబ్రిక్, నిర్మాణం యొక్క అన్ని ఇతర అంశాలు ఇప్పటికే ఉన్న చారిత్రాత్మక పరిమితుల్లో సరిపోతాయి. అయితే కాలక్రమంలో కొన్ని ఉల్లంఘనలు సంభవించాయి.



### నగర ఆర్కిటెక్చర్

అహ్మదాబాద్ నగర ఆర్కిటెక్చర్ దేశీయ భవనాల ద్వారా దాని బలమైన భావాన్ని సూచిస్తుంది. చెక్కతో కూడిన వాస్తుశిల్పం ఈ నగరానికి ప్రత్యేకమైనది. నివాసులకు సంవత్సరం పొడవునా సౌకర్యాల కోసం దాని వాతావరణ ప్రతిస్పందనను పరిగణనలోకి తీసుకుంటే మొత్తం రూపం దాని పనితీరులో చాలా 'సేంద్రియంగా' ఉంటుంది.

కోట నిర్మాణం, మైదాన్-ఎ-షాహీ, జామా మసీదు చివర మూడు ద్వారాలు, దాని ఉత్తర, దక్షిణాన ఒక పెద్ద మైదానం, ఈ ఇస్లామిక్ పట్టణాన్ని స్థాపించడానికి సుల్తాన్ అహ్మద్ షా యొక్క మొదటి చర్యలు. మైదాన్-ఎ-షాహీకి ఇరువైపులా, జామా మసీదు చుట్టూ ఉన్న పొలిమేరల్లో కూడా శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందాయి.

అన్ని సామాజిక వర్గాల కోసం గృహ భవనం నిర్మాణంలో ఉపయోగించే పదార్థం కలప, ఇటుక రాతితో కలిపి ఉంటుంది. కలప దాని వినియోగంలో చాలా మంచి వాతావరణ సౌలభ్యం, మానవీయ నాణ్యతను కూడా అందించింది. ఈ శ్రావ్యమైన నాణ్యతను అందించే నిర్మాణ మూలకాలలో పరిమాణాల యొక్క ముఖ్యమైన మౌళిక నియంత్రణతో సామరస్య జీవన వాతావరణాన్ని అభివృద్ధి చేయడంలో ఇది గొప్ప ఏకీకృత ప్రభావం.

ఇంటి మొత్తం పరిమాణంతో సంబంధం లేకుండా ఇంటి లోపల సెంట్రల్ యార్డ్‌తో ప్లాన్‌ని నిర్వహించడానికి ఇంటి రూపం ఆమోదించబడింది. లోపల విధులు ఎల్లప్పుడూ ఇంటి పరిమాణాన్ని బట్టి ప్రాంగణం చుట్టూ లేదా దాని వెంట నిర్వహించబడతాయి. ఇది అన్ని కమ్యూనిటీలలో తప్పనిసరిగా సమానంగా ఉండేది.

### సమాజ సంస్కృతి

వారి మత విశ్వాసాలతో సంబంధం లేకుండా ప్రజలందరూ చేరి 'మహాజన్' (ప్రభుత్వ-సంఘం) భావన సమాజ సంస్కృతిని సృష్టించింది. ఇక్కడ గొప్ప సామాజిక శ్రేయస్సు, భాగస్వామ్యం భావన ఉంది. ఇది ఇస్లామిక్, హిందూ-జైన్ అనుచరుల ఇతర ప్రముఖ





సమాజాలలో కూడా గమనించబడుతుంది. ఆరోగ్యకరమైన సహజీవనానికి ప్రతిస్పందనగా సమాజ బంధం ప్రజలందరి అంతర్గత విధి. దీని ఆధారంగా మార్కెట్లు నిర్వహించబడ్డాయి. వ్యాపారులందరూ ఇందులో భాగమయ్యారు. ఇక్కడ వ్యక్తిగత ఆసక్తులు సామూహిక నీతి, నైతికతకు అనుబంధంగా పరిగణించబడ్డాయి. ఈ విధంగా భాగస్వామ్యం చేయబడిన సంస్కృతి నగరంలో ఆదర్శప్రాయమైన సంస్థలను ప్రోత్సహించడానికి ఒక ముఖ్యమైన మూలంగా మారింది. ఇది ఒక నగరాన్ని క్రమక్రమంగా పరిశ్రమ, వాణిజ్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఒక ప్రధాన కేంద్రంగా ఉంచడం ద్వారా బలీయమైన ప్రదేశంగా అభివృద్ధి చేయడంలో సహాయపడింది.



## రక్షణ, నిర్వహణ అవసరాలు

అహ్మదాబాద్‌లో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా జాబితా చేసిన 28 స్మారక చిహ్నాలు, స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్కియాలజీ జాబితా చేసిన ఒక స్మారక చిహ్నాం, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ ద్వారా రక్షించబడిన 2,696 ముఖ్యమైన భవనాలు ఉన్నాయి.


యాంటిక్విటీస్ అండ్ ఆర్ట్ ట్రెజర్స్ యాక్ట్, 1972, పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం, 1958 సవరణ, ధ్రువీకరణ చట్టం, 2010 ద్వారా ఎఎస్ఐ జాబితాలో ఉన్న ఈ స్మారక చిహ్నాలు జాతీయ స్థాయిలో చట్టపరమైన రక్షణను పొందుతాయి. ఎఎస్ఐచే జాబితాలో ఈ స్మారక చిహ్నాం ప్రాంతీయ దీని ద్వారా రక్షించబడింది.

గోడలతో కూడిన చారిత్రక నగరం యొక్క భాగాలు, జాబితాలో వున్న భవనాలు, సైట్‌లు అహ్మదాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధి ప్రణాళిక ద్వారా ప్రత్యేక నిబంధనలతో జోన్‌గా రక్షించబడ్డాయి.

హెరిటేజ్ డిపార్ట్‌మెంట్, అహ్మదాబాద్‌లో హెరిటేజ్ మేనేజ్‌మెంట్ కోసం నోడల్ ఏజెన్సీగా, హెరిటేజ్ మేనేజ్‌మెంట్ ప్లాన్ తయారీలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. దీనికి ఏఎంసీ లోని అన్ని సంబంధిత అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు, ఎయుడిఎ , ఏఎస్ఐ, గుజరాత్ ఎన్‌డీఏ, నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ వంటి అధికారుల మద్దతు ఉంది.

ఏఎంసీలోని హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ నగరం యొక్క డాక్యుమెంటేషన్, పరిరక్షణ, పర్యవేక్షణ బాధ్యతల పరిధికి సంబంధించిన సామర్థ్య భవనం, సాంకేతిక సామర్థ్యంతో సుసంపన్నం చేయబడాలి.

ప్రతిపాదిత హెరిటేజ్ మేనేజ్‌మెంట్ ప్లాన్ నగర సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, స్థిరమైన నిర్వహణ కోసం ఒక ముఖ్యమైన సాధనం. హిస్టారిక్ అర్బన్ ల్యాండ్‌స్కేప్ విధానాన్ని ఉపయోగించి స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తూ నగరం, సముదాయం, పెద్ద



ప్రాదేశిక స్థాయిలో అన్ని నిర్ణయాత్మక ప్రక్రియలలో కీలకమైన అంశంగా చారిత్రక ప్రాంతాల యొక్క సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, స్థిరమైన పట్టణ అభివృద్ధిని ఏకీకృతం చేయడం దీని లక్ష్యం.

ముఖ్యంగా ప్రైవేట్ యాజమాన్యం లోని కలప గృహాలు. నగరం యొక్క పశ్చిమ భాగంలో కొత్త నిర్మాణాలు, అభివృద్ధి ప్రాజెక్టుల పరిధి, ప్రభావం యొక్క వివరణాత్మక అంచనాను నిర్వహించాలి.

**పర్యాటకులు తప్పకుండా సందర్శించవల్సినవి :**


అహ్మదాబాద్ నగరంలోని పూర్వపు భాగాలలో రెండు-శతాబ్దాల నాటి పరిసర ప్రాంతాలు సమాజ జీవనానికి ఒక ఉదాహరణ. సాధారణంగా ఒక ద్వారం పోల్ (రెసిడెన్షియల్ ప్రధాన వీధి)కి ప్రవేశాన్ని సూచిస్తుంది. చెక్క ముఖభాగాలతో కూడిన భవనాలతో కప్పబడిన ఇరుకైన దారులు మధ్య చతురస్రంలో కలుస్తాయి. ప్రతి పోల్ (రెసిడెన్షియల్ వీధి) ఒకే మతం లేదా కులం లేదా వృత్తికి చెందిన వ్యక్తులచే ఉండుటచే, ఇళ్ళు సమాజంలోని నిర్మాణ శైలిని ప్రతిబింబి స్తాయి. ఓపెన్ స్క్వేర్‌లో మతపరమైన నిర్మాణం, కమ్యూనిటీ బావి, పక్షులకు ఆహారం ఇవ్వడానికి స్థలం ఉన్నాయి. "అహ్మదాబాద్ నగరం క్రమాను గత జీవన వాతావరణంలో వీధిని కూడా కమ్యూనిటీ స్థలంగా రూపొందించడం స్థానిక జ్ఞానం, బలమైన సంఘం ప్రాతినిధ్యం వహిస్తుంది..."



అహ్మదాబాద్‌లోని ఝుల్టా మినార్లను (షేకింగ్ మినార్లు) నిర్మించిన మాస్టర్-బిల్డర్ల గురించి చాలా తక్కువగా తెలిసినప్పటికీ, వారు ఇప్పటికీ భారతదేశ ఇంజనీరింగ్ సాహసాలకు ఉదాహరణలుగా నిలిచారు. ఈ జంటలోని ఒక మినార్ కదిలితే, మరొకటి కూడా వణుకుతుంది. గొప్పగా చెక్కబడిన ఈ మూడు అంతస్తుల ఎత్తైన మినార్లలో రెండు జతలు ఉన్నాయి. ప్రతి అంతస్తు దాని స్వంత చిన్న బాల్కనీతో ఉంటుంది. పొడవైన జంట కలుపూర్ ప్రాంతంలోని అహ్మదాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉంది. మరొకటి సారంగాపూర్ గేట్ సమీపంలో ఉంది. అయితే, మినార్లు ఎలా కదిలిపోయాయో తెలుసుకోవడానికి బ్రిటిష్ వారు చేసిన ప్రయత్నాల వల్ల ఒకటి ధ్వంసం అయ్యింది. మినార్లకు సందర్శకుల ప్రవేశం అనుమతిలేదు.

ఇండో-ఇస్లామిక్ వాస్తుశిల్పాన్ని వెల్లడి చేసే కొన్ని ముఖ్య ఆకర్షణలు జామా మసీదు, తీన్ దర్వాజా, భద్ర గేట్, కింగ్స్ అండ్ క్వీన్స్ సమాధులు మొదలైనవి. మరాఠా కాలం, వలస రాజ్యాల కాలం నాటి భవనాలు కూడా గోడలతో కూడిన నగరంలో ఉన్నాయి.

మానెక్ చౌక్‌కు పశ్చిమాన 15వ శతాబ్దం ప్రారంభంలో జామా మసీదు ఉంది. విశాలమైన బహిరంగ ప్రాంగణం చుట్టూ పెద్ద అరబిక్ కాలిగ్రఫీతో చిత్రించబడిన నిలువు వరుసలు ఉన్నాయి. ప్రధాన ప్రార్థనా మందిరంలో 15 గోపురాలకు మద్దతుగా 260 నిలువు వరుసలు ఉన్నాయి. మసీదు, ఆర్కేడ్ క్లిష్టమైన శిల్పాలతో కప్పబడి ఉన్నాయి.





రాజు సమాధి లేదా బాద్షా నో హజీరో, జామా మసీదుకు తూర్పున ఉంది. ఒక ద్వారం ద్వారా అనుసంధానించబడి ఉంది. అహ్మద్ షా I, అతని కుమారుడు మహమ్మద్ షా II, మనవడు అహ్మద్ షా II సమాధులు ఉన్నాయి. సెంట్రల్ హాల్ నాలుగు మూలల్లో చిన్న గోపుర గదులు ఉన్నాయి. ఇవి తోరణాలలో అమర్చబడిన చిల్లులు గల రాతి తెరలతో ఉంటాయి. ఇక్కడ మహిళలకు ప్రవేశం లేదు. రాణి సమాధి లేదా రాణి నో హజీరో వీధికి అడ్డంగా ఉంది. సమాధి ప్రాంగణంలో పరివేష్టితమై ఉంది. సమాధికి వెళ్లే రహదారి మహిళల దుస్తులు, ఉపకరణాలను విక్రయించే మార్కెట్‌కు ప్రసిద్ధి చెందింది.




16వ శతాబ్దానికి చెందిన సిడి సయీద్ మసీదును తప్పక సందర్శించాలి. సంక్లిష్టంగా చెక్కబడిన రాతి 'జాలీ' పని, ముఖ్యంగా పశ్చిమ గోడ కిటికీల వెంట, లేస్ నమూనాల వలె చక్కగా కనిపిస్తుంది. పురాతన కాలం నాటిది అయినప్పటికీ, 15వ జైన తీర్థంకరుడైన శ్రీ ధర్మనాథునికి అంకితం చేయబడిన 1848 హుతీసింగ్ జైన దేవాలయం, నిర్మాణ వారసత్వం చాలా కాలం తరువాత ఎలా జాగ్రత్తగా సంరక్షించబడిందో చెప్పడానికి ఒక ఉదాహరణ. వ్యాపారి షెత్ హుతీసింగ్ ఆలయాన్ని నిర్మించడానికి సాంప్రదాయకంగా ప్రసిద్ధి చెందిన మాస్టర్ హస్తకళాకారులను నియమించారు.

అహ్మదాబాద్‌లో అనేక స్టెప్‌వెల్‌లు ఉన్నాయి. స్థానికంగా వావ్ అని పిలుస్తారు. ఇది గుజరాత్‌లోని పాత నగరాల ముఖ్య లక్షణం. అదాలజ్ వావ్, దాదా హరీర్ వావ్ అనేవి రెండు అత్యంత ప్రసిద్ధ స్టెప్‌వెల్‌లు. గొప్పగా చెక్కబడిన ఈ మెట్ల బావులు కమ్యూనిటీ సమావేశ మైదానాలుగా కూడా పనిచేశాయి. ప్రజలు ఇక్కడికి నీరు తీసుకురావడానికి వస్తారని, గోడల వెంట చెక్కబడిన దైవానికి ప్రార్థనలు చేస్తారని, వేసవి తాపాన్ని తట్టుకోవడానికి ఇక్కడ సమయం వెచ్చిస్తారని నమ్ముతారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ వావ్ ఇండో-ఇస్లామిక్ ఆర్కిటెక్చర్, డిజైన్‌కు ఉదాహరణ. హిందూ, జైన చిహ్నాలతో సజావుగా కలిసిపోయే సంక్లిష్టమైన ఇస్లామిక్ పూల నమూనాల శ్రావ్యమైన ఆట. దాదా హరీర్ వావ్, సాధారణ శిల్పాలతో పాటు, గోడలపై సంస్కృతం, అరబిక్ లిపిలు చెక్కబడ్డాయి.

15వ శతాబ్దానికి చెందిన భద్ర కోటను చాలా కాలం తరువాత ఏఎస్ఐ సహకారంతో నగర మునిసిపాలిటీ ద్వారా పునరుద్ధరించ బడింది. వాటిపై అందమైన చెక్కడాలు, మసీదులు, ద్వారాలు, బహిరంగ ప్రదేశాలతో కూడిన రాజభవనాలు ఉన్నాయి. దీనికి పశ్చిమాన అహ్మద్ మసీదు ఉంది. మైదాన్ షా లేదా కింగ్స్ మార్కెట్ తూర్పున ఉంది. 17వ శతాబ్దపు ప్యాలెస్, ఆజం ఖాన్ సరాయ్, ప్రయాణికులకు సత్రంగా ఉండేది. బ్రిటిష్ కాలంలో ఆసుపత్రి, జైలుగా పనిచేసింది.

మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమానికి నిలయం. అహ్మదాబాద్ బెంగాలీ కవి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు కూడా ఆతిథ్యం ఇచ్చింది. "నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ కూడా నగరంలో నివసించారు. నది ఒడ్డున మొగలులు నిర్మించిన భవనంలో నివసిస్తున్నప్పుడు వారి అత్యంత కవితా రచనలను ఇక్కడ రూపొందించారు" అని యునెస్కో సైట్‌లో కెవి సౌందర రాజన్ పేర్కొన్నారు.







అహ్మదాబాద్ నుండి దాదాపు ఎనిమిది కి.మీ దూరంలో ఉన్నప్పటికీ, మరచి పోకూడని మరొక ప్రదేశం సర్ఖేజ్ రోజా. ఒక గొప్ప మెట్ల ట్యాంక్ చుట్టూ సమాధి. అహ్మద్ ఖట్టు గంజ్ బక్ష్ (1445), మసీదు, మెహమూద్ షా బెగడ, అతని రాణి సమాధులు, రాజభవనాలు, మంటపాలు ఉన్నాయి. భవనాలు పూర్తిగా తోరణాలు లేకపోవటం, అంతటా కట్టిన రాతి ట్రేల్లిస్‌లను ఉపయోగించడం విశేషం.


అహ్మదాబాద్ మ్యూజియంలు నగరం విభిన్న సాంస్కృతిక వారసత్వం గురించి ఒక ఆధారాన్ని అందిస్తాయి. యునెస్కో గుర్తింపుకు మరొక ముఖ్య ప్రమాణం వస్త్ర తయారీ వారసత్వం. నగరం యొక్క సంస్కృతి దాని ఔత్సాహిక కమ్యూనిటీల సంప్రదాయాలతో నిండి ఉంది. అవి మతపరమైన విషయాలతో సంబంధం లేకుండా వ్యాపారులు నిర్వహిస్తుంటారు.

యునెస్కో ప్రకారం అహ్మదాబాద్ నగరం మలేషియాలోని చారిత్రాత్మక పట్టణం మెలక - జార్జ్‌టౌన్, ఫ్రాన్స్‌లోని చారిత్రాత్మక నగరం లియోన్ ఒకే విధంగా ఉంటాయి. మెలకతో కొన్ని సారూప్యతలు ఉన్నాయి. స్థాపన కాలం 15వ శతాబ్దానికి చెందినది. లియోన్ మరింత చారిత్రాత్మకమైనది. కానీ దాని గణనీయమైన విస్తరణ 15వ శతాబ్దం నాటిది. అహ్మదాబాద్ లాగా, మెలక-జార్జ్‌టౌన్, చారిత్రాత్మక నగరం లియోన్ వ్యాపారులు, వాణిజ్య పట్టణాలు, భౌగోళిక స్థానాలు దాని పాత్రలో విభిన్నంగా ఉన్నప్పటికీ జనాభా యొక్క ప్రధాన ఆర్థిక స్థావరం ఒకేలా ఉంది. అది వాణిజ్యం. మెలకా, లియోన్ రెండూ స్థాపించ బడినప్పటి నుండి అహ్మదాబాద్ వలె బహుళ-సాంస్కృతిక పట్టణాలుగా ఉన్నాయి. ప్రతి కమ్యూనిటీ వారి స్వంత స్థావరాలను కలిగి ఉండేలా ప్రణాళిక చేయబడింది. నగరాలు తమ సజాతీయత, సంప్రదాయాలను నిలుపుకుంటూ వాటి అభివృద్ధి చెందుతున్న దశలలో వీటి సారూప్యతలున్నాయి.

**-సువేగా,** m : 9030 6262 88

e: desk.deccan@gmail.com












# మహిళల మదిని దోచే మట్టి గాజులు

గాజులు అంటే ఇష్టపడని మహిళలు ఉండరు. బీరువాలో ఎన్ని డిజైన్లలో గాజులు ఉన్నా.. మళ్లీ ఇంకో డజన్ గాజులు తీసుకుందాం అనిపిస్తుంది వారికి. ప్రతి చీరకు కూడా మ్యాచింగ్ గాజులు తీసుకోవాలని వారికి ఉంటుంది. బంగారు గాజులను వేసుకోవాలనే కోరిక అందరికీ ఉంటుంది. కానీ, వారి వారి ఆర్థిక స్థితిగతులను బట్టి కొందరు బంగారు గాజులు చేయించుకుంటే, మరికొందరు వజ్రాల గాజులు కూడా చేయించుకుంటారు. అయితే, మట్టి గాజులు అందరికీ అందుబాటులో ఉంటాయి. డబ్బులతో సంబంధం లేకుండా కొందరు మట్టి గాజులను బాగా ఇష్టపడతారు.

తెలుగు రాష్ట్రాలు హస్తకళలకు, చేతి వృత్తులకు ఒకప్పుడు కాణాచి. పూర్వము తెలుగు నేలపై చేతి వృత్తులకు అపూర్వ ఆదరణ లభించింది. అగ్గిపెట్టెలో యిమిడె పట్టుచీరను నేసిన ఘనత మన తెలుగు నేతగాళ్ళది. అలాగే శిల్పకళ, చిత్రకళ, కుమ్మరి, కమ్మరి వృత్తులు కూడా ఆదరణ చెందాయి. పరాయి పాలనలో క్రమంగా ఈ వృత్తుల కళల ప్రాబల్యం క్రమంగా సన్నగిల్లి అడుగంటిపోయాయి.


అతి పురాతనమైన చేతికళల పరిశ్రమలలో చేతిగాజుల పరిశ్రమ ఒకటి. మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైనవి మట్టిగాజులు. చేతికి గాజులులేని స్త్రీలను వూహించలేము. స్త్రీలచేతులకు గాజులు వుండటం గౌరవ సూచకము. స్త్రీలు ఆభరణాలపై, పట్టుచీరెలపై ఎంత మక్కువ చూపెదరో, గాజులపై అంతే మక్కువ చూపిస్తారు. గాజులను మహిళలు ధరించడం సనాతన భారతీయ సంప్రదాయములో ఒకభాగము. ముత్తైదువకు వుండే ఐదు లక్షణాలలో గాజులు ఒకటి. గాజుల తయారి, అమ్మకంపై ఆధారపడి నేటికి కొన్ని లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఎక్కడ తిరునాల, లేదా జాతరలలో మనకు తప్పని సరిగా కన్పించేవి గాజులమ్మే దుఖాణాలు. గ్రామ ప్రాంతాలలోని వారపు సంతలలో కూడా గాజులమ్మే వారు కన్పిస్తారు. పూర్వకాలములో ప్రత్యేకముగా ఒక కులము (గాజుల బలిజ) వారు ఈ గాజులమ్మే వృత్తిలో వుండేవారు. గాజుల వుత్పత్తిదారుల నుండి గాజులను టోకులో కొనుగోలు చేసి ఊరూర తిరుగుచు, ఇంటింటికి తిరిగి గాజులమ్మేవారు. పూర్వకాలములో ఇంటిలో పెళ్ళి జరిగిన, శ్రీమంతము జరిగిన, లేదా ఏ శుభకార్యము జరిగిన గాజులోళ్ళను ఇంటికి పిలిపించుకుని, ఇంటిల్లిపాది ఆడవాళ్ళు గాజులు వేయించుకుని, వారికి నమస్కరించి, తగిన విధముగా సంభావన యిచ్చి పంపేవారు. ఏదైన కార్యము మీద బయటకు వెళ్ళునప్పుడు గాజులమ్మేవారు కాని, మట్టిగాజులు ధరించిన స్త్రీ ఎదురుగా వచ్చిన శుభకరమని, వెళ్ళే కార్యము జయప్రదంగా జరుగుతుందని భావిస్తారు. ఆధునిక కాలంలో వచ్చిన పెను మార్పుల కారణముగా ఊరూర తిరిగి గాజులమ్మే వారు కనుమరుగైపోయారు. కాని గాజుల వాడకం మారలేదు, తగ్గలేదు. అధునాతనంగా, పారిశ్రామికంగా దేశము మారినా, ఇప్పటికి గాజుల పరిశ్రమ హస్తకళ/చేతి వృత్తుల పరిశ్రమగా కొనసాగుతూ, కొన్ని లక్షల మధ్య తరగతి కుటుంబ ఆడవారికి జీవనోపాధి కల్పిస్తున్నది.

వేదకాలం నాటి కన్న ముందే స్త్రీలు గాజులు ధరించే వారని లభించిన ఆధారాలను బట్టి తెలుస్తున్నది. మహెంజొదార త్రవ్వకాలలో లభించిన చిత్రాలలో చేతికి కంకణం ధరించిన స్త్రీ చిత్రాలున్నాయి. యక్షిణి చిత్రాలలోని యక్షిణి కూడా చేతికి కంకణం ధరించింది. బాణబట్టు తన కావ్యములో సరస్వతిదేవి చేతికి గాజులు (కంగణ్) ధరించినట్లుగా పేర్కొన్నాడు. పురాతన తవ్వకాలలో తక్షశిల వద్ద, మౌర్య సామ్రాజ్యకాలం నాటి రాగి గాజులు లభించాయి. అజంతా చిత్రాలలోని, ఎల్లోరా శిల్పాలలోని స్త్రీలు గాజులు (కంగన్)











ధరించడం కన్పిస్తున్నది. క్రీ.పూ. 230–100 నాటికే సింధు లోయలో గాజులు ధరించేవారని తెలుస్తున్నది. జానపద పాటలలో, కావ్యాలలో, సాహిత్యములో గాజుల ప్రస్తావన విస్తృతంగా కన్పిస్తున్నది.

సిక్కులు తమ మతాచారంలో లోహంతో చేసిన గాజును ధరించెదరు. దానిని 'కడ' అంటారు. చేతికి ధరించే ఈ కంకణములను ఎక్కువగా గాజు (గ్లాస్‌తో చెయ్యడం వలన 'గాజులు' అనే పేరు తెలుగులో రూడి అయ్యింది. గాజులనే కరకంకణములని కూడా అంటారు. గాజులను సంస్కృతములో 'కంకణ్' అనియు, హిందీలో 'చిడియ', 'చుడ' అని అంటారు. పంజాబులో వధువులు పెళ్ళికి 21 రోజుల ముందు నుండి కాని, లేదా పెళ్ళి తరువాత సంవత్సరం వరకు ఏనుగు దంతముతో చేసిన గాజులని ధరించడం సంప్రదాయం. ఉత్తర ప్రదేశ్‌లో పెళ్ళికూతురు ఎర్రచీర, ఎర్రగాజులు ధరించడం శుభదాయకంగా తలచెదరు. మహారాష్ట్రలో, కర్నాటకలో, ఆంధ్రలో పెళ్ళికూతురు పచ్చగాజులు ధరించడం ఆనవాయితీ. పచ్చరంగు శుభానికి ప్రతీకగా భావిస్తారు.



అలాగే పూర్వకాలంలో రాజస్తాన్ వివాహిత స్త్రీలు భర్త వున్నంత కాలము మణికట్టు నుంచి, ముంచెయ్యి వరకు ఏనుగు దంతముతో చేసిన గాజులు ధరించేవారు. అలా ధరించడం వలన తన కుటుంబానికి, భర్తకు, సంతానానికి శుభం కలుగుతుందని నమ్మకము, విశ్వాసం. పశ్చిమ బెంగాల్‌లో చిన్న గవ్వలు లేదా ఎర్ర పగడాలతో చేసిన గాజులను చేతులకు వేసుకొనడం పెళ్లయిన ఆడవారికి ఆచారంగా ఉంది. నేటికి ఆదివాసి, గిరిజన స్త్రీలు చేతులకు నిండుగా, ముంజేతి వరకు తెల్లటి, వెడల్పాటి చెక్కతో లేదా వెదురుతో చేసిన గాజులు ధరించడం గమనించవచ్చును. స్త్రీ దేవతామూర్తులకు ఎర్రగాజులను భక్తులు కానుకగా, ముడుపులుగా సమర్పించెదరు. కలకత్తాలో కాళీ దేవతకు ఎర్రగాజులను భక్తులు సమర్పించుకుంటారు. మిగాతా ప్రాంతాలలో నల్లటి గాజులను సమర్పించుకుంటారు. దక్షిణ భారతదేశములో స్త్రీ గర్భవతిగా వున్నప్పుడు, పుట్టింటి వారు 'శ్రీమంతము'లో ఒకచేతికి 21 గాజులు, మరోచేతికి 22 గాజులు తొడుగుతారు. గాజుతో చేసే గాజుల పరిశ్రమను మొగలుల కాలములో బాగా ప్రోత్సహించారు. ముఖ్యముగా ఫిరోజాబాద్‌లో గాజుల పరిశ్రమ అభివృద్ధి చెందుటకు కారణము మొగలు సుల్తానులు యిచ్చిన ప్రోత్సాహమే కారణము.

**గాజుల తయారీ?**

బంగారు గాజులు, బ్లాక్ మెటల్ గాజులు, రబ్బరు గాజులు, మట్టి గాజులు, లక్కగాజులు... ఎన్నో. కొంచెం కళాహృదయం ఉండాలే కానీ గాజులకే హారాలు అలంకరించవచ్చు. కళాపోషకులైన మహిళల మదిని ఇట్టే దోచేయవచ్చు. ఆ పని మాత్రం ఇంత వరకు మగవాళ్ల చేతిలోనే ఉండిపోయింది. కానీ మీరు తలుచుకుంటే మీ ఇంట్లోనే లక్క గాజుల తయారీ పరిశ్రమ పెట్టొచ్చు.

**ఏమేం కావాలి:**

సాధారణంగా పరిశ్రమల స్థాపనకు యంత్రసామగ్రి వంటి మౌలిక వసతులు అవసరం. లక్క గాజుల పరిశ్రమకు ప్లక్కర్, కట్టర్ వంటి చిన్న సాధనాలు, ఇంట్లో ఉపయోగించే పాత్రలు ఐదారు, గాజులు ఆరబెట్టడానికి స్టాండులు, నలుగురు మహిళలు కూర్చోవడానికి వీలుగా ఉండే చిన్న గది చాలు.

**ముడి సరుకు:**

అల్యూమినియం రింగులు, లెపాక్స్ ఆర్, లెపాక్స్ ఎక్స్ రసాయనాలు, వెల్‌కమ్ పౌడర్, స్టోన్స్, కుందర్స్, చమ్కీలు, చైనులు, రంగులు అవసరం. రెండు నెలలపాటు గాజులు చేయాలంటే కనీసంగా కొంత ముడిసరుకుని సిద్ధం చేసుకోవాలి. ఎంతెంత పరిమాణంలో ఉండాలో, ఎంతెంత ధరల్లో దొరుకుతాయో చూద్దాం.

వెల్‌కమ్ పౌడర్ – 25 కిలోలు (కిలో రూ. 400)

లెపాక్స్ ఆర్ – 2 కిలోలు (కిలో 350–400)

లెపాక్స్ ఎక్స్ – 2 కిలోలు (కిలో 350–400)

ఐదారు రంగులు (యాభై గ్రాముల ప్యాకెట్ 50 రూపాయలు)

స్టోన్స్ – మూడు నాలుగు సైజులైనా తీసుకోవాలి. వాటిలో పదిరంగులుండేలా చూసుకోవాలి. ఒక్కొక్క రంగులో వంద గ్రాముల స్టోన్స్ తీసుకోవచ్చు. ధర స్టోన్ క్వాలిటీని బట్టి వందగ్రాముల ప్యాకెట్ 80 నుంచి 700 రూపాయలుంటుంది. చమ్కీలు – ఇవి కూడా పది రంగుల్లోవి తీసుకోవాలి. వంద గ్రాముల చమ్కీల ధర 50 రూపాయలుంటుంది.

చైన్స్ – గోల్డ్ కలర్, సిల్వర్ కలర్‌తోపాటు ఇతర రంగులలో కూడా ఉంటాయి. వీటిని కిలోల చొప్పున కొనాలి. కిలో రూ. 200










ఉంటుంది. ఒక్కో రంగు చైన్ ఒక్కో కిలో చొప్పున తీసుకోవచ్చు. గాజుల తయారీలో చైన్లు తప్పనిసరి కాదు. గాజులు మరింత ఆకర్షణీయంగా కనిపించడం కోసమే.

అల్యూమినియం రింగులు – సైజుల వారీగా ఒక్కొక్క సెట్. ఒక సెట్‌కి 60 – 70 రింగులుంటాయి. ఒక రింగు రెండు నుంచి ఇరవై రూపాయల వరకు ఉంటుంది. ఈ రింగుల సైజ్ గాజుల సైజుల్లాగే 2.4, 2.6, 2.8 అనే మూడు సైజుల్లో ఉంటాయి. (ప్రస్తుతం పై ధరల్లో మార్పులు ఉండవచ్చు).

**తయారీ ఇలా!**

లెపాక్స్ ఆర్, లెపాక్స్ ఎక్స్ రసాయనాలు బంకలాగ జిగురుగా ఉంటాయి. ఈ రెండింటినీ (వేటికవి విడిగా) వెల్‌కమ్ పౌడర్‌లో కలపాలి. కిలో లెపాక్స్‌కి నాలుగు కిలోల వెల్‌కమ్ పౌడర్ కావాల్సి ఉంటుంది. వీటిని చపాతీల పిండిలా కలుపుకోవాలి. ఈ రెండు మిశ్రమాలను (వెల్‌కమ్ పౌడర్‌లో కలిపిన లెపాక్స్ ఎక్స్, లెపాక్స్ ఆర్) కలిపి అల్యూమినియం రింగుకు అతికిస్తే గాజు తయారవుతుంది. వెంటనే (లక్క ఆరి గట్టిపడే లోపు) గాజు మీద కావల్సిన డిజైన్లలో రాళ్లు, కుందన్లు, చమ్కీలు, చైన్లు అతికించుకోవాలి.



ఇరవై నిమిషాలకు జిగురు కొంత వరకు ఆరిపోతుంది. ఆ తర్వాత కుందన్స్ వంటివి అతికించే ప్రయత్నం చేస్తే అతుకుతాయిగానీ గాజు ఆకారం చెడిపోతుంది. అందుకే పది, పదిహేను నిమిషాల లోపే పని పూర్తి చేయాలి. కుందన్స్ అతికించడం వంటి అలంకరణ అంతా అయిన తర్వాత గాజుల స్టాండుకు తగిలించి ఆరు గంటల సేపు ఆరనివ్వాలి. లక్క గట్టి పడి రాయిలా మారుతుంది. ఇక ఆ గాజు పగలదు, విరగదు.

గాజులను చెయ్యుటకు, మామూలుగా యితర గాజు వస్తువులను తయారు చేసే ముడి గాజునే ఉపయోగిస్తారు. 'ఫర్నేస్'లో ముడి గాజును బాగా కరిగే వరకు వేడిచేసి అందులో ఒక గొట్టంను ముంచి బయటకు తీస్తారు. గొట్టం చుట్టు కరిగిన గాజు స్థూపాకరంగా ఏర్పడుతుంది. ఇలా ఏర్పడిన స్థూపాకారవలయ గాజును గొట్టం మీద వుండగానే, గాజు గట్టిపడకముందే నెమ్మదిగా కొట్టి సమ ఆకారంగా, తిమ మందంగా, వుండేటట్లు చేస్తారు. యిప్పుడు మరో ఫర్నేస్లో యాంత్రికంగా, నెమ్మదిగా తిరుగుచున్న రోలరకూ పై భాగములో, గొట్టముపై వున్న గాజును వేడి చేసి, రోలరు యొక్క పై భాగానికి తాటించెదరు. యిప్పుడు, గొట్టం మీది గాజు రోలరు మీద సన్నని దారాలవలే వలయాలుగా ఏర్పడును. చూడటానికి ఈ స్థితిలో 'స్ప్రింగ్'వలే వుండును. ఈ వలయాన్ని నిలువుగా 'డైమండ్ కట్టరు' ద్వారా కట్ చేస్తారు. యిలా కట్ చెయ్యడం వలన రెండు చివరులున్న రింగులుగా ఏర్పడును.

**జుదాయి**

'జుదాయి'లేదా 'జుడాయి' విభాగములో విడిగా వున్న రింగులను దగ్గరిగా చేర్చి రింగుగా చెయ్యడం జరుగును. దీనిని 'జోడించడం'లేదా 'జుదాయి' అంటారు. కిరోసిన్ ద్వారా గాలిని వేడిచేసి, వేడిగాలి సన్నని గొట్టం వంటి నాజిల్ ద్వారా వచ్చేటప్పుడు గాజు రింగుల రెండు విడి చివరలను వేడి గాలి ద్వారా, లేదా సన్నని మంట ద్వారా, రెండు చివరలు దగ్గరిగా చేర్చి అతికించెదరు. ఎక్కువగా ఈ పనిని ఆడ కార్మికులు చేస్తారు.

**సాదై**

ఈ విధానంలో అంచులను దగ్గరిగా చేర్చి అతికించిన గాజుల జాయింట్లను మరియొక సారి వేడిచేసి, ఏమైన తేడాలుంటే సరిచేసి, గాజు అన్ని వైపుల నుండి సమానంగా కన్పించేలా చెస్తారు. ఈ పనికూడా ఎక్కువగా మహిళ కార్మికులే చేస్తారు.

**డెకరేషన్**

ఈ విభాగంలో గాజులకు నగీషీలు చెక్కి, అవసరమైతే 'జరీ' అద్ది కావలసిన రంగులను అద్దకము చెయ్యబడును. ఈ విభాగంలో కాస్త ఎక్కువ నైపుణ్యం కలిగిన కార్మికులు మాత్రమే చేస్తారు.

**–సువేగా,**
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# యక్షగాన సాహిత్యంలో కల్పిత కథలు

సామాన్య జనజీవనంలో నుండి ఆవిర్భవించి వర్ధిల్లినవి జానపద కళలు. ఇవి స్వయంభువులు. సామాన్య ప్రజల ఆశలకూ, ఆశయాలకూ, ఆలోచనలకూ, ఆవేదనలకు ప్రతిబింబాలు కావడం వల్ల ఇప్పటికీ సజీవంగానే నిలిచి ఉన్నాయి. జానపద కళలు మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకలు కాబట్టి ఎంతకాలం మన ఆలోచనల మీద ప్రభావాన్ని చూపుతాయో అంతకాలము అవి నిలిచి వుంటాయి. జానపద కళలలో యక్షగాన వాఙ్మయము అతి ప్రాచీనమైనది. దీనిని ప్రజాసాహిత్యమని చెప్పవచ్చు. ఇతివృత్తం పౌరాణికాలు గానీ, సాంఘికాలుగానీ, ఏదైనప్పటికీ ఆబాల గోపాలాన్ని అలరించింది. అంతేకాదు భారత, భాగవత, రామాయణాలలో ఉన్న గొప్పతనాన్ని, విలువలను సామాన్యమానవుని అనుభవంలోకి తీసుకు వచ్చి, సాహిత్యపు వైశిష్ట్యాన్ని చవి చూపాయి.



యక్షగానమనగా యక్షులచేత గానం చేయబడేది అని అర్థం. యక్షులంటే పూజనీయులు, శ్రేష్టులనీ, యక్షగానమంటే శ్రేష్టమైన గానమనీ అర్థంతో చెప్పుకోవచ్చు. యక్షగానం దేశీయ ఛందోబద్ధమైన నాటకం. బ్రౌణ్య నిఘంటువు యక్షగానాలను పాటగా పేర్కొన్నది. అప్పకవి దృష్టిలో యక్షగానమంటే పాటలుగల ప్రబంధం. యక్షగానాలు శ్రీనాథుని కాలంలో చాలా ప్రచారంలో ఉండేవి.

*"కీర్తింతు రెద్దాని కీర్తి గాంధర్వులు*
*గాంధర్వమున యక్షగాన సరణి"*

అన్నదానిని బట్టి ఈ విషయం స్పష్టమవుతుంది. 12వ శతాబ్దానికి చెందిన పాల్కురికి సోమనాథుడు యక్షగాన ప్రదర్శన విధానం గురించి వర్ణించాడు. చెన్నశౌరి రాసిన సౌభరిచరితమే తెలుగులో మొదటి యక్షగానమని చెప్పవచ్చు. కానీ ఈ గ్రంథము అలభ్యము. దొరికిన ఆధారాలను బట్టి కందుకూరి రుద్రకవి రాసిన సుగ్రీవ విజయమే తొలి తెలుగు యక్షగానమని స్పష్టమగుచున్నది.

యక్షగానంలో పౌరాణిక ఇతివృత్తాల కన్నా కాల్పనికాలు ఎక్కువగా కనిపిస్తాయి.





యక్షగాన ప్రదర్శనలు జనపదాల్లోకి చొచ్చుకొని పోవడం వల్ల ప్రజలు పౌరాణిక ఇతివృత్తాలను విస్మరించి కల్పనలనే వాస్తవమని భ్రమపడే అవకాశం ఏర్పడింది.

ఈనాటికీ యక్షగానం సజీవంగా నిలిచి వున్నదంటే దానికి కారణం తెలంగాణ యక్షగాన పితామహుడు చెర్విరాల భాగయ్యగారు. వీరు మెదక్ జిల్లా గుమ్మడిదల నివాసి. వీరు 34 పైగా యక్షగానాలు రచించారు. వీరి యక్షగానములు రచనా ప్రక్రియలో, వస్తు తత్త్వములో వైవిధ్యమును ప్రదర్శించినవి. ప్రసిద్ధమైన పాత్రలకు కల్పితమైన ఇతివృత్తాలు చేర్చి భాగయ్యగారు ఎన్నో యక్షగానాలు రాశారు. అందులో డాంగ్వే యోపాఖ్యానము, అల్లీరాణికథ, కనకతార చరితము, గులేబకావళి కథ, రంభా రంపాల, జయంతపాలము. మొదలైన కల్పిత యక్షగానాలు ప్రదర్శింపబడి తెలుగునాట ఎంతగానో ప్రజాదరణ పొందాయి. భాగయ్యగారు రాసిన కల్పిత కథల్లో జయంతజయపాలము ఒకటి.



చోళదేశాన్ని పాలించే రథాంగ మహారాజు కుమారుడు జయపాలుడు. వీరి మంత్రి రత్నాంగుడు. ఇతని కుమారుడు జయంతుడు. జయంత జయపాలులు ప్రాణస్నేహితులు. వీరిద్దరి మధ్య స్నేహాన్ని చెడగొట్టడానికి నియమించబడిన వేశ్య భువనసుందరి. జయపాలుని భార్య ప్రభావతి. ఈమెకు మేదరి వెంకన్నతో అక్రమ సంబంధము ఉంటుంది. ప్రభావతి భర్త నిద్రించిన తర్వాత మేదరి వెంకన్న వద్దకు వెళ్తుంది. ఆలస్యమైనందుకు మేదరి వెంకన్న కోపపడగా, ప్రభావతి తన భర్త వచ్చాడని చెప్తుంది. వెంకన్న ప్రభావతికి ఖడ్గమిచ్చి తన భర్తను చంపుమనగా, చంపేసి ఆ నేరాన్ని సాధువుపై మోపి దుఃఖిస్తుంది. ప్రభావతి మాటలు నమ్మి రాజభటులు సాధు వేషంలో ఉన్న జయంతుని బంధించి చెరసాలలో వేస్తారు. ప్రభావతి సోదరుడైన చంద్రశేఖరుడు నిజాన్ని గ్రహించి జయంతుని విడిచి పెడతాడు. ప్రభావతి ఒకరోజు రాత్రి మేదరి వెంకన్న ఇంటికి పోవుచుండగా పట్టుకొని, చంద్రశేఖరుడు వారిరువురిని బంధించి శిక్ష వేస్తాడు.

జయంతుడు, జయపాలుని అస్థికలను మూటకట్టుకొని తన భార్య భానుమతి దగ్గరు వెళ్తాడు. శయన మందిరములో నిద్రిస్తుండగా భానుమతి చేయి జయపాలుని అస్థికల మీద పడగా జయపాలుడు పునర్జీవితుడవుతాడు. లేచి శయ్యమీద ఉన్న జయంతున్ని చూసి కోపంతో కంఠం నరికివేస్తాడు. భానుమతి జయపాలున్ని దూషిస్తుంది. భానుమతి కాళీమాత వరప్రభావం వల్ల జయంతుని బ్రతికిస్తుంది. జయపాలుడు తన తప్పును తెలుసుకొని జయంతుని క్షమించమంటాడు.

ఈ యక్షగానంలో అడుగడుగునా ఉత్కంఠను రేకెత్తించే సన్నివేశాలు కనబడతాయి. కథలోని మలుపులు ప్రేక్షకులను ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. ఈ యక్షగానం స్నేహానికీ, పాతివ్రత్యానికీ, నీతికీ ఎప్పటికైనా విజయం సిద్ధిస్తుందనీ గొప్ప సందేశాన్నిచ్చింది. కాల్పనిక ఇతివృత్తాలలో ఊహకందని సన్నివేశాలు కనిపిస్తాయి. అవి రచయిత అసంకల్పితంగా సృష్టించాడనడానికి అవకాశం లేదు. ఎందుకంటే ప్రతి సన్నివేశానికి ఒక ప్రయోజనం కనిపిస్తూనే ఉంటుంది.

– డి. రాజు

e: arundhathitelugu@gmail.com

m : 9989515549

ద

# అమ్మదేవతల కొలువు

అడివిలో నివసించే మనుషులకు, వ్యవసాయం చేస్తున్న వారికి భూమి అమ్మ. పిల్లలకు జన్మనిస్తున్న స్త్రీలను, పంటలనిస్తున్న భూమిని పోల్చుకున్నారు. ఇద్దరికి వున్న సంతానశక్తిని చూసి అచ్చెరువు పొందిన పురామానవులు భూమిని స్త్రీగా, అమ్మగా, స్త్రీని అమ్మదేవతగా చేసుకున్నారు. జంతువులలో, చెట్లలో, మనుష్యులలో పునరుత్పత్తి శక్తులను గమనించిన మానవులు వాటి ప్రజనన(ఫెర్టిలిటి) శక్తికి అబ్బురపడిపోయారు. సంతానం కోరి, పంటల్ని కోరి, ఉత్పత్తి కేంద్రాలైన స్త్రీలను, భూమిని, జంతువులను, చెట్లను ఆరాధించారు. అడివిని కోరిన తిండి యివ్వమని, రక్షణ కల్పించమని, ఎల్లప్పుడు తన ఒడిలో దాచుకొమ్మని ప్రార్థన చేస్తారు. వాళ్ళకు అడివి తెలుసు, అడివిలోని జంతువులు, చెట్లు చేమలు, పండ్లు, వేర్లు, గడ్డలు తెలుసు. వానలు, కొండ కాలువలు, నీటిగుండాలు, మట్టి, రాళ్ళు అన్నీ తెలుసు. చెట్టుని, పుట్టని, గుట్టని, జంతువుల్ని, పిట్టల్ని, వాగుని, వంకని, బువ్వనిచ్చే భూమిని, పెద్దల్ని గిరిజనులు గౌరవించారు, ఆదరించారు. వాటన్నిటికి మహిమలున్నాయని భావించారు. భౌతిక జీవనం నుంచే, సామాజిక జీవితం నుంచే భావనలు పుట్టుకొచ్చాయి. ప్రకృతి ప్రేమికులైన ఆదిజనులు ప్రకృతిసిద్ధమైన వాటినన్నిటికి మానవాతీత ఆరోపణలు చేసుకున్నారు. ఆరాధనలు మొదలుపెట్టారు.



కీసరగుట్ట – నగ్న కబంధ

ఆదిమానవులు నివసించిన తమ ఆవాసాలలో వేసిన రాతిచిత్రాలలో స్త్రీని చిత్రించిన తీరు అపురూపం. ఖమ్మం జిల్లా రామచంద్రాపురం దగ్గరలోని నీలాద్రి రాతిచిత్రాలలో స్త్రీరూపానికి బదులుగా యోని (Vulva)ని చిత్రించారు. వాటిని మొదట పెట్రోగ్లైఫ్స్‌గా చెక్కి, ఎరుపు రంగుతో చిత్రించారు. చిత్రించడానికి వాడిన త్రిభుజాకారపు గుర్తు ఏదో లిపిలోని అక్షరంలెక్క వుంది. అట్లాంటివి గుర్తులు ఈ రాతిచిత్రాలలో ఎక్కువచోట్ల గమనించాను. క్యూనిఫారం లిపిలో స్త్రీ అని అర్థానికి వాడిన త్రిభుజాకారపు అక్షరచిహ్నం (ఫాంట్) నీలాద్రి రాతిచిత్రాలలోని త్రిభుజాకారపు గుర్తులు ఒకటే విధంగా ఉన్నాయి. త్రిభుజశీర్షం నిటారుగా కాక ఒకవైపునుండడం గమనించాలి. త్రిభుజాకారాన్ని స్త్రీత్వానికి, స్త్రీ సంతానోత్పత్తిని సూచించడానికి వాడడం ఆచారంగా వుంది. శ్రీయంత్రం కొన్ని త్రిభుజాల సమ్మేళనం. ఇప్పటికి త్రిభుజాకారపు రాయిని 'మైసమ్మ'గా కొలువడం సిద్ధిపేట జిల్లా జనగాంలో మా చరిత్రబృందం గుర్తించింది. జనగామజిల్లా వెల్దండ గుట్టమీద కూడా చేయిచెక్కిన త్రిభుజాకారపు రాయి అమ్మదేవతగా కొలువులందుకుంటున్నది.

నీలాద్రి రాతిచిత్రాలలో రెండు చోట్ల స్త్రీ ప్రసవ చిత్రాలు కనిపించాయి. యోనిగుర్తులు, ప్రసవచిత్రాలు మాతృదేవత మూర్తులను గుర్తుకు తెచ్చాయి. క్రీ.పూ. నుంచి మధ్యయుగాల చివరదశ దాక తెలంగాణాలో నగ్నకబంధగా పిలువబడే మాతృదేవతాశిల్పాలు నాగార్జునకొండ, కీసర, సింగరాయకొండ, ఆలంపురాలలో, అనేక మధ్యయుగాలనాటి దేవాలయాలలో అగుపిస్తుంటాయి. ఇటువంటి యోనిచిత్రాలు, ప్రసవ దృశ్యాలను పచ్ మరి, బింబేట్కా వంటి రాతిచిత్రాల తావులలో, మధ్యయుగాల నాటి దేవాలయాల్లో కూడా చెక్కినారు. కడపజిల్లా చింతకుంట రాతిచిత్రాలలో కూడా చారిత్రకకాలానికి చెందిన లజ్జాగౌరి చిత్రం గీయబడిఉంది. ఆస్ట్రేలియాలోని రాతిచిత్రాలలో కూడా నగ్నకబంధ చిత్రం కనిపించింది. ఈ అమ్మదేవతల భావన అతి ప్రాచీనం.

పశుపాలకులైన పురామానవులు, వ్యవసాయం చేపట్టేవరకు తినదగిన ఆహారంలోనికి పండ్లు, వేర్లు, గడ్డలు, జంతువులు, చెట్ల రకాలు, గడ్డి ధాన్యాలు చేరాయి. అవి వాళ్ళకు పవిత్రమైనవి. ఈ పవిత్రత లేక అతీత భావనలు చోటు చేసుకుంటున్న కొద్ది ఆరాధనా రూపాలు అవతరించడం మొదలైంది. తాము నివసించే ప్రదేశాలు వారి మీద చూపిన ప్రభావాలన్ని వారి ఆరాధనా భావనలుగా మారుతూ వచ్చాయి. ద్రిమ్మరిజీవనంలో మాడ్చే ఎండలు, కొంపలు కూల్చే తుఫాన్లు, భయంకరమైన ఉరుములు, పిడుగులు ఆకాశం నుంచే వస్తున్నాయి. కనుక ఆకాశం దైవభావనలోనికి చేరింది.

మొదటి వ్యవసాయకులు స్త్రీలే అంటాడు గోర్డన్ చైల్డ్. భూమికున్న ఫలదీకరణ శక్తిని గుర్తించింది వారే. తమతో పోల్చుకున్నారు. సాగుచేయడం మొదలుపెట్టారు. కడుపులో బిడ్డను సాకినట్లే మొక్కల్ని సాకింది ఆడవాళ్ళే. తర్వాత కాలంలో స్త్రీలతో వృక్షారోపణం చేయించడం అట్లాంటిదే. కడుపుతో వున్న స్త్రీతో విత్తనాలు పాతించడం ఒక ఆచారం. 'అమ్మదేవతలు దేవతలందరిలో ప్రథమస్థానం పొందారు. సాంఘిక నిర్వహణ స్వభావం మీద ఆధారపడి స్త్రీల పట్ల గౌరవం ఏర్పడింది. ఒకప్పుడున్న మాతృస్వామిక




స్త్రీ ప్రసవ చిత్రాలు (నీలాద్రి)



నీలాద్రి రాతి చిత్రాలలో స్త్రీ రూపానికి బదులుగా యోని చిత్రీకరణ

సమాజాలలో స్త్రీదే పెద్దరికపు స్థానం' అంటాడు డేవిడ్ ఆర్ స్టార్ బక్ అనే అమెరికన్ ఆంత్రోపాలజిస్టు, ఆర్కియాలజిస్టు.

దేవుళ్ళలో దేవతల ఆధిక్యత, పూజారులలో పూజారిణుల పెద్దరికాలకు కారణం పైతృకత్వం కన్నా మాతృత్వం మిన్నగా గుర్తించడం వల్లనే. వేట-ఆహార సేకరణ దశలో మనిషి చేసిన ఉత్పత్తి అనేది లేదు. గింజలు, పండ్లు, చిన్న జంతువులు ఆహారంగా తీసుకునేటపుడు మనుషుల నడుమ శ్రమ విభజన లేదు. ఈటె కనుక్కొన్న తర్వాత మగమనిషికి వేట ముఖ్యమైన పని అయింది. స్త్రీలకు ఆహారసేకరణే ప్రధానమైంది. వేట జీవితమైన మానవజాతులలో స్త్రీలకు పూర్వపు చలన సమయం తగ్గిపోయింది. వేట నుంచి పశుపోషణ పురామానవుల జీవితంలో ఒక పరిణామం. అపుడు పశువుల కాపలా, పోషణ పురుషులకు మారింది. ఆవాసాల సమీపంలోనే స్త్రీలు విత్తనాలు నాటి సాగుచేయడం మొదలైంది. చిన్న, చిన్న ఆహారపంటల తోటల సాగు ప్రారంభం. తవ్వుకోలతో మొదలైన వ్యవసాయం నాగండ్లకు మారేసరికి వ్యవసాయం కూడా పురుషుల పాలైంది. స్త్రీ, పురుషుల మధ్య ఉత్పత్తిశ్రమల మారకం మాతృస్వామ్యం నుంచి పితృస్వామ్యానికి సామాజిక అధికారాలు మారిపోయాయి. 'ఆహారసంపాదనలో భాగంగా రాతియుగం నాటి తవ్వుకోలతో విత్తనాల సేకరణచేసి, స్త్రీలు వ్యవసాయాన్ని మొదలుపెట్టారు. పశువులను (గుర్రాలు, ఎద్దులు) కట్టి నాగండ్లతో దున్నడం కనిపెట్టినాక పితృస్వామ్యం మొదలైందనవచ్చు'. రుగ్వేదంలో మనువు వ్యవసాయం మొదలు పెట్టినట్లు చెప్పబడ్డది.



సిద్ధిపేట జిల్లా జనగామలో 'మైసమ్మ' దేవత


స్త్రీని శక్తిగా ఆరాధించడానికి కారణం స్త్రీని ప్రకృతిగా గుర్తించడమే. స్త్రీ జగన్మాతగా అంగీకరించడానికి మూలం. పౌరాణికంగా దేవిని శివుని పరివారగణంలో చేర్చి చెప్తారు. కాని, మధ్యధరా తీరదేశాల్లో అమ్మదేవత అనుచరగణంగా పురుష దేవుడుంటాడు. ప్రతిచోట ఆమె పెండ్లికాని స్త్రీగానే పేర్కొనబడింది. పవిత్రగర్భధారణ ద్వారా ఆమెకు సంతానం. దేవీ ఆరాధనలో గోప్యమైన ఆచరణలు, పరిశీలనలు గమనించినపుడు అవి పెండ్లి వ్యతిరేకత, శృంగారాల చెరిపివేతలను బోధిస్తున్నాయనిపిస్తుంది. ఇటువంటివి తండ్రిపాత్రను తక్కువగా చూసేటి, తండ్రి ప్రాధాన్యతలేని సమాజాచరణలో భాగమనిపిస్తుంది. మనిషి ఈ భూమ్మీద వున్నంతకాలం తిండి, పిల్లల్ని కనడం ప్రాథమికమైనవే. మనిషి ఉనికికి సరిపోయినంత ఆహారాదులు తప్పనిసరి. బతుకు మీద పెద్దమనుషుల తాత్వికతనే తర్వాతి తరం అందిపుచ్చుకుని వస్తున్నది.

గిరిజనులు, పురజనులు విత్తనాలు అలుకు చల్లేటపుడు, మొలకలు వేసేటపుడు నిలిపిన ఒక రాయికి గాని, 5 రాళ్ళకుగాని కుంకుమ చల్లుతారు. అది బహిష్టు రక్తానికి సంకేతం. మొహంజొదారోలో దొరికిన అమ్మదేవతలుగాని, ఇతర దేశాలలో లభించిన వీనస్, మాల్టేన్ వంటి అమ్మదేవతలు ఎరుపురంగు పూతతోనే వున్నాయి. పురాణాలలో, ప్రతిమా లక్షణశాస్త్రాలలో దేవతల వర్ణనలో రక్తవర్ణమే ప్రధానం. ప్రపంచవ్యాప్తంగా బహిష్టవుతున్న లేదా గర్భంతోవున్న స్త్రీమూర్తులు ఎరుపురంగుతోనే చిత్రించబడివున్నారు. పెళ్ళైన స్త్రీలు మాత్రమే నుదుట సింధూరం ధరించడానికి కారణం వారు మాత్రమే సంతానార్హులు అని తెలుపడానికేనని ఆంత్రోపాలజిస్టుల అభిప్రాయం. ఎరుపు పునర్జీవనానికి గుర్తు కనుక అంతటా విస్తరించిన ఈ ఆచారం ఒక ప్రాధాన్యమైన తంతు.

ప్రాచీన భారతదేశంలో పెండ్లితంతులో స్త్రీని విత్తనక్షేత్రంగా



నీలాద్రి ప్రసవ రేఖా చిత్రం




క్యూనిఫారం లిపి పట్టిక

సంబోధించి, పురుషుణ్ణి నీ విత్తనాన్ని నాటుమని అంటారు. మనుస్మృతి కూడా పురుషుణ్ణి విత్తనంగా, స్త్రీని క్షేత్రంగా పేర్కొంటున్నది. ఖురాన్ 'మీయొక్క స్త్రీలు క్షేత్రాలు' అంటుంది. తల్లిగర్భం భూగర్భం రెండు సమానమే. భూమి తల్లులకు తల్లి. వేదాల్లో భూమి మానవులకు తల్లి అని చెప్పబడ్డది. పర్షియన్ మతం ప్రకారం మనిషి భూమినుంచే పుట్టాడు. జర్మన్లు 'భూమిని స్తుతించు, మానవుల తల్లిని' అంటారు. మార్కండేయ పురాణంలో దేవి 'ఓ దేవతలారా, ఉధృత వర్షాకాలంలో నా శరీరం నుంచి నేను జీవమున్న చెట్లు చేమల్ని కాపాడుతాను. అందుకే నన్ను ఈ భూమ్మీద 'శాకాంబరి' అని పిలుస్తారు' అంటుంది. చరిత్రపూర్వ యుగంలోనే ఐరోపాలో భూమాత ఆరాధనలున్నట్టు చరిత్రకారులు రాసారు.

**పోస్టుస్క్రిప్టు:**

రాతిచిత్రకళా పరిశోధకులు ఇర్విన్ న్యూమెయిర్, బండి మురళీధర్ రెడ్డి నీలాద్రి లేదా బైనేటిబండలులోని ఈ రాతిచిత్రాలతావును తొలుత చూసారు. నీలాద్రి గుట్టలలో పడిగెరాళ్ళ కింద చిత్రించబడివున్న వందలాది ఎరుపురంగు రాతిచిత్రాలున్నాయి. ఇట్లా చెక్కుడుబొమ్మలు (పెట్రోగ్లిఫ్స్), ఎరుపురంగు చిత్రాలు ఒకేచోట కలిసివున్న శిలాశ్రయాలు (రాతి నెలవులు) అరుదైనవి. నీలాద్రి రాతిచిత్రాలు పురామానవుల ప్రాథమిక భావనలను గురించి లోతుగా అధ్యయనం చేయాలని ఎరుక చేస్తున్నట్టు అనిపిస్తున్నాయి. మరిన్ని లిపి చిహ్నాలకోసం నీలాద్రి చిత్రాలను పరిశీలించి, పరిశోధన చేయవలసిన అవసరం వుంది అనిపించింది. లిపులన్నీ తొలుత బొమ్మల నుంచి పరిణామం చెందినవే. ఇప్పటికీ చైనా, జపాన్ వంటి దేశాలు బొమ్మలలిపులు వాడుతున్నాయి. సింధూనాగరికత తవ్వకాల్లో లభించిన ముద్రలలోని లిపులు కూడా బొమ్మలనే పోలివున్నాయి.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrarchitecture.com



# ఉప్పు నీరు ఎందుకు చొచ్చుకొస్తుంది?

విశ్రాంత ఆచార్యులు **డా. ఈదా ఉదయ భాస్కర్ రెడ్డి,** పర్యావరణ శాస్త్ర విభాగం,
ఆంధ్రా విశ్వవిద్యాలయం అంతర్జాలంలో అందించిన వ్యాసం.

**భూ**గోళంలో 71 శాతం మేర నీరు ఆవరించి వుంది. అందుకే భూమిని 'నీటి గోళం' అని అంటుంటాం. జీవరాశుల ఉనికికి నీరే ప్రధాన కారణం. సుమారు 65 నుంచి 75 శాతం మేర జీవుల దేహాల్లో నీరే వున్నది. మన దేహంలో ఒక శాతం మేర నీరు తగ్గినట్లైతే దాహార్తిని కలిగిస్తుంది. అదే 10 శాతం మేర తగ్గితే ప్రమాద ఘంటికలు మోగిస్తుంది. ఈ నీరే స్వేదం రూపంలో మానవుల్ని, భాష్పోత్సేకం ద్వారా మొక్కల్ని ఎండ వేడిమికి వడలిపోకుండా కాపాడుతుంది.

ఉష్ణానికి నీరు వాహకంగా ఉపయోగపడుతూ, సూర్యతాపం నుంచి భూగోళాన్ని కాపాడుతుంది. మొక్కలు కిరణ జన్య సంయోగ క్రియ ద్వారా తయారు చేసుకునే పిండి పదార్థానికి అవసరమయ్యే హైడ్రోజన్ మూలకాన్ని నీరే అందిస్తుంది. రాబోయే కొద్దిరోజుల్లో నీరే హైడ్రోజన్ ఇంధనంగా రూపు దిద్దుకుంటుందనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. నీరు ముఖ్యంగా తాగడానికి, వంట చేయడానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు, మురికిని కడగడానికి అవసరమవుతున్న సంగతి తెలిసిందే.

## ఉపయోగపడే నీరు కొంచెమే!

నీటి గోళమైన భూమిపై నీటి కష్టాలు అంటే నమ్మశక్యంగా ఉండదు. కానీ ఇది పచ్చి నిజం. ఇందుకు ముఖ్యకారణం 97 శాతం ఉప్పు నీరుగా సముద్రాల్లోను, 2 శాతం ధ్రువాల్లో మంచు గడ్డల రూపంలో వుండి మొత్తం 99 శాతం మేర వినియోగార్హత కోల్పోవడమే. మనకు ఉపయోగపడుతున్న నీరు అత్యల్పం. భూమి మీద ఉన్న నీరంతా 100 లీటర్లుగా భావిస్తే మనకు ఉపయోగంగా వుండేది కేవలం 3 మిల్లీ లీటర్లు. అంటే, వంద లీటర్లకు అర టీ స్పూనంతన్న మాట! నీరు లేని జీవనాన్ని ఊహించుకోలేం.

అందుకే మన ప్రాచీన నాగరికతలన్నీ నదీ తీర ప్రాంతాల్లోనే రూపుదిద్దుకోవడం చూస్తాం. గత 2 వేల సంవత్సరాల కాలంలో ప్రపంచ జనాభా 50 రెట్లు పెరిగినా నీటి వనరుల్లో ఏ మాత్రం మార్పు లేదు. దీనికి తోడు పారిశ్రామిక, హరిత విప్లవాల వలన, నీటి వినియోగం అనూహ్యంగా పెరిగింది. అంతే కాకుండా, వున్న పరిమిత నీటి వనరుల్ని కలుషితం చేసి నీటి సమస్యను తీవ్రతరం

చేసుకుంటున్నాం.

**ఒకటికి 8 లీటర్లు కలుషితం**

నీరు విశ్వవ్యాప్తంగా లభించే ఏకైక సహజ ద్రావకం. ఎన్నోరకాల మలినాల్ని తనలో కరిగించుకోగలదు. ఈ ధర్మమే నీటి నాణ్యతను దెబ్బతీస్తున్నది. దీనికి తోడు వ్యర్థాలను పలుచబర్చడం ద్వారా కాలుష్యాన్ని పరిష్కరించవచ్చు అనే మూఢ నమ్మకం.. అన్నీ కలిసి నదులు, సరస్సులు, సముద్రాలను తీవ్ర కాలుష్యానికి గురి చేస్తున్నాయి. ఒక లీటరు కలుషిత నీరు ఇంచుమించు 8 లీటర్ల శుద్ధ జలాన్ని కలుషితం చేయగలదు.

వీటన్నిటికి తోడు భూతాపం నీటి సమస్యను తీవ్రతరం చేస్తున్నది. సకాలంలో వర్షాలు రావు, వస్తే పడవలసిన చోట పడవు. పడితే అతివృష్టి, తుపాన్లు, వరదలు లేకపోతే అనావృష్టి, కరువు కాటకాలు, ఆకలి చావులు. ఒక్క మాటలో చెప్పాలంటే కలుషిత నీరు యుద్ధం కంటే ప్రమాదకారి. ఎక్కువ ప్రాణాల్ని బలిగొంటుంది. 80 శాతం జబ్బులు నీటి వనరుల ద్వారానే సంక్రమిస్తూ ప్రపంచస్థాయి చావుల్లో ప్రథమ స్థానంలో నిలిచాయి.

ప్రతి రోజు 6 వేల మంది పిల్లలు డయేరియా, మలేరియా మొదలగు వ్యాధులతో చనిపోవడానికి నీరే కారణమవుతోంది. దీనికి తోడు ఫ్లోరైడ్, నైట్రేట్, ఆర్సెనిక్ (పాషాణం), సైనైడ్, పాదరసం మొదలగునవి నీటి కాలుష్యాన్ని జటిలం చేస్తున్నాయి. పారిశ్రామికంగా ముందంజలో వున్న అమెరికా నీటి వనరుల్లో వెయ్యికి పైగా కాలుష్య కారకాలున్నట్లు తేలింది.

**3 లీటర్లు తోడుకుంటే ఇంకుతున్నది లీటరే**

నీటి కాలుష్యం, నాణ్యత లోపాలకు తోడుగా, 2025 నాటికి ప్రపంచ జనాభాలో మూడు వంతుల్లో రెండు వంతులు తీవ్ర నీటి కొరతను ఎదుర్కోబోతున్నారని ఐక్యరాజ్యసమితి అంచనా. మనదేశం విషయానికొస్తే.. ప్రపంచ జనాభాలో 19 శాతం ఉన్న మన జనాభా అవసరాలకు, ప్రపంచ నీటి వనరుల్లో మనకున్న 4 శాతం నీటి వనరులతో సరిపెట్టుకోవలసి వస్తోంది.

ప్రపంచంలోకెల్లా అత్యధిక వర్షపాతం గల ప్రదేశంగా గతంలో గణుతికెక్కిన చిరపుంజి ప్రాంతం సైతం, తీవ్ర నీటికొరతను ఎదుర్కొంటున్నది. రానురాను నీటికోసం పోరాటాలు తప్పవేమో అనిపిస్తోంది. మనకు సరఫరా అవుతున్న నీటిలో 68 శాతం వరకు ఆవిరి కావడమో లేక కారిపోవడమో జరుగుతున్నదని ఓ అంచనా. నీటి ఎద్దడి తీవ్రతను అధిగమించడానికి భూగర్భ జలాల్ని లోతుల్లోంచి వెలికితీసి దుర్వినియోగానికి పాల్పడుతున్నాం. భూగర్భం నుంచి మనం వెలికితీసే ప్రతి 3 లీటర్ల నీటికి, ఒక లీటరు వర్షం నీటిని మాత్రమే భూమిలోకి ఇంకించగలుగుతున్నాం.

ఇందువల్ల తీర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి భూమి కుంగిపోతోంది. భూగర్భ జలాలు ఉప్పు నీరుగా మారుతున్నాయి. పర్యవసానంగా భూమిలోపలి పొరల్లో శూన్యం ఏర్పడి తీర ప్రాంతంలోని జనావాస నిర్మాణాలు భూమిలోకి కుంగిపోతున్నాయి.



చమురు, సహజ వాయువుల వెలికితీత మూలంగా కూడా మనరాష్ట్రంలో కృష్ణా.. గోదావరి బేసిన్‌లో భూమి కుంగిన సంఘటనలు ఉన్నాయి. భూమి కుంగడంతో పాటు భూగర్భ జలాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకు రావటం సర్వసాధారణం. జల రవాణా మార్గాలు, మురుగు నీటి కాల్వల వల్ల కూడా ఉప్పు నీరు భూగర్భ మంచినీటిలో కలిసే ప్రమాదాలున్నాయి.

### ఒకటికి 40 అడుగుల మేర ఉప్పు నీరు

వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వ్యవసాయ, జనాభా పెరుగుదల, జీవనోపాధికై వలసలు సహజంగానే నీటి వనరులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయి. దీనికితోడు వాతావరణ ఒడిదుడుకులు, వర్షాభావ పరిస్థితులు నీటి లభ్యత, నాణ్యతలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. పర్యవసానంగా లెక్కకు మిక్కిలి బోరుబావులను తవ్వి లోతు నుంచి ఎక్కువ నీరు తోడేస్తున్నారు. దానివల్లా భూగర్భజల మట్టం గణనీయంగా పడిపోతోంది. ఆ మేర పీడనం తగ్గడంతో సమీపంలోని సముద్రపు నీరు మంచినీటితో కలుస్తోంది.

దాంతో ఈ నీరు తాగటానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు (మత్స్య పరిశ్రమ, ఉప్పు తయారీ పరిశ్రమలకు మినహాయించి) పనికిరావటం లేదు. భూగర్భంలోని మంచినీటి మట్టం ఒక అడుగుమేర తగ్గినట్టైతే, సుమారు 40 అడుగుల మేర ఉప్పు నీరు అనూహ్యంగా పైకి ఎగబాకి భూగర్భంలోని మంచినీటిని ఉప్పు నీరుగా మారుస్తుందని ఒక అంచనా! నీటి కొరత నీటి నాణ్యతను, ఆ కలుషిత నీరు ప్రజల ఆరోగ్యాన్ని, నేల సారాన్ని, వ్యవసాయాన్నీ దెబ్బతీస్తోంది. ఏదైనా ఒక రంగానికి దారులు మూతబడుతున్నాయంటే, ఇంకో రంగానికి దారులు తెరుచుకుంటున్నాయి అని అనుకోవాలి.

### తీర ప్రజల జీవనోపాధులపై ప్రభావం

ఇప్పటికే కొన్ని తీర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు ఉప్పు నీరుగా మారినందున ఆయా ప్రాంతాల్లో రైతులు వ్యవసాయానికి స్వస్తి పలికి, చేపలు, రొయ్యల పెంపకానికి శ్రీకారం చుట్టారు. భూగర్భ జలాలు ఉప్పు నీరుగా మారినందున మత్స్యకారులే కాదు సమీప పట్టణ, నగరవాసులూ మంచి నీటిని కొనుక్కొని తాగవలసి వస్తున్నది. జల కాలుష్య నివారణ, శుద్ధి కార్యక్రమాలు, తాగునీటి సరఫరా పేరుతో కొత్త వ్యాపారాలు, పరిశ్రమలు, పలురకాల జీవనోపాధులు ఏర్పడుతున్నాయి.

సముద్రపు ఆహార ఉత్పత్తులు, ఎగుమతులు, వాణిజ్యం పెరగడం వలన జీవనోపాధులతోపాటు స్థూల జాతీయోత్పత్తి కూడా పెరిగి దేశ ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందనటంలో సందేహం లేదు. ఆహారం లేకుండా ఓ 60 రోజులు ఉండగలమేమో గానీ, నీరు తాగకుండా 60 గంటలు ఉండటం అసాధ్యం. నీటిని సంరక్షించుకోవడానికి మన పూర్వీకులు ఆచరించిన పద్ధతులు, నేడు మనకున్న నవీన పద్ధతులను మేళవించి నీటివనరుల్ని సంరక్షించు కోవలసిన అవసరం ఎంతైనా వుంది. ఉమ్మడి వనరులాంటి నీటిని వాడుకోవడంలో ఆసక్తి, కాపాడుకోవడంలో అనాసక్తి జగమెరిగిన సత్యం. నీటి కొరతకు తోడు దుర్వినియోగం కూడా సమస్య జటిల మవడానికి కారణమవుతోంది.

### ప్రకృతిలోనే పరిష్కారం!

నేడు నీటికి పాలతో సమాన ధర చెల్లించి కొంటున్నాం. ఇప్పుడు మనం వాడుకుంటున్న 700 క్యూబిక్ కిలోమీటర్ల నీరు కాక, ఇంకో 1000 క్యూబిక్ కిలోమీటర్ల నీరు మన దేశానికి కావలసి వుంటుంది. కొత్త నీటి వనరులను వెదుకుతూ... వున్న వనరుల్ని దుర్వినియోగ పర్చకుండా తెలివిగా, పొదుపుగా వాడుకోవాలి. మన పూర్వీకులు పాటించిన నీటి యాజమాన్య పద్ధతులు హర్షణీయం. అనుసరణీయం. ఎప్పుడు ఎక్కడ వర్షం పడితే అక్కడ పట్టి దాచుకో, వాడుకో. బకెట్ సాన్నం, బిందు సేద్యంలాంటి పద్ధతులు నీటిని బాగా ఆదా చేస్తాయి.

చాలా సమస్యలకు ప్రకృతే మనకు పరిష్కారం చూపుతుంది. ఇది ప్రకృతిని నిశితంగా పరిశీలిస్తే బోధపడుతుంది. ప్రకృతిలో, అడవులు, సరస్సులు, మైదాన భూములు, వర్షపు నీటిని పట్టి వుంచి మనకు నిరంతరాయంగా అందిస్తుంటాయి. వాటిని ధ్వంసం చేసి నీటి సమస్యల్ని మనమే సృష్టించుకుంటున్నాం. ఎడారి ప్రాంతవాసులకు తెలిసినంత నీటి యాజమాన్యం మరి ఇంకెవ్వరికీ తెలియదు. కనుక వారి పద్ధతులను గమనించాలి. ఆపై ఆచరణలో పెట్టాలి. బెంజిమన్ ఫ్రాంక్లిన్ చెప్పినట్లు బావుల్లో నీరు ఎండిపోయిన నాడు మనకు నీటి విలువ బాగా తెలిసివస్తుంది.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

# ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

## ■ సంగీత సేవలో దక్కన్ రేడియో ■ ఫిబ్రవరి 13న ప్రపంచ రేడియో దినోత్సవం

క్రికెట్ మ్యాచ్, భద్రాచలం రాములోరి కల్యాణం మనం ఒకప్పుడు ఎలా వినే వాళ్లం.. గుర్తుందా.. ఇంటర్నెట్, టీవీలు, ఓటీటీలు ఇవేవీ లేని రోజుల్లో రేడియో ఒక్కటే వార్తలను, వినోదాన్ని అందించిన ఏకైక సాధనంగా ప్రజల మన్ననలు చూరగొంది. రేడియో ఎన్నో సంచలనాలు సృష్టించింది. స్వాతంత్ర పోరాటంలో, గోవా సంగ్రామంలో, పలు ప్రజా ఉద్యమాల్లో రేడియో ప్రజలకు బాగా చేరువైంది. రోజూ నాలుగు పూటలా పలు భాషల్లో వార్తలను ప్రసారం చేస్తూనే, పాటలు, జానపద గీతాలు, శాస్త్రీయ–లలిత సంగీతం, వ్యవసాయ కార్యక్రమాలు, క్విజ్, కథానిక, సినిమా ఆడియోలు ఇలా అన్నింటినీ సమపాళ్లలో ప్రసారం చేసిన రేడియో ప్రజల మనసును ఆకట్టుకుంది. ఓ రెండు దశాబ్దాల క్రితం వరకు పెద్దా చిన్నా అందరికీ అత్యంత ఇష్టమైన వ్యాపకం రేడియో వినటం. స్వాతంత్ర్యం వచ్చే నాటికి మన దేశంలో 6 ఆకాశవాణి కేంద్రాలు మాత్రమే ఉండేవి. అవి: బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసు, తిరుచిరాపల్లి, లక్నో కేంద్రాలు. ప్రస్తుతం (2019 నాటికి) దేశవ్యాప్తంగా 215 ఆకాశవాణి కేంద్రాల నుంచి 337 ప్రసార కేంద్రాలు పని చేస్తున్నాయి. బ్రిటీష్ వారు మనదేశంలో బాంబేలో తొలి రేడియో స్టేషన్ ప్రారంభించారు.



### యునెస్కో గుర్తింపు

1946, ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభించబడింది. కాబట్టి ఆ సందర్భంగా ప్రతిఏటా ఫిబ్రవరి 13న ఈ దినోత్సవం జరుపుకునేలా జనరల్ కాన్ఫరెన్స్ 36వ సెక్షన్‌లో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ప్రకటించాలని బోర్డు యునెస్కోకు 2010లో సిఫారసు చేసింది. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు, ఐక్యరాజ్యసమితి సంస్థలు, అంతర్జాతీయ ప్రాంతీయ సంస్థలు, వృత్తి సంఘాలు, ప్రసార సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు మొదలైనవన్ని ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకోవాలని బోర్డు ఆహ్వానించింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జనరల్ అసెంబ్లీలో ఆమోదించడానికి, ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవం జరుపుకునే విధంగా యునెస్కో డైరెక్టర్ జనరల్ ఈ తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ దృష్టికి తీసుకురావాలని బోర్డు అభ్యర్థించింది. ఈ అభ్యర్థనను యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ పరిగణించి, 36 సి/63 ఫైల్‌లో ఉన్న తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని 2011లో యునెస్కోలోని అన్ని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ప్రకటించాయి. 2012 నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న ప్రపంచ రేడియో దినోత్సవంను జరుపుకుంటారు.

2012లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం మేరకు రేడియో డేను ప్రపంచవ్యాప్తంగా యునెస్కో సభ్యత్వమున్న అన్ని దేశాల్లో అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సెమినార్లు, చర్చలు, రేడియో చరిత్ర, వైభవం, ప్రస్థానం వంటి అంశాలపై భిన్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

### యునెస్కో మూడు థీములతో..

వరల్డ్ రేడియో డేని గత ఏడాది వినూత్నంగా నిర్వహించారు. మూడు సబ్ థీములతో ఎవల్యూషన్, ఇన్నోవేషన్, కనెక్షన్ పేరుతో వీటిని నిర్వహించారు. కరోనా మహమ్మారి కారణంగా ముందుగా రికార్డ్ చేసిన ప్రత్యేక కార్యక్రమాలను రేడియో డే సందర్భంగా ప్రసారం చేశారు. సాధారణ రోజుల్లో అయితే ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీటిని నిర్వహించే వారు. ఏటా ఫిబ్రవరి 13న ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. దీని వెనుకున్న ఆంతర్యం అత్యధిక ప్రజలు రేడియోను మరింత విస్తృతంగా ఉపయోగించేలా చేయటమే. అత్యధికులకు సమాచారం చేరవేసే అత్యుత్తమ సాధనం నేటికీ రేడియోనే. ప్రపంచం నలుమూలలా రీచ్ అయ్యేది రేడియో మాత్రమే. అత్యంత చవకైన సాధనం మాత్రమే కాదు.. సులువుగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా దీన్ని వెంట తీసుకెళ్లవచ్చు. బేసిక్ ఫోన్, స్మార్ట్ ఫోన్లలో కూడా రేడియోను ఫాలో అవ్వచ్చు. ఎఫ్ఎం రేడియో వచ్చాక రేడియోకు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది.

### ఆకాశవాణి (రేడియో):

కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. 1886లో హెన్‌రిచ్ హెర్ట్జ్ అనే శాస్త్రవేత్త రేడియో

తరంగాలను కనుగొన్నారు. ఆతరువాతి కాలంలో మార్కోనీ రేడియోను కనుగొన్నారు.

**ఆల్ ఇండియా రేడియో :**

- 1923లో రేడియో క్లబ్ ఆఫ్ బాంబే దేశంలోనే తొలిసారిగా రేడియో ప్రసారాలను ప్రారంభించింది.
- 23 జూలై 1927 న బ్రిటిష్ హయాంలో తొలి రేడియో స్టేషన్ బాంబేలో ప్రారంభమైంది. ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ నెలకొల్పిన ఆ రేడియో స్టేషన్‌ను అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ప్రారంభించారు.
- 1936లో ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ పేరు ఆలిండియా రేడియోగా మారింది.
- ఆలిండియా రేడియో అధికారికంగా 1956 నుండి ఆకాశవాణిగా పిలువబడుతుంది.

**దక్కన్ రేడియో:**

హైదరాబాద్ రాజ్యంలో మొట్టమొదటి రేడియో స్టేషన్ దక్కన్ రేడియో. ఇది మొదట ప్రైవేటు బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్‌గా 200 వాట్స్ ట్రాన్స్‌మిటింగ్ పవర్‌తో మొదలైంది. ఉర్దూలో కార్యక్రమాలు ఉండేవి. అబిడ్స్‌లోని చిరాగ్ అలీ లేన్‌లోని 'అజామ్ మంజిల్'లో ఇది నెలకొని ఉండింది. చిరాగ్ అలీ కుటుంబ సభ్యులే దీన్ని నిర్వహించేవారు.



దక్కన్ రేడియోను నాటి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ స్వాధీనం చేసుకొని జాతీయం చేశారు. ఖైరతాబాద్‌లో నూతన రేడియో స్టేషన్ ప్రారంభమైంది. 500 వాట్స్ నూతన ట్రాన్స్‌మీటర్ (730 కెహెచ్‌జెడ్)ను నెలకొల్పారు. దీన్ని మార్కోని కంపెనీ (ఇంగ్లాండ్) నుంచి కొనుగోలు చేశారు.

1933లో దీన్ని ప్రారంభించిన సమయంలో ఉర్దూలో వార్తా ప్రసారాలు ఉండేవి. దక్కని దోల్క్ కి గీత్, గజల్స్, ఖవ్వాలీ లాంటి కార్యక్రమాలు వచ్చేవి. మొదట్లో మొహర్రం నెలలో రేడియో ప్రసారాలు ఉండేవి కావు. ఆ తరువాత ఆ నెలలో మొదటి 13 రోజులు మాత్రం ప్రసారాలు నిలిపివేసేవారు. ఆ తరువాత కూడా నెల అంతా పాటల కార్యక్రమాలు ఉండేవి కావు. స్థానిక పత్రికల నుంచి వార్తల సమాచారం సేకరించేవారు.

- హైదరాబాద్‌లో మహబూబ్ అలీ అనే తపాలా ఉద్యోగి 1933లో రేడియో స్టేషన్‌ను ప్రారంభించారు.
- 1935లో ఈ రేడియో స్టేషన్‌ను అప్పట్లో హైదరాబాదును పరిపాలిస్తున్న నిజాం రాజు స్వాధీనం చేసుకున్నాడు.
- 1939లో హైదరాబాద్ రేడియో స్టేషన్‌కు దక్కన్ రేడియోగా పేరు మార్చారు.
- హైదరాబాద్ రేడియో స్టేషన్ నుంచి అప్పట్లో జరిగే ప్రసారాలు ఎక్కువగా ఉర్దూలో ఉండేవి.
- దక్కన్ రేడియో నుంచి తెలుగు, కన్నడ, మరాఠీ భాషల్లో కూడా పరిమిత ప్రసారాలు సాగేవి. దక్కన్ రేడియోలో తెలుగు కార్యక్రమాలను పెంచేందుకు మాడపాటి హనుమంతరావు విశేషంగా కృషి చేశారు.
- 1950లో భారత ప్రభుత్వం డెక్కన్ రేడియోను నిజాం నుంచి స్వాధీనం చేసుకుని, ఆలిండియా రేడియో పరిధిలోకి తెచ్చింది.

**తెలుగులో రేడియో ప్రసారాలు:**

- 1938 జూన్ 16న మద్రాసులో రేడియో స్టేషన్ ప్రారంభం కావడంతో అప్పటి నుంచి తెలుగులో రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రధాని కూర్మ వెంకట రెడ్డి నాయుడు, మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి సి.రాజగోపాలాచారి ప్రారంభోపన్యాసాలు చేశారు.
- మద్రాసు రాష్ట్ర ప్రధాని కూర్మ వెంకటరెడ్డి నాయుడు భారతదేశం – రేడియో అంశంపై తెలుగులో ప్రసంగించారు. ఇది ప్రారంభోపన్యాసం మాత్రమే.
- రేడియో కార్యక్రమాల్లో భాగంగా తొలి తెలుగు ప్రసంగం చేసిన ఘనత గిడుగు రామమూర్తి పంతులుకు దక్కుతుంది. సజీవమైన తెలుగు అనే అంశంపై గిడుగు 1938 జూన్ 18న పదిహేను నిమిషాల ప్రసంగం చేశారు.
- మద్రాసు కేంద్రం నుంచి ప్రసారమైన తొలి తెలుగు నాటకం అనార్కలి. ఇది 1938 జూన్ 24న రాత్రి 8:30 గంటలకు ప్రసారమైంది.
- మద్రాసు కేంద్రం నుంచి తొలి తెలుగు వ్యాఖ్యాతగా మల్లంపల్లి ఉమామహేశ్వరరావు పనిచేశారు. పిల్లల కార్యక్రమాల ద్వారా ఆయన రేడియో తాతయ్యగా ప్రసిద్ధి పొందారు.
- 1948 డిసెంబరు 1న విజయవాడలో రేడియో స్టేషన్ ప్రారంభమైంది.
- 1963లో విశాఖపట్నం, కడపలలో ఆలిండియా రేడియో స్టేషన్లు ప్రారంభమయ్యాయి.

**ఎఫ్ఎం రేడియో:**

ఎఫ్ఎం (ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్) రేడియో చానెల్స్‌కు పరిమిత ప్రాంతంలోని ప్రజల అభిరుచులు, సంస్కృతి ముఖ్యం. అనేక ప్రైవేట్ సంస్థలు దేశవ్యాప్తంగా ఎఫ్ఎం రేడియో ఛానెళ్లను ప్రారంభించాయి. ఆకాశవాణి వివిధ భారతి ఎఫ్ఎంలను కూడా ప్రారంభించింది.

**చాలెంజ్‌లు..**

ఒకప్పుడు వార్తలు–విశేషాలకు, వినోదానికి, ప్రసార సాధనంగా, ప్రచార సాధనంగా విస్తృతంగా సేవలందించిన ఏకైక సాధనం రేడియో. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కారణంగా మూలన పడింది. చిన్న ఊళ్లలో మాత్రమే రేడియోను ఇంకా ఆస్వాదించటాన్ని మనం చూడవచ్చు. రేడియో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లపై అంతర్జాతీయంగా చర్చ జరుగుతున్నా మోడీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' కారణంగా ఆల్ ఇండియా రేడియోకు మంచి యాడ్ రెవిన్యూ వస్తూ చాలా కాలం తరువాత లాభాల బాటపట్టడం విశేషం.


– ఎసికె. శ్రీహరి,
m : 9849930145
e : ackvs08@gmail.com

ప్రకృతే నియంత్రిస్తుంది! **13** ప్రకృతే శాసిస్తుంది!!

# ఇరు ధృవాలు - భూగోళపు రిఫ్రిజిరేటర్లు

(గత సంచిక తరువాయి)

గత ఆరు దశాబ్దాలుగా అంటార్కిటికాకు సంబంధించిన అనేక వాస్తవాలు, విషయాలు బాహ్య ప్రపంచానికి తెలుస్తున్నాయి. ఈ శ్వేత ఖండంపై అనేక పరిశోధనలు జరుగుతున్నట్లుగా చూస్తున్నాం. భూతాపం సముద్రాలపైననే కాకుండా, సహజసిద్ధమైన ఈ మంచు ఖండంపై ఎలా ప్రభావం చూపుతుందో, భవిష్యత్తులో యావత్ భూగోళం ఎంతటి విపత్తును ఎదుర్కోబోతుందో తెలుసుకుంటే కాళ్ళకింద భూమే కాదు మొత్తం భూగోళమే అతలాకుతలం అవుతుంది.


లూయిస్ పగ్

కరోనా కష్టకాలంలో యావత్ ప్రపంచం తనకుతానే (మనిషిని) రక్షించు కునే ఏకైక ఆలోచనలకే పరిమితమైంది గాని, దీనికి సంబంధించిన మూలాల్లోకి, భూమండలానికి జరుగుతున్న వినాశనం గూర్చి, తెరమరుగైతున్న, కనుమరుగైతున్న అశేష జీవజాలం గూర్చి కించిత్తు ఆలోచించడంలేదు. కరోనాను మించిన క్రికెట్ రోగం సాటి మనిషినే కాదు, జంతు జాలాన్ని వీటికి ఉపయోగపడే క్రిమికీటకాల్ని, సూక్ష్మ జీవుల్ని, చివరికి భూమాతకు జరుగుతన్న దాష్టికాన్ని పట్టింపు లేకుండా చేస్తున్నది. పాలకులే ఈ రోగాన్ని పెంచి పోషిస్తున్నారు. చివరికి చదివితే మతిపోయినట్లు మానవత్వమే మంటగలుస్తున్నది. (గత అక్టోబర్ 25, 2021న మెట్రో రైలులో కింద కూర్చున్న ఓ బాలింతరాలి ఉదంతం)

**దినదిన గండం - తరుగుతున్న అంటార్కిటికా!**

గ్లోబును చూసినప్పుడో, పరిశోధనల, ప్రయోగాల సందర్భంగానో కొందరి దృష్టిలో పడే దక్షిణ ధృవభాగం అంటార్కిటికా! ఈ ఖండం యొక్క ఉనికి, నైసర్గిక స్వరూపం, భౌగోళిక మార్పులు చాలామందికి తెలియని అంశాలే! తెలిసినా పెద్దగా పట్టింపు లేనివారే! దాదాపు 1950 దాకా సాగిన యాత్రలన్నీ సాహస యాత్రలుగా మిగిలిపోగా, జులై1, 1957 నుంచి డిసెంబరు 31, 1958 దాకా గుర్తించబడిన **అంతర్జాతీయ జియోఫిజికల్ సంవత్సరం** (Geophysical Year) సందర్భంగా **బెసాన్‌కన్** విశ్వవిద్యాలయం తలపెట్టిన **అంటార్కిటికా అన్వేషణ యాత్ర** (Expedition), ఈ ఖండం యొక్క దీనావస్థను ప్రపంచ దృష్టికి తెచ్చింది. తర్వాత జరిగిన యాత్రలన్నీ వివిధ ప్రయోగాలకు కేంద్రంగా మారగా, క్లాడ్ లోరియస్ తన బృందంతో జరిపిన పరిశోధనలు మాత్రం, అంటార్కిటికాకు జరుగుతున్న విధ్వంసాన్నే కాక, ఈ విధ్వంసం యావత్తు భూగోళానికి ఎలాంటి ముప్పును కలిగించబోతుందో తెలియజెప్పింది. గత కొంతకాలంగా జరుగుతున్న భూభౌతిక, సముద్ర పరిశోధనలు, అంటార్కిటికా ఖండంపై జరిపిన పరిశోధనలు భూమికి సంబంధించిన కొన్ని నగ్న సత్యాల్ని బయటపెట్టాయి.

ఈ మధ్యన ఐక్యరాజ్య సమితికి సముద్రాల రక్షణ సలహాదారుగా వున్న బ్రిటన్‌కు చెందిన **లూయిస్ పగ్** (Lewis Paugh) అంటార్కిటికా మంచు కింద గల నీటిలో ఈది అనేక విపత్కర విషయాల్ని బహిర్గతం చేసాడు. దాదాపు అన్ని సముద్రాలలో అత్యంత దూరం ఈదిన సాహసిగా ఈయనకు గుర్తింపు వుంది. మార్చి 9, 2015న అంటార్కిటికా **రోస్ సముద్రం** (Ross Sea) లోని **వేల్స్‌ఖాతం** (Bay of Whales) లో మైనస్ ఒక డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలో 350 మీటర్ల దూరాన్ని ఈది అంటార్కిటికాలో చోటు చేసుకుంటున్న మార్పుల్ని రికార్డు చేసాడు.

వృత్తి రీత్యా బారిస్టర్ అయిన లూయిస్ సముద్ర ప్రేమికుడు కావడంతో 2005 లోనే అంటార్కిటికా ఈయన దృష్టిని ఆకర్షించింది. దశాబ్దం తర్వాత మంచు పలకల కింద నీటిలో ఈది ఆ నీరు వేడిగా ఉన్నట్లు గుర్తించాడు. పైనంతా మంచు, లోన నీరు, సహజంగా నీరు కూడా చల్లగానే వుండాలి. కాని అలా కాకుండా వేడెక్కడానికి గల కారణాల్ని విశ్లేషించగా, భూ ఉపరితలంలో వెలువడుతున్న కార్బన్ డయాక్సైడ్ సముద్ర నీటిలో కరగడంతో మంచు పలకల కింద నీరు కూడా వేడెక్కుతున్నదని గుర్తించాడు. నిజానికి ఈ వాయువును చల్లని నీరు గ్రహించి సముద్ర గర్భంలో నిలువ చేయడం ద్వారా సముద్ర జీవరాశి మనుగడకు దోహద పడుతుంది. కాని, దీని గాఢత పెరగడంతో జీవరాసికి ప్రమాదమే కాకుండా, పైన మంచు కరుగుతుంది. దీంతో ప్రపంచ వ్యాపితంగా సముద్ర మట్టాలు పెరగడం ప్రారంభిస్తున్నాయి.

**అంటార్కిటికా ఓ సజీవ పరిశోధనా కేంద్రం :**

చెప్పడానికి ఇది మంచుఖండం మాత్రమే కాదు, యావత్ భూమికి ఇదో నిజమైన ఉత్ప్రేరకం (catalyst) భూవాతావరణాన్ని సహజసిద్ధంగా వుంచడానికి దోహదపడే ఓ కాపలాదారు. అందుకే



*2005లో లూయిస్ పగ్ పొందుతున్న శిక్షణ*



*2015లో లూయిస్ పగ్ అంటార్కిటికా సముద్రంలో ఈత*

భూమిపై జరిగే, జరిగిన మార్పులకు ఇదో సజీవ సాక్ష్యం! అన్ని రకాల అవలక్షణాల్ని, విషాల్ని తనలో దాచుకొని, భూమండలానికి, జీవకోటికి ప్రాణదాతగా పనిచేస్తుంది. భూమికి సంబంధించిన మార్పుల్ని, కథనాల్ని ఇది కథలుగా చెపుతుంది. కాని, ఇదంతా నిన్నటి దృశ్యం! నేడంతా తారుమారైతున్నది. మంచుఖండికలు కరగడం ప్రారభించాయి. దీంతో ఈ ప్రాంతంలో కొత్తగా 65,000 వేల సరస్సులు ఏర్పడినట్లు లూయిస్ గుర్తించాడు. ఇవన్నీ కూడా 2005-2015 మధ్యన అధికమైనట్లుగా రికార్డు చేసాడు. ఇందులోని కొన్ని భాగాల్లో $20^0$c ఉష్ణోగ్రత పెరిగినట్లుగా తేలింది. ఈ ఉష్ణోగ్రతలో అడుగు భాగంలో మంచు కరిగి ఏర్పడిన నీరు నదులుగా పారుతున్నట్లు, ఇవి ఉపరితలానికి చేరి సరస్సులుగా మారుతున్నట్లు గుర్తించాడు.

**కరుగుతూ తరుగుతున్న త్వాయ్‌టెస్ మంచు ఖండిక:**

భారత్, అమెరికాకు చెందిన అంతరిక్ష నౌకల డేగ కన్నులు అందిస్తున్న చిత్రాల ప్రకారం అంటార్కిటికా పశ్చిమ భాగాన గల త్వాయ్‌టెస్(Thwaites) ఖండిక అతి పెద్దది. **అముండ్‌సేన్ సముద్రంలోని** (Amundsen Sea) **పైన్ ద్వీపపు** (Pine Island) ఖాతం (Bay) కు ఆనుకొని వున్న ఈ మహామంచు ఖండం చివరి భాగం 120 కి.మీ. వెడల్పుతో సుమారుగా బ్రిటన్ భూభాగంతో సమానంగా వుండి, వెయ్యి మీటర్ల మందంతో వుండేది. ఇంత విశాల మంచు ఖండిక మంచును కోల్పోతూ నీరుగా మారుతున్నట్లు న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన **డేవిడ్ హాలండ్** (David Holland) నాయకత్వంలోని బృందం గత 2020 జనవరిలో గుర్తించడం జరిగింది. వీరు కూడా మూడు నెలల పాటు ఇక్కడే వుండి క్లాడ్ లోరియస్ బృందంలా మంచు పొరల్లోకి 600 మీటర్ల లోతుకు రంధ్రం (bore) వేసి ఈ మధ్యన జరుగుతున్న అంతర్గత మార్పుల్ని పరిశీలించారు. వీరు కూడా ఆ రంధ్రం ద్వారా అడుగుభాగాన వేడినీరు వున్నట్లుగా గుర్తించారు.

నిజానికి భూమి కూడా మామూలు చిన్న గ్రహమేనని, దీనిపై ఈ ధృవం నుంచి ఆ ధృవం దాకా, తూర్పు పడమరలు ఒకదానితో ఒకటి సంబంధాన్ని కల్గివుంటాయని, భూమండలం, జలమండలం, మంచు భాగాలు (Glaciers) విడివిడిగా మనజాలవని, ఇవి ఓ శరీర అవయవాల్లా ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది, మొత్తం భూగోళాన్ని ఓ ఆవాసయోగ్య గ్రహంగా కాపాడుతాయని వీరు భావిస్తూ, ఈ సమతుల్యత ఈ మధ్యకాలంలో దెబ్బతిన్నదని, కొన్ని గణాంకాల్ని పొందుపర్చారు. వీరి పరిశీలన ప్రకారం, మంచు ఖండంపైన నీరు గడ్డకట్టే (freezing) ఉష్ణోగ్రత కన్నా $2^0$c ఉష్ణోగ్రత అధికంగా ఉన్నట్లు, గత కొన్ని దశాబ్దాలుగా త్వాయ్‌టెస్ 600 బిలియన్ టన్నుల మంచును కోల్పోగా ప్రస్తుతం సంవత్సరానికి 50 బిలియన్ టన్నుల మంచు కరిగి తరులుతున్నదని తేల్చారు.

దీని ప్రభావంతో 1990 నుంచి సముద్రాల నీటిమట్టం పెరగడం ప్రారంభించాయని, ఈ లెక్కన మంచు కరిగిపోతూ వుంటే రానున్న కొద్ది రోజుల్లోనే ప్రపంచ వ్యాపిత సముద్ర మట్టాలు 12 అడుగుల ఎత్తుకు పెరుగుతాయని తెలిపారు. అనగా, అంటార్కిటికా మంచు ఖండంలో 3 శాతంగా ఉన్న త్వాయ్‌టెస్ మంచు ఖండిక, భౌగోళికంగా 4 శాతం సముద్ర మట్టాల్ని పెంచగలుగుతుంది. విశ్వవిద్యాలయ విద్యార్థులతో సహా 24 మందిగల బృందం ఈ యాత్రను శీతాకాలంకు ముందే పూర్తి చేయాలనుకున్నా, అనుకూల వాతావరణ పరిస్థితులు లేకపోవడంతో యాత్ర ఆలస్యం కావడం, ఉన్న మూడు నెలలు కూడా ఇబ్బంది కరంగా ఉండడంతో అనుకున్నంత పరిశీలన జరపలేక పోయామని దేవిడ్‌హాలండ్ ఈ సందర్భంగా ప్రస్తావించాడు.


అంతర్జాతీయ త్వాయ్‌టెస్ సంస్థ (ITGC) 2.1 మిలియన్ డాలర్ల గ్రాంట్ అందించిన ఈ ప్రాజెక్టులో ఆయన భార్య **డెనిసె** (Denise) కూడా న్యూయార్క్ నుంచి సహకారం అందించింది.

అయిదు సంవత్సరాల క్రితమే అంటార్కిటికా అడుగుభాగంలోని నీరు వేడెక్కుతున్నట్లు గుర్తించిన మొదటి వ్యక్తి లూయిస్ పగ్ కాగా ఇది వాస్తవమని రంధ్రం వేసి చూపడమే కాక, ఈ నీటిలో ఉప్పునీరు (ఇతర సముద్రాల నీరు కలిసి) కూడా ఉందని దేవిడ్ బృందం తేల్చింది. లూయిస్ 2005 నుంచి 2015 దాకా దశాబ్ద కాలం అంటార్కిటికాలో జరుగుతున్న మార్పుల్ని పరిశీలించి, నీటి ఉష్ణోగ్రతలోని మార్పుల్ని రికార్డు చేసాడు. ప్రస్తుతం దేవిడ్ బృందం పరిశోధనలు మరిన్ని పరిశీలనల్ని జరపాలని భావిస్తున్నది.

**కనుమరుగైతున్న లార్సెన్ బి మంచు పలక**

ప్రధాన మంచు ఖండిక (ice shelf) చివరి అంచుల నుంచి విడివడిన మంచు సముద్రతలంపై తేలుతూ పయనించేదే మంచు

పలకలు ఈ ప్రక్రియ దాదాపు 12,000 సం॥ల నుంచి (మంచు యుగం) జరుగుతున్నట్లు పరిశోధనలు తెలుపుతున్నాయి. ఇలా విడివడిన మంచుతో ఏర్పడిన లార్సెన్ 'బి' మంచు పలక 220 మీ. మందంతో 1995లో సుమారు 3,250 చ.కి.మీ. వైశాల్యం కలిగి వుండేది. కాని నేడు 60 శాతంకు పైగా కరిగి తరిగి పోవడంతో దాని చుట్టూ గల సముద్ర నీటి మట్టం పెరిగినట్లుగా గుర్తించారు. 1990 నుంచి సంవత్సరానికి 2-4 గిగాటన్నుల చొప్పున కోల్పోయిన మంచు, 2006 నాటికి 2240 గిగా టన్నులకు చేరుకుంది. అనగా 300 శాతం పెరిగింది. గతంలో ఇలాగే లార్సెన్ 'ఎ' మంచు పలక కరిగి సముద్రనీరుగా మారినట్లుగా పరిశోధకులు గుర్తించారు.



డేవిడ్ హాలండ్

**ప్రిన్స్ గస్టర్ చానల్ (సముద్రం) రూపొందడం : (Prince Gustar Channel (Sea)**

పశ్చిమ అంటార్కిటికా, తూర్పు **జెమ్స్ రాస్** (James Ross) ద్వీపానికి మధ్యన 1995 వరకు 130 కి.మీ. పొడవుతో, 24 కి.మీ. వెడల్పుతో దాదాపు 700 చ.కి.మీ. వైశాల్యం గల మంచు పలక ఒకటి ఈ మధ్యన కరగడంతో ఓ ఒడల మార్గం (చానల్) ఏర్పడింది. శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం 10,000 సం॥ క్రితం కూడా భౌగోళిక మార్పులకు గురైన ఈ భాగం విచ్ఛిన్నమైనట్లు, 1900 సం॥ నుంచి తిరిగి ఇది రూపు దిద్దుకున్నట్లుగా భావిస్తున్నారు. 1985 వరకు అంటార్కిటికాకు వచ్చే నౌకలను ఇక్కడే లంగర్ వేసి నడుచుకుంటూ వెళ్ళేవారు. కాని, ఈ కొత్త చానల్ ఏర్పడిన తర్వాత నౌకలు మరింతగా అంటార్కిటికా భూభాగంలోకి వెళ్ళుతున్నాయి.



మిచెల్ లారూ

**దెబ్బతింటున్న శీతలీకరణ కేంద్రాలు:**

భూమి ఓ నిర్దిష్ట రూపం దాల్చి జీవరాశి మనుగడకు దోహద పడడానికి మిలియన్ సంవత్సరాలు పట్టినట్లుగా ప్రకృతి సూత్రాల కథనాల్లో చూసాం. భూభాగం, సముద్రాలు ఏర్పడంతో పాటు, ఇరు ధృవాలు మంచు ఖండాలుగా రూపుదిద్దుకున్నాయి. పైననే ప్రస్తావించినట్లుగా ఇవి ఒకదానితో మరోకటి సంబంధాన్ని కల్గి వుంటాయి. కాబట్టే భూగోళంపై వాయువులు, గాలులు, వాతావరణం, ఉష్ణోగ్రతలు, వివిధ రుతువులు ఓ క్రమపద్ధతిలో రూపాంతరం చెంది ఒకదాని తర్వాత మరోకటి, ఓ నిర్ణీత కాలంలో చక్రంలా వస్తూ, పోతూ వుంటాయి. వీటినే ఆరు రుతువులుగా, మూడు కాలాలుగా చెప్పుకుంటాం. ఏ రుతువు మరో రుతువు ధర్మాల్ని కల్గి ఉండక పోగా, ఒక కాలం మరోకాలానికి విభిన్నంగా ఉష్ణోగ్రతల్ని వాతావరణాల్ని ఏర్పరుస్తూ ఉంటాయి. ఈ క్రమానుగత ఛత్రానికి, భూమి పైనున్న విభిన్న భాగాలు అనుసంధానకర్తలుగా పనిచేస్తాయి. అనగా, సముద్రాలు భూభాగంతో, భూభాగం (కొండలు, పర్వతాలు, మైదానాలు, లోయలు) మంచు భాగాలతో తిరిగి ఇవి సముద్ర, భూభాగాలతో అవినాభావ సంబంధాన్ని కలిగి వుంటాయి. ఇదంతా భూమిపై గల విభిన్న రకాల అడవుల పై భాగంలోని ఓజోన్, హరిత వాయువుల నియంత్రణలో జరుగుతూ వుంటాయి. ఈ అడవుల మనుగడ తిరిగి పక్షులపై, జంతువులపై, గాలులపై, వర్షాలపై ఆధారపడడం అనివార్యం. వీటన్నింటికి, శక్తి ప్రధాత స్వయం ప్రకాశితుడైన సూర్యుడే! వీటిని విడివిడిగా చూడలేము. ఇందులో ఏది కాదన్నా, సమతుల్యత దెబ్బతిన్నా, యావత్ భూగోళం మనుగడకే ప్రమాదకరం!

ఉదాహరణకు, సముద్రంపై నుంచి భూమివైపుకు వీచేగాలులు, ఆవిరిగా మారిన తేమను మోసుకొస్తాయి. ఈ తేమ జీవరాశికి ఓ ఏర్‌కూలర్‌గా, ఏర్‌కండిషన్‌గా పనిచేస్తుంది. అలాగే మైదానాల నుంచి వీచే గాలుల్ని, కొండలు, గుట్టలు, ఎత్తైన ప్రదేశాలు నియంత్రిస్తాయి. ఇలా నియంత్రించబడక పోతే, గాలులు (wind) ఏదో ఒకవైపు ప్రయాణించి మరో ప్రాంతంలో ప్రభావాన్ని కల్గిస్తాయి. ఇదే జరిగితే నియంత్రణ (wind) లేని ఏకరీతి గాలులు, అనగా స్థానిక పవనాలు ప్రపంచ పవనాలుగా మారుతాయి. వీటి ఫలితంగా భూగోళంపై ఏ ఉపద్రం సంభవించినా, అవి ప్రపంచ వ్యాపితమైతాయి. ఇప్పుడు వాటిని మనం ప్రత్యక్షంగా చవిచూస్తున్నాం. వేడి, చలిగాలులు, అధిక వర్షాలు, సునామీలు, ఉప్పెనలు, వర్షాభావాలు, అడవులు తగలబడడం నిత్యకృత్యాలుగా భూగోళం అంతటా చూస్తున్నాం. అంటే ప్రమాద ఘంటికలు ఓ ప్రాంతానికో, దేశానికో పరిమితం కాకుండా ప్రపంచీకరణ చెందాయన్న మాట!

ఈ ప్రభావాలు మొత్తంగా ఇరు ధృవాల్లోని మంచు ఖండాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. భూవాతావరణం వేడెక్కడంతో, ఈ ధృవాల మంచు కరగడమే కాక, పర్వత శ్రేణుల్లో నిక్షిప్తమైన (glaciers) మంచు ఖండాలు జాలువారుతున్నాయి. వీటిని మనం కాశ్మీర్‌లో, ఉత్తరాఖండ్‌లో ప్రతీ సంవత్సరం చూస్తూనే వున్నాం. ఇలా కరిగిన ఘనరూప మంచు సముద్రాల్ని చేరడంతో, సముద్ర మట్టాలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. తీర ప్రాంతాలు కోతకు గురైతున్నాయి. అంటే సముద్ర లోతులు కూడా పూడికకు గురైతున్నాయన్న మాట! ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఏం జరగబోతుందో ఊహించడం కష్టమేమికాదు!

ఇలా భూమిపై జరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావం ఏకబిగిన ధృవాలపై పడడంతో, యావత్ భౌగోళిక వాతావరణాన్ని నియంత్రించే ఈ శీతలీకరణ (refrigerators) ఖండాలు వేడెక్కి పోతున్నాయి. ఫలితంగా నియంత్రణ లేని వాతావణ మార్పుల్ని

## ధ్వంసమైతున్న పెంగ్విన్‌ల దేశం!

అంటార్కిటికా అనగానే పెంగ్విన్‌ల రాజసం కళ్ళముందు కదలాడుతుంది. కాని వాటి దర్పం పెను ప్రమాదంలో పడింది. వీటితో పాటుగా చుట్టూ వుండే జలాల్లో మంచు పలకల కింద జీవనం సాగించే తిమింగలాలు, ఓరియాస్ (పెద్దదంతాల తిమింగలం), సముద్ర సీల్లు, స్మోకి అల్‌బట్రాస్ (smoky albatrosses) మొదలగు జంతుజాలంకు మృత్యు గడియలు ముంచుకు వస్తున్నాయి.

ఆ ప్రాంతంలో పరిశోధనలు చేస్తున్న సముద్ర జీవశాస్త్రజ్ఞులు (Marine Biologists) అంచనాల ప్రకారం ఈ శతాబ్దాంతానికి పెంగ్విన్‌లలో రెండు ప్రధాన జాతులైన అడిలై (Adelie), ఎంపరర్ (Emperor) జాతులు కాలగర్భంలో కలిసిపోతాయని భావిస్తున్నారు. కారణం పెంగ్విన్‌లు మంచుపై జీవిస్తాయి గాని, జలంపై కాదు. వీటి మనుగడ, సంతానోత్పత్తి అంతా మంచుతోనే ముడిపడి వుంటుంది. ఇదంతా నీరుగా మారితే, మరో ఆవాసానికి పోలేక, ఇక్కడ వుండలేక పెంగ్విన్‌లు అంతరించి పోతాయి. మానవుడి పొట్ట నింపుకోవడానికై సాగే చేపల, పీతల, రొయ్యల వేట చివరికి అంటార్కిటికా అంచుల్ని తాకింది. దీంతో సముద్ర సీల్ల (seal)కు, తిమింగలాలకు, ఇతర సముద్ర జంతువులకు తీవ్ర ఆహార కొరత ఏర్పడుతున్నది. పరిస్థితి ఇలాగే వుంటే, పెంగ్విన్‌లతో పాటు ఈ జంతువులు కూడా కనుమరుగైతాయి.

పెంగ్విన్‌లపై పరిశోధనలు చేస్తున్న బ్రిటీషు బృందం అందించిన సమాచారం, ప్రకారం 2016లో ఎంపరర్ పెంగ్విన్‌ల


పెంగ్విన్స్

రెండో కాలనీ (వాటి కాలనీలను అంకెలలో సూచిస్తారు) కి చెందిన సుమారు పదివేల పిల్ల పెంగ్విన్‌లు మారిన వాతావరణానికి మరణించాయి. ఈ బృందాలు, కొన్ని పెంగ్విన్‌లను హాల్లెబే (Halley Bay) అనే మరో ప్రాంతంలో సంరక్షించాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఆ వాతావరణం పడిరాక అక్కడ అన్నీ మరణించాయి. సెప్టెంబర్ 2015లో ఏర్పడిన ఎల్‌నినో (Elnino) ప్రభావంతో దాదాపు 25 వేల పెంగ్విన్ గుడ్లు ధ్వంసమైనట్లు వీరు గుర్తించారు.

మసాచుసెట్స్ ఓసియనోగ్రఫిక్ (Oceanographic) సంస్థకు చెందిన పరిశోధకురాలైన **స్టెఫెని జెనావిరర్** (Stephanie Jenouvrier) లెక్క ప్రకారం రానున్న దశాబ్ద కాలంలోని 30 శాతం పెంగ్విన్‌లో మంచునీటిలో కలిసిపోతాయని తెలిపింది.

ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా చవిచూస్తున్నాం. భూ, సముద్ర వాతావరణాల స్థిరత్వం దెబ్బతింటున్నది. భూగోళం ఓ శరీరం అని భావిస్తే, ఇరు ధృవాలు కేంద్రనాడీ వ్యవస్థ అయితే, మిగతా భూభాగాలు శరీర భాగాలు. మరి కేంద్ర నాడీవ్యవస్థనే దెబ్బతింటే, శరీరం ఎలా పట్టుతప్పుందో, అలాగే భూగోళం కూడా ఈ దుస్థితిలోకి నెట్టివేయ బడుతున్నది.

ఇప్పుడు జరుగుతున్న పరిస్థితుల్ని చూస్తుంటే, వీటిని పూర్వ స్థితికి పునరుద్ధరించడం కూడా జరగని పనిగా తోస్తున్నది. మొన్న **గ్లాస్గోలో** జరిగిన ప్రపంచ దేశాధినేతల సమావేశంలో, కర్బన ఉద్గారితాల్ని, మిథేన్ విడుదలల్ని నియంత్రించడానికి, మొత్తంగా నిలుపుదల (zero) చేయడానికి దశాబ్దాలు కావాలని మోడీతో సహా ప్రపంచ నాయకులు చేతులెత్తిన విధం చూసాం! దీన్ని బట్టి ఈ భూగోళ పరిరక్షణ అనేది మాటలకే పరిమితమని తేలిపోయింది. మరి ఈ బాధ్యత


*డ్రిల్లింగ్ చేస్తున్న డేవిడ్ హాలండ్ బృందం*

ఎవరిది అనే ప్రశ్న వేసుకున్నప్పుడు తిరిగి మానవులదని, సంస్కారవంతులమని (civilized) చెప్పుకుంటున్న ప్రజలదేనని తేలుతుంది. మరి ఇది జరుగుతుందా అని అనుకుంటే, సమాధానం కూడా కష్టమే!

భారత్‌లో హిమాలయాల నుంచి మొదలు కొని దక్షిణానగల పడమటి కనుమల్ని ఏ విధంగా అభివృద్ధి పేరున పాలకులే ధ్వంసం చేస్తున్నారో చూస్తూనే ఉన్నాం. వీటిని నిలువరింప చేస్తే... ఆ శక్తి ప్రజలకుంటే, ఈ ప్రజలంతా **దోస్తు, మగరమచ్** (Dost Magarmach) సినిమాలోని బాలుడైన 'రాము' లా జంతువుల్ని ప్రేమిస్తే... భూమి మరికొన్ని వేల సంవత్సరాలు జీవరాశికి ఆలవాలంగా మనుగడను సాగిస్తుంది.

***(వచ్చే సంచికలో అంటార్కిటికా అంతరిస్తే.. కథనాన్ని చూద్దాం!)***

**– డా॥ లచ్చయ్య గాండ్ల,**
m : 9440116162
e : drglachaiah@gmail.com

ద



# సిరిధాన్యాలతో మెట్ట రైతుకు మేలు..

***రబీలో బోర్ల కింద రైతులు వరికి బదులు చిరుధాన్యాల సాగును చేపట్టేలా తగిన ధర కల్పించడం, మిల్లెట్ బోర్డును సత్వరం ఏర్పాటు చేయడం, ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించడం కోసం తెలుగు రాష్ట్రాలు ఇటీవల చర్యలు తీసుకున్నారు. ఈ పరిణామాలను మీరెలా చూస్తున్నారు?***

నాలుగు వర్షాలొస్తే మెట్ట భూముల్లో పండే సిరిధాన్యాల (అవి చిరుధాన్యాలు కావు.. సిరిధాన్యాలు)ను ప్రోత్సహిస్తూ తెలుగు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవటం చాలా సంతోషదాయకం. నీటి పారుదల సదుపాయం ఉన్న ప్రాంతాల్లో రైతులపై ప్రభుత్వాలు దృష్టికేంద్రీకరిస్తూ వస్తున్నాయి.

పేదరికంలో మగ్గుతున్న వర్షాధార వ్యవసాయదారుల అభ్యున్నతిపై, నిర్లక్ష్యానికి గురైన సిరిధాన్యాల సాగు, వినియోగంపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరిస్తున్నందుకు నాకు చాలా సంతోషకరంగా ఉంది. ఈ ప్రయత్నాల వల్ల అల్పాదాయ మెట్ట ప్రాంత రైతాంగం ఆదాయం పెరుగుతుంది. సిరిధాన్యాలను సాగు చేస్తే మనుషులకు అవసరమైన పౌష్టికాహారం అందటంతోపాటు భూమికి, పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది.

***ఆహారం 95% భూమి ద్వారానే అందుతోంది. భూసారం అడుగంటిన నేపథ్యంలో 'నేలల ఆరోగ్యమే మన ఆరోగ్యం' అన్న భావనను మీరు ఎలా చూస్తున్నారు?***

రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కలుపు మందుల మూలంగా భూసారం క్షీణించింది. నిస్సారమైన భూముల్లో సైతం సిరిధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలను రసాయనాలు వాడకుండా సహజ పద్ధతుల్లో పండించుకోవచ్చు. ఈ పంటలు మనుషుల్లో పౌష్టికాహార లోపాన్ని తగ్గించి ఆరోగ్యవంతంగా మార్చడంతోపాటు భూసారాన్నీ పెంపొందిస్తాయి.

***సిరిధాన్యాల ద్వారా ఒనగూరే ఆరోగ్య, పర్యావరణ ప్రయోజనాల గురించి తెలుగు నాట సభలు, సమావేశాల ద్వారా మీరు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రజా స్పందన ఎలా ఉంది?***

ప్రజలు, రైతులు సానుకూలంగా స్పందిస్తున్నారు. సిరిధాన్యాల సాగు విస్తీర్ణంతో పాటు వినియోగం పెరుగుతోంది. నేను చెప్పిన పద్ధతుల్లో కషాయాలను వాడటం, సిరిధాన్యాలను, ఇతర సంప్రదాయ ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకుంటున్న దీర్ఘరోగుల ఆరోగ్యం క్రమంగా స్థిమితపడుతోంది. రోగనిరోధక శక్తిని పెంపొందించు కోవటం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. ఈ మార్పు మరింత వేగవంతం కావాలంటే సంప్రదాయ పంటలను, వికేంద్రీకరణ విధానాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

***జన్యుమార్పిడి పంటలు, జన్యుమార్పిడి ఆహారోత్పత్తుల దిగుమతులకు గేట్లు తెరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ముసాయిదా మార్గదర్శకాలను ఇటీవలే విడుదల చేసింది. ఎప్పటి నుంచో జన్యుమార్పిడి ఆహారాన్ని వినియోగిస్తున్న అమెరికాలో పరిశోధనా శాస్త్రవేత్తగా పనిచేసిన మీరు ఈ పరిణామాలపై ఏమనుకుంటున్నారు?***

పారిశ్రామిక వ్యవసాయ సాంకేతికతల ద్వారా ఉత్పత్తయ్యే ఆహారోత్పత్తుల ద్వారా మన ఆరోగ్యానికి, ప్రకృతికి కూడా నష్టం కలుగుతుంది. సహజ పద్ధతుల్లో పండించుకోవడంతో పాటు వికేంద్రీకరణ పద్ధతుల్లో ప్రజలే శుద్ధి చేసుకొని స్థానికంగా అందుబాటులోకి తెచ్చుకునే అద్భుతమైన మన దేశీయ సంప్రదాయ ఆహారోత్పత్తుల ద్వారా మాత్రమే ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చెప్పడానికి ప్రబల నిదర్శనాలు ఉన్నాయి.

***షుగర్, బీపీ వంటి జీవనశైలి జబ్బులు పెచ్చుమీరుతున్నప్పటికీ తాము తింటున్న ఆహారానికి– జబ్బులు రావడానికి మధ్య నేరుగా సంబంధం ఉందని ప్రజలు అర్థం చేసుకోగలుగుతున్నారా?***

సిరిధాన్యాలను పండించడం, ఖరీదైన ప్రాసెసింగ్ యంత్రాల అవసరం లేకుండా స్వయంగా మిక్సీల ద్వారా శుద్ధి చేసుకొని వినియోగించడం ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు అక్కడక్కడా ప్రారంభించారు. సిరిధాన్యాల సాగును ప్రోత్సహించడంతోపాటు వీటిని ఎలా వండుకొని తినాలో ప్రజలకు రుచి చూపాలి. అన్ని జిల్లాల్లో సిరిధాన్యాల ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహణపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. వినియోగం పెరిగితే రైతులు పండించే సిరిధాన్యాలకు మార్కెట్‌లో మంచి ధర కూడా వస్తుంది.

***ఎద్దు గానుగ నూనెలు, తాటి/ ఈత / జీలుగ బెల్లం ఆవశ్యకతను మీరు నొక్కి చెబుతున్నారు. ప్రజలందరికీ వీటిని అందుబాటులోకి తేవటం సాధ్యమేనా?***


ఎద్దు గానుగ నూనెల వాడకం పెరగటంతో ఎద్దు గానుగలు చాలా చోట్ల ఏర్పాటవుతున్నాయి. ప్రతి గ్రామంలో నూనె గింజలు సాగు చేసుకొని, అక్కడే నూనెలు ఉత్పత్తి చేసి వాడుకోవాలి. తాటి/ ఈత / జీలుగ చెట్లు కోట్ల సంఖ్యలో ఉన్నాయి. వీటి నీరాతో గ్రామాల్లోనే ఎక్కడికక్కడ బెల్లం ఉత్పత్తిని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే సమీప భవిష్యత్తులోనే ప్రజలందరికీ అందించవచ్చు.

***ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకోబోతున్నాం. మీ అభిప్రాయం..?***

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం జరుపుకునే దిశగా సన్నాహకంగా ఒకటీ అరా సమావేశాలు మాత్రమే తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. మరింత విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది.


**–డా॥ ఖాదర్ వలి**

ప్రఖ్యాత స్వతంత్ర శాస్త్రవేత్త,
ఆరోగ్య, ఆహార నిపుణులు










**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో** బాలచెలిమి ప్రచురించిన **'గాడిద తెలివి', 'అంతరిక్ష దొంగలు'** (2018 నవంబర్), **'గుల్లేరు బాలుడు', 'టంగ్ యంగ్'** (2018 డిసెంబర్) అనే నాలుగు కథల పుస్తకాలు వెలువడినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. ప్రతులు కావల్సిన వారు ఈ క్రింది చిరునామా నుండి పొందవచ్చును.

విడి ప్రతి వెల: రూ.30/–

'Bhoopathi Sadan' 3-6-716, Street No.12, Himayathnagar, Hyderabad-500029, Telangana. Mob: 9030626288


మరియు

• Nava Telangana • Manchi Pustakam
• Nava Chetana • Navodaya Book House

# విజయీ భవ

పిల్లల రచనలకు ప్రాచుర్యం కల్పించడం, ప్రచురించడం, పంపిణీ చేయడం, మార్కెటింగ్ లాంటి సమస్యలూ ఉన్నా, ఇలాంటి అంశాలపై దృష్టి సారించిన **'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ'** తెలంగాణాలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది. ఆ 'పది జిల్లాల బడి పిల్లల కథలు ' దక్కన్‌ల్యాండ్ పాఠకులకు పరిచయం చేయడంలో భాగంగా 'మెదక్ బడిపిల్లల కథలు' కథా రచయిత **ఐతా చంద్రయ్య** విశ్లేషణ.

కథల కోసం చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ వారి ఆహ్వానం మేరకు మెదక్ జిల్లా 'బడిపిల్లల కథలు' ఎంపిక కోసం 108 కథలు రాగా కథల కార్యశాలలో పాల్గొన్న నిష్ణాతులైన బాలసాహితీవేత్తలు 18 కథలను ఎంపిక చేశారు. ఈ పుస్తకానికి బొమ్మలు పర్కపెల్లి యాదగిరి వేశారు. ఈ బాధ్యతను నెరవేర్చే క్రమంలో 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' నిష్ణాతులతో ఎన్నో సమావేశాలు, సదస్సులు, చర్చలు, బాల చెలిమి ముచ్చట్లు నిర్వహించింది.




చిన్ని చిన్ని బాలలు / చిగురించిన ఆశలు
దేశమాత మెడలోన / వాడిపోని పూవులు

నేటి బాలలే రేపటి బాధ్యత గల పౌరులు. పసిప్రాయములో బాలలేవి నేర్చుకున్నా జీవితాంతం మరువలేరు. చక్కని సాహిత్యం వారికి సంస్కారం నేర్పిస్తుంది. ఆ సంస్కారమే జీవితమును విజయ పథములో నడిపిస్తుంది. నేటి రోజుల్లో బాలసాహిత్యం మూడు పూవులు, ఆరు కాయలుగా పరిఢవిల్లుతోంది. పిల్లల కోసం పెద్దలు కథలు రాయడం సహజమే. పిల్లల కోసం పిల్లలు కథలు రాయడం విశేషం. బాల రచయితలు పెద్దల ద్వారా కథలు విని పుస్తకాలు చదివి తమ స్థాయిలో కథలు రాయడం వెనుక వారికి మార్గదర్శనం చేసే ఉపాధ్యాలుంటారు. రచయితలైన ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కని మార్గదర్శనం చేయాలి.

ఈ చిన్నారుల కథలు (మెదక్‌జిల్లా పిల్లల కథలు) చదువుతూంటే పై విషయానికి దృవీకరణగా వున్నాయి. బడిలో చదువుతున్న విద్యార్థుల కలం నుండి జాలువారిన ఈ 18 కథలు పిల్లలకే కాదు, పెద్దలకు కూడా నీతిని బోధిస్తాయి. పిల్లల కథల్లో జంతువులు, రాయి - రప్ప మొదలైనవి మాట్లాడుతుంటే అవి ప్రతీకాత్మకంగా మానవులగ్గూడా మంచి దారి చూపించడమే.

18 కథలు నిడివిలో చిన్నవైనా నీతిలో పెద్దవి. ఆదర్శం కథలో రాణి 10వ తరగతి బాలిక పేదరికాన్ని అనుభవిస్తున్నా పెద్దయ్యాక తల్లిదండ్రుల్ని పోషించాలని నిర్ణయించుకుని, అదే పట్టుదలతో చదివి అనుకున్నది సాధిస్తుంది. 'నక్క తోడేలు' కథలో జిత్తులమారి నక్కకు చేతల్లో పాఠం నేర్పుతుంది. 'తొందరపాటు పనికిరాదు' అంటుంది చీమ పాత్ర.

బడిపిల్లలకు మార్గదర్శనం చేసి కథలు రాయిస్తున్న వివిధ పెద్దలు, పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి అమూల్యము. నేటి చిట్టి, చిట్టి బాలలే రేపటి గట్టి రచయితలు కావాలని వీణావాణిని ప్రార్థిస్తున్నాను. అభినందనలతో...

- ఐతా చంద్రయ్య
కథా రచయిత

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL

# బాలారణ్యంలో ఒక రోజు

బాలారణ్యను చూడడం అంటే అదెంతో ఆనందం కలిగించేదే. బాగా దప్పిక గొన్న వేళ ఎడారిలో ఒయాసిస్ ను చూస్తే ఎంత ఆనందం కలుగుతుందో అలాంటి భావన కలుగుతుంది.

బాలారణ్య అనేది ఒక స్థలం మాత్రమే కాదు. ఎన్నో సవాళ్ళ మధ్య.... జీవితాన్ని అనుభూతి చెందేందుకు ఒక నూతన విధానం కూడా. నైట్ అడ్వెంచర్ క్యాంప్ ఆక్స్ ఫర్డ్ విద్యార్థులందరి ముఖాల్లో చిరునవ్వులు విరబూసేలా చేసింది.

బడికి వెళ్ళడం, ట్యూషన్లు, ఆటలకు కోచింగ్ ఇలాంటి రోజువారీ హడావిడి మధ్య బాలారణ్య మనకు గ్రామీణ జీవితాన్ని కళ్ల ముందు కనిపించేలా చేసింది. పిల్లలు రోజూ జీవితం గడిపేది కాంక్రీట్ అరణ్యంలోనే. అయితే పిల్లలు తమకు తాముగా టెంట్ వేసుకోవడం, పచ్చిక బయళ్లపై తమ బసను సౌకర్యవంతంగా మార్చుకోవడం, చుక్కలతో ఉండే ఆకాశాన్ని చూస్తూ గడపడం మాత్రం వారికొక సరికొత్త అనుభూతిని అందిస్తుంది. చలికాలపు రాత్రి పూట అదిక ఆనందదాయక పాఠాన్ని అందిస్తుంది. పొలాల నుంచి చిన్న కట్టెముక్కలను సేకరించి చలి మంట వేసుకోవడం సాయంత్రపు వేళను మరింత ఆనందదాయకం చేసింది. హాట్ ఎయిర్ బెలూన్ల టెక్నిక్ ను ఉపయోగించి రాత్రి పూట దీపం ఎగురవేయడం, దాని ప్రకాశంతో చీకటిని పారదోలడం ఒక అద్భుత అనుభూతి. సంగీతం, వినోదం, ఆటలు అన్నీ కలగలసి ఈ ప్రయాణాన్ని మధుర అనుభూతిగా మార్చాయి.



పాతకాలపు నాటి ప్రయాణ సాధనమైన ఎడ్లబండిని తిరిగి నిర్మించడం ఒక గొప్ప కళగా కనిపించింది. ఆ బండి చక్రం మన నాగరికతకు ఒక ప్రతీకగా కనిపించింది. వెదురుతో ఎడ్ల బండి రూపొందించడం, చక్రాలకు రంగులు వేయడం, ఎడ్లను అలంకరించడం ఒక చక్కటి అనుభూతిని అందించాయి. ఇక బురద మార్గంలో ఎడ్లబండిలో ప్రయాణం అప్పటి వరకూ ఎన్నడూ చేయని ప్రయాణ అనుభవాన్ని అందించింది. అప్పటి వరకూ అలాంటివాటిని సినిమాల్లో మాత్రమే చూశాం.

కాటాపల్ట్ ను తయారుచేయడం ఒక సైన్స్. దాన్ని ఊహించుకోవడం మాకు మరెంతో గొప్ప. కర్రలు, తాడు, బుట్ట, నీటి బెలూన్లు ఉపయోగించి దాన్ని తయారు చేయడంలో సైన్స్ సూత్రాలెన్నో గుర్తుకొచ్చాయి. ప్రాచీన కాలపు యుద్ధరంగం సృష్టించాం. ఫిరంగి గుళ్ల మాదిరిగా బెలూన్లను ప్రయోగించాం. అవి గాల్లోకి ఎగిరి కొంతదూరంలో కిందపడడం 'యురేకా' అనేలా చేసింది.

దిష్టిబొమ్మల కథలెన్నో విన్నాం. పొలాల్లో వాటిని నిజంగా చూశాం. రాత్రి వేళ చల్లటి గాలికి అవి కదలడం చూశాం. కర్రలు, కుండ లాంటివి ఉపయోగించి పిల్లలే వాటిని తయారు చేశారు. కుండకు రంగులు వేసి దాన్ని ముఖంలా చేశారు. పంటలను పాడు చేసే పక్షులను దూరంగా పారదోలేందుకు అది తోడ్పడం చూస్తుంటే, అది ఎంతో స్నేహపూర్వకంగానే కనిపించింది.

ఆవుల పాకను చూశాం. పాలు పితకడం, పేడతో సేంద్రియ ఎరువు తయారు చేయడం, బయోగ్యాస్ ఉపయోగించడం చూశాం. వ్యర్థాల నుంచి విద్యుత్ శక్తిని తయారు చేయడం అనేది పిల్లలకు ఓ కొత్త అనుభవం. రోజూ తాగే గ్లాసెడు పాల వెనుక ఉండే కష్టం ఏమిటో అర్థమైంది.

ట్రాక్టరు పై కూర్చోవడం, దానిపై ప్రయాణం అనేది పిల్లలకు నిజమైన డాక్యుమెంటరీ సినిమాలలా అనిపించింది. రైతుల కష్టాన్ని గౌరవించేందుకు, అర్థం చేసుకునేందుకు వీలు కలిగింది.

సింధూ లోయ నాగరికత సందర్భంగా ప్రజలు రవాణా సాధనాలుగా చెక్కమొద్దుల నుంచి నావలు తయారు చేసుకున్నారు. రాఫ్ట్ ను తయారు చేయడం ఎంతో నైపుణ్యంతో కూడుకున్నది. థర్మకోల్, టైర్లు, కర్రలు ఉపయోగించి దాన్ని తయారు చేయడం విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ ను అందించినట్లయింది. తాము తయారు చేసిన రాఫ్ట్ ను నీటిలోకి తోయడం, అది తేలుతుంటే చూడడం పిల్లలకు అద్భుత అనుభూతిని అందించింది.

శారీరకంగా శ్రమించేందుకు, ఏకాగ్రతతో ఉండేందుకు విద్యార్థులు తాళ్లను పట్టుకొని నదిని దాటారు. బర్మా బ్రిడ్జి యాక్టివిటీని చేపట్టడం వెనుక ప్రధాన ఉద్దేశం పిల్లల్లో భయం పోగొట్టడం, జీవితంలో సవాళ్లను సానుకూల దృక్పథంతో ఎదుర్కొనేలా చేయడం. సురక్షిత చర్యల మధ్య, ఒక మూల నుంచి మరో మూలకు తాళ్లపై నడవడం విద్యార్థులకు ఒక గొప్ప అనుభూతిని అందించింది.

గ్రామీణ వాతావరణంలో జీవితంలోని వివిధ అంశాలపై ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందుదుకు ఈ పర్యటన తోడ్పడింది. తరగతి వెలుపల నేర్చుకోవడాన్ని ఇది మెరుగుపర్చింది. ప్రకృతి ఒడిలో సేదదీరేందుకు వచ్చిన ఏ చిన్న అవకాశాన్ని కూడా పిల్లలు వదులుకోలేదు.

– అనబోయిన స్వామి, m : 9963 87 2222
e: swamyannaboina@gmail.com









A JOURNEY BACK TO OUR ORIGINS
Balāranya
ESTD:1993
PREGNAPUR
WHERE NATURE NURTURES THEIR IMAGINATION



ఆక్స్‌ఫర్డ్
గ్రామర్ స్కూల్
విద్యార్థులు
నైట్ అడ్వెంచర్
క్యాంప్‌లో భాగంగా
బాలారణ్యలో
గడిపారు.





DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 1st - February - 2022,
ISSN 2581-3188
Postal Dates: 28th & 29th Every Month
RNI Regn. No. APTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2021-2023








# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం. పిల్లలలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.


ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది.


**10 పుస్తకాల సెట్ ధర రూ. 330 • తగ్గింపు ధర రూ. 300**

**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716,
స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com*
*website : www.balachelimi.com*




## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు





Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar